ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

fb/prajasakti | Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu | www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 240 | విజయవాడ, బుధవారం 30 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

తెలుగు అర్జునులు



జాతీయ స్థాయిలో తెలుగు క్రీడాకారులు మెరిశారు. ప్రతిష్టాత్మకమైన అర్జున అవార్డులు ఒకటికి రెండింటిని అందుకున్నారు. ఆర్చరీలో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న వెన్నం జ్యోతి, టెన్నిస్‌లో రాణిస్తున్న సాకేత్ మైనేని ఈ ఘనత సాధించారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా వీరు మంగళవారం అవార్డులను అందుకున్నారు.

పూర్తి వివరాలు 12లో

చైనాకు మోడీ

3న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరు

న్యూఢిల్లీ: చైనాలో జరగనున్న తొమ్మిదవ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోడీ హాజరుకానున్నారు. చైనా తీర ప్రాంత నగరమైన జియామెన్‌లో సెప్టెంబరు 3 నుంచి మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుంది. "చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు పుజియన్ ప్రావిన్స్‌లోని జియామెన్ నగరంలో మోడీ పర్యటించనున్నారు" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా దేశాల నేతలు, ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. డోక్లామ్ వివాదం సద్దుమణిగిన తరువాతి రోజునే ఈ ప్రకటన వెలువడటం ఆహ్వానించదగ్గ పరిణామమని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. చైనాలో పర్యటన ముగిసిన అనంతరం మోడీ మయన్మార్‌లో పర్యటిస్తారు.. ఆ దేశ కౌన్సిలర్ ఆంగ్ సాన్ సూకీ, అధ్యక్షుడు యు తిన్ క్యాలతో ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తారు. యాంగాన్, బగాన్ నగరాలను సందర్శించి సెప్టెంబరు 7న తిరిగి భారత్‌కు మిగతా 8లో



బ్రిక్స్ సదస్సులో మోడీ (ఫైల్ ఫోటో)



కాకినాడ ఆరో డివిజన్‌లోని అంబేద్కర్ మున్సిపల్ హైస్కూల్ రేచర్లపేట పోలింగ్ బూత్‌లో వృద్ధులు

ప్రశాంతంగా పోలింగ్

కాకినాడలో 64.78 శాతం

- అక్కడక్కడా ఘర్షణలు
- పలువురి ఓట్లు గల్లంతు

2

ముంబయి జలమయం



ముంబయి నగరంలోని కిమ్ ఆసుపత్రిలోకి చేరిన వర్షపు నీరు

న్యూఢిల్లీ : గడిచిన రెండు రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలు ముంబయి నగరాన్ని ముంచెత్తుతున్నాయి. రానున్న 24 గంటల పాటు పరిస్థితి ఇదేవిధంగా కొనసాగుతుందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం మంగళవారం సూచించింది. ఈ నెల 27 ఉదయం 8 గంటల నుంచి 28 ఉదయం 8 గంటల మధ్య 102 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యిందని తెలిపింది. కాగా సోమవారం 35.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది. ఒక్క శాంతాక్రజ్‌లోనే 28.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వెల్లడించింది. నగరంలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దక్షిణ ముంబయిలో మంగళవారం మధ్యాహ్నం ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్‌జామ్ అయ్యింది. నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలు, ట్రాఫిక్ జామ్‌కు సంబంధించిన దృశ్యాల ఫొటోలు, వీడియోలను ప్రజలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. భారీ వర్షాల కారణంగా ముంబయిలో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ముంబయి నగరంలోని పలు ప్రాంతాలతో పాటు కొన్ని సబర్బన్ ప్రాంతాలు కూడా జలమయమయ్యాయి. మూడు నుంచి నాలుగు అడుగుల మిగతా 9లో

కాంగ్రెస్ ఉన్న కూటమిలో సిపిఎం చేరదు : ఏచూరి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా వున్న ఎన్నికల కూటమిలో సిపిఎం చేరబోదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి మంగళవారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. అయితే జెడి (యు) రెబల్ నేత శరద్ యాదవ్‌తో కలిసి 'సేవ్ కాంపోజిట్ కల్చర్' (ఉమ్మడి సంస్కృతిని కాపాడండి) ప్రచారాన్ని కొనసాగిస్తామని ఆయన చెప్పారు. ఈ ప్రచారానికి సంబంధించిన సమావేశాలకు తమ పార్టీ హాజరవుతుందని, అయతే కాంగ్రెస్‌తో కూడిన మహా కూటమి ర్యాలీలలో తాము పాల్గొనబోమనిఆయన వివరించారు. ఉమ్మడి మిగతా 9లో



విద్యార్థినులపై దూసుకెళ్లిన టిప్పర్

- ఒకరు మృతి
- ఏడుగురికి తీవ్ర గాయాలు

12



విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సిడబ్ల్యూఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జాతీయ కార్యదర్శి ఎంఎ గఫూర్

కార్మిక చట్టాలు బేఖాతర్

- సిఐటియు జాతీయ కార్యదర్శి గఫూర్
- సిడబ్ల్యూఎఫ్ఐ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి నేతృత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతూ, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని సిఐటియు జాతీయ కార్యదర్శి ఎంఎ గఫూర్ విమర్శించారు. హైర్ అండ్ ఫైర్ విధానాలను పెద్దఎత్తున ముందుకు తీసుకొస్తూ కార్మిక సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సిఐటియు అనుబంధ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిడబ్ల్యూఎఫ్ఐ) 60వ కార్యవర్గ సమావేశాలను మంగళవారం విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆయన ప్రారంభించారు. ఫెడరేషన్ అధ్యక్షులు సింగారవేలు ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గఫూర్ ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు మోడీ ప్రభుత్వం చూస్తోందని, మైనింగ్ శాఖను ప్రైవేట్‌కు అప్పగించేందుకు సిద్ధమయిందన్నారు. కార్మిక సంఘాలను, చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందన్నారు. బిజెపి హయాంలో మంచిరోజులు కార్పొరేట్లకు, విదేశీ కంపెనీలకు వచ్చాయని, సామాన్య ప్రజలకు కాదన్నారు. నల్లధనాన్ని వెనక్కు తీసుకొస్తానని చెప్పిన మోడీ, తీసుకురాకపోగా ఇప్పుడు అది మరింత రెట్టింపయిందని తెలిపారు. కార్మికులకు నష్టం చేసే విధానాలను ఒక పక్క ప్రవేశపెడుతూ మరోపక్క మతం పేరుతో వారిని విడగొట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘపరివార్ జరిపిన దాడుల్లో సుమారు 53 మంది కార్మికులు మరణించారని తెలిపారు. మత సామరస్యతకు, కార్మిక వర్గ ఐక్యతకు కృషి చేస్తూ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. నోట్ల రద్దు వల్ల ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు నెలల పాటు భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరకలేదని తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను చంద్రబాబు ప్రభుత్వం చంద్రన్న బీమా పేరుతో పక్క దారి పట్టిస్తోందన్నారు. ఇందుకు మిగతా 9లో

ప్రాజెక్టుల పడక

రాజధాని ప్రాంతంలో కదలని పనులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

రాజధాని కేంద్రం విజయవాడలో రహదారులు, రవాణా, మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులు మొండికేశాయి. ప్రాజెక్టుల గురించి ప్రభుత్వం చెబుతున్నదానికీ, ఆచరణకూ పొంతన కుదరడంలేదు. ఏళ్లతరబడి జరుగుతున్న జాప్యానికి ఈ ప్రాజెక్టులు నిదర్శనంగా నిలుస్తున్నాయి. విజయవాడ-గుండుగొలను జాతీయ రహదారి విస్తరణ ప్రాజెక్టు పనులు ఐదేళ్లుగా ఒక్కడుగూ ముందుకుపడలేదు. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బిఒటి)లో ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టు సంస్థ గామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్సు లిమిటెడ్ 2012లో గుంటూరు జిల్లా కాజ నుంచి పశ్చిమ గోదావరి జిల్లా గుండుగొలను వరకు 103 కిలోమీటర్లు రూ.1684 కోట్లతో ఆరు వరుసల రహదారి విస్తరణకు జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ)తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రాజెక్టులో భాగంగానే విజయవాడ వద్ద 47.88 కిలోమీటర్లు, హనుమాన్ జంక్షన్ వద్ద 6.72 కిలోమీటర్ల మేర బైపాస్ రోడ్లు నిర్మించాల్సి మిగతా 9లో

కనక దుర్గ ఫ్లైఓవర్ నిర్మాణం నత్తనడక

కనకదుర్గ గుడి వద్ద ఆరు వరుసల ఫ్లైఓవర్ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. 2015 డిసెంబరు ఐదో తేదీన దీనికి కేంద్ర మంత్రి గడ్కరీ శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫ్లైఓవర్‌ను 2016 జులై నెలాఖరుకు పూర్తి చేస్తామని ప్రకటించింది. దీంతో పుష్కరాల నాటికి విజయవాడ నగర రూపురేఖలు మారిపోతాయని ప్రకటించింది. మొత్తం రూ.282.4 కోట్ల పనుల్లో ఇప్పటికి రూ.135.47 కోట్ల పనులు మాత్రమే జరిగాయి. కాంట్రాక్టు సంస్థ ఈ ప్రాజెక్టు పూర్తికి 2018 మార్చి వరకు గడువు కోరుతోంది. ఇలా నగరానికే కాకుండా పలు రాష్ట్రాలకు కీలక రహదారిగా ఉన్న ఈ ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయడంలోనూ కీలక శాఖలు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కన్పిస్తోంది.

బిఆర్‌డిలో మళ్లీ ఘోరం



48 గంటల వ్యవధిలో 36 మంది చిన్నారులు మృతి

గోరఖ్‌పూర్ : ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ బిఆర్‌డి ఆసుపత్రిలో మళ్లీ ఘోరం చోటుచేసుకుంది. ఇటీవల ఆసుపత్రిలో సంభవించిన శిశుమరణాల విషాద సంఘటన మరువకముందే మళ్లీ అటువంటి విషాదమే జరిగింది. ఆది, సోమవారాల్లో ఈ ఆసుపత్రిలో 36 మంది చిన్నారులు మృత్యువాత పడటం కలకలం రేపుతోంది. తాజా సంఘటనకు మిగతా 8లో

తెలుగు అభివృద్ధికి 7అకాడమీలు

సిఎం చంద్రబాబునాయుడు



తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి వెలిగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగు భాషను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి కమిటీ వేశామని, ఏడు అకాడమీలను అతి త్వరలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థకు మరిన్ని అధికారాలు ఇచ్చేలా త్వరలో చట్టం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మిగతా 9లో

మున్సిపల్ సమ్మె నగారా

- 15 నుండి సమ్మె
- మంత్రి నారాయణకు జెఎసి నోటీస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తామని ఎపి మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ స్పష్టం చేసింది. వెలగపూడిలోని సచివాలయంలో మున్సిపల్ శాఖ మంత్రి మిగతా 9లో



మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకి సమ్మె నోటీస్ అందజేస్తున్న జెఎసి నాయకులు

ప్రజ్ఞ

1. ఎవరి సంస్మరణార్థం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు?
2. సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేసిందెవరు?
3. తొలి విదేశ్ భవన్‌ను ఎక్కడ ప్రారంభించారు?
4. నేపాల్ ప్రధాని పర్యటనలో భాగంగా భారత్‌తో ఎన్ని ఒప్పందాలు కుదర్చుకున్నారు?
5. ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను ప్రభుత్వం నిషేధించింది?

సమాధానాలు 7లో

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వ్యవసాయ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ విద్యార్థుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ అధికారుల నియామకాలలో ప్రతిభకు పట్టం కట్టాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్రానికి చెందిన వ్యవసాయ కళాశాలల విద్యార్థుల ప్రతినిధులు పవన్ కల్యాణ్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. వ్యవసాయ పట్టభద్రులకు ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం లేకుండా పోయిందని వారు తెలిపారు. నియామకాలకు సంబంధించి గతంలో తీసుకొచ్చిన జీవో నెంబర్ 16ను కొనసాగించడంతో పాటు రాష్ట్ర విద్యార్థులకు వ్యతిరేకంగా ఉన్న జీవో నెం.64ను వెంటనే ఉపసంహరించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పవన్‌కు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులతో సమావేశం అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ వివాదాస్పదంగా ఉన్న జీవో 64ను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు కౌంట్‌డౌన్ ప్రారంభం

- రేపు సాయంత్రం 6:59 గంటలకు పిఎస్‌ఎల్‌వి-సి39 ప్రయోగం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) మరో రాకెట్ ప్రయోగానికి సిద్ధమైంది. మంగళవారం జరిగిన శాస్త్రవేత్తల సమావేశంలో ప్రయోగానికి గ్రీన్‌సిగ్నెల్ వచ్చింది. బుధవారం మధ్యాహ్నం 1:59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఇది నిరంతరాయంగా 29 గంటలపాటు కొనసాగిన అనంతరం పిఎస్‌ఎల్‌వి రాకెట్ గురువారం సాయంత్రం 6:59 గంటలకు నింగిలోకి దూసుకెళ్లనుంది. ఒక్కో ఉపగ్రహానికి సమాంతర శ్రేణిలో మరో నావిగేషన్ ఉపగ్రహాన్ని చేర్చి అన్నింటి సాయంతో ఒకేసారి ఈ సేవలను అందించడానికి ఇస్రో సిద్ధమైంది. ఈ 8వ ఉపగ్రహం విజయవంతంగా కక్ష్యకు చేరితే భారత భూ భాగం, సముద్ర మార్గం, ఆకాశ మార్గంపై నావిగేషన్ సేవలు మన పరిజ్ఞానం తోనే స్వయంగా అందుకునే అవకాశం ఉంది.



వృద్ధులను పోలింగ్ బూత్‌కు ఇలా..



21వ డివిజన్‌లో భారీగా వచ్చిన ఓటర్లు

ప్రశాంతంగా పోలింగ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. టిడిపి, వైసిపి నేతల మధ్య, బిజెపి, వైసిపి నేతల మధ్య అక్కడక్కడా చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మొత్తంగా 64.78 శాతం పోలింగ్ నమోదైంది. కార్పొరేషన్‌లోని 48 డివిజన్లలో 2,29,373 మంది ఓటర్లు ఉండగా, 1,48,598 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం అత్యధికంగా 15వ డివిజన్‌లో 80 శాతం, అతి తక్కువగా 4వ డివిజన్‌లో 51 శాతం నమోదైంది.

ఉదయం కొద్దిపాటి చినుకులు పడటంతో మందకొడిగా ఓటింగ్ ప్రారంభమైంది. 8 గంటలకు ఏడుశాతమే ఓట్లు పోలయ్యాయి. 9 గంటలకు 26,329 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 12.38 శాతానికి పెరిగింది. 10 గంటలకు 18.55 శాతానికి, 11 గంటలకు 26.61 శాతానికి, 12 గంటలకు 34.95 శాతానికి, 1 గంటకు 42.33 శాతానికి చేరుకుంది. 2 గంటలకు 1,11,198 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో ఓటింగ్ శాతం 48.48కి చేరుకుంది. 3 గంటలకు 54.73 శాతానికి, 4 గంటలకు 61.06 శాతానికి, 5 గంటలకు 64.78 శాతానికి ఓటింగ్ జరిగింది. ఓటు వేయడానికి వచ్చిన వారి గుర్తింపు పత్రాల పరిశీలన ఆలస్యం కావడంతో పలుచోట్ల ఓటర్లు ఇబ్బంది పడ్డారు. కొన్ని డివిజన్ల పోలింగ్ ఒకేచోట ఏర్పాటుచేశారు. అలాంటి ప్రాంతాల్లోనూ ఓటర్లు తికమకపడ్డారు. వృద్ధులు, వికలాంగులు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారుసైతం వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పలు ప్రాంతాల్లో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నాయి. 9వ డివిజన్‌లో బిజెపి జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య, వైసిపి తరపున కంపర రమేష్ పోటీ చేస్తున్నారు. రమేష్ బిజెపి కార్యకర్తపై చేయి చేసుకోవడంతో మాలకొండయ్య ప్రశ్నించారు. దీంతో అభ్యర్థుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. బిజెపి ఎంఎల్‌సి సోము వీర్రాజు పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకోవడంతో, వీరి మధ్య కూడా తోపులాట చోటుచేసుకుంది. వీర్రాజు పోలీసులను సైతం తోసుకుంటూ ఘర్షణకు దిగారు. దీంతో, పోలీసులు అక్కడి నుంచి పంపివేశారు. 14 డివిజన్ ఏటిమొగలో ఎంఎల్‌ఎ సోదరుని కుమారుడు వనమాడి ఉమాశంకర్ టిడిపి తం పున, అంకాడి సత్తిబాబు వైసిపి తరపున పోటీ చేస్తున్నారు. ఎంఎల్‌ఎ కొండబాబు, ఆయన సోదరుడు సత్యనారాయణ దగ్గర ఉండి పోలింగ్ సరళిని పరిశీలించడంతో వైసిపి అభ్యర్థి సత్తిబాబు అభ్యంతరం తెలిపారు. టిడిపి నేతలు ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో ఇరుపక్షాలు తోపులాటలకు దిగాయి. అడ్మిన్ ఎస్‌పి ఎఆర్ దామోదర్ నేతృత్వంలో పోలీసు బృందాలు చేరుకున్నాయి. ఎంఎల్‌ఎ, ఆయన సోదరుడిని అక్కడ నుంచి వెళ్లిపోవాలని పోలీసులు కోరారు.

32వ డివిజన్ రామకృష్ణారావు పేటలో వైసిపి కార్యకర్తలు ఓట్లు అభ్యర్థించడాన్ని గమనించిన ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు వారిని ప్రశ్నించారు. సమాధానం ఘాటుగా చెప్పడంతో ఎంఎల్‌ఎ కొండబాబు చేయిచేసుకున్నారు. వైసిపికి చెందిన మాజీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అక్కడకు చేరుకోవడంతో, ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులు వారిని పంపించేశారు. అనంతరం ఎస్‌పి విశాల్ గున్నీ వచ్చి బందోబస్తు పెంచారు.

28వ డివిజన్‌లో టిడిపి, వైసిపి అభ్యర్థులు సుంకర పావని, సత్యవతి మద్దతుదారులు మోహరించడంతో పోలీసులు ఇరుపక్షాలను చెదరగొట్టారు. 30వ డివిజన్‌లో వైసిపి, టిడిపి అభ్యర్థులు రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, బాదం బాలకృష్ణల మద్దతుదారులు మోహరించడంతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. 47వ డివిజన్‌లో వైసిపి, బిజెపి అభ్యర్థుల భర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. 38వ డివిజన్‌లో వైసిపికి అనుకూలంగా పనిచేస్తున్నారనే ఆరోపణతో రాజమహేంద్రవరం ఎస్‌ఐ డి.రాంబాబును ఎన్నికల విధుల నుంచి ఎస్‌పి తప్పించారు.

మాజీ మేయర్ సహా పలువురి ఓట్లు గల్లంతు

అన్ని డివిజన్లలోనూ ఓట్లు గల్లంతయ్యాయనే ఫిర్యాదులు వచ్చాయి. కాకినాడ తొలి మేయర్ అయిన కవికొండల సరోజ ఓటు గల్లంతు అయ్యింది. 41వ డివిజన్‌లో సరోజ గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓటు వేశారు. తన భర్త, అత్తమామలతోపాటు ఆడపడుచులకు ఓటు ఉన్నా తన ఓటు ఎలా గల్లంతైందని ఆమె ప్రశ్నిస్తున్నారు. దీనిపై జిల్లా రిటర్నింగ్ అధికారి కలెక్టర్‌ను ప్రశ్నించారు. కమిషనర్ అలీం బాషాను కూడా ఆమె ఫోన్‌లో సంప్రదించారు. ఓటు ఎలా గల్లంతైందో పరిశీలించాలని బాషా సమాధానమిచ్చారు. 43వ డివిజన్‌లో రిటైర్డ్ ఉద్యోగి భూపతి రంగారావుకు, ఆయన భార్యకు ఓటు లేదు. ఆయన కుమార్తెలు, మనవలు, అల్లుళ్లకు ఓట్లు ఉన్నాయి. దీనిపై ఆయన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఇలా ఓటు గల్లంతైన వారు అధికారులకు ఫిర్యాదు చేశారు.

పారదర్శకంగా డిఇఓల ప్రమోషన్లు, బదిలీలు

- పిడిఎఫ్ ఎమ్మెల్సీల డిమాండ్
- 11 జిల్లాల్లో డిఇవో పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా విద్యాశాఖ అధికారు(డిఇవో)ల ప్రమోషన్లు, బదిలీలు పారదర్శకంగా జరగాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు జిల్లాల్లో మినహా మిగతా జిల్లాల్లో డిఇవోల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ వి బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీలు బొడ్డు నాగేశ్వరరావు, వై శ్రీనివాసులురెడ్డి, రాము సూర్యారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజధానిలోనూ డిఇవో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సర్వశిక్షా అభియాన్‌లో కూడా ఈ క్యాడర్ పోస్టుల అవసరముందని వివరించారు. ఖాళీల భర్తీలో అక్రమాలు జరుగుతున్నట్లు వార్తలు రావడం చాలా దురదృష్టకరమన్నారు. వేలాది మంది ఉపాధ్యాయుల్ని చిన్నవివాదం లేకుండా బదిలీలు చేయగలిగిన విద్యాశాఖ రెండుపదులకు మించని డిఇవో పోస్టుల భర్తీ, బదిలీల విషయంలో అపఖ్యాతి పాలు కావడం బాధాకరమన్నారు. దీని ప్రభావం మొత్తం విద్యావ్యవస్థ మీద పడుతుందని సూచించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు కూడా ఇందులో జోక్యం చేసుకొంటున్నాయని తెలిపారు. ఏ జిల్లాలో ఎక్కువ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలున్నాయో ఆ జిల్లాలకు వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. శక్తిలేని వారు మారుమూల జిల్లాలకు పరిమితం కావడం వల్ల, ఈ డిఇవోల పర్యవేక్షణ, ప్రభుత్వ పాఠశాలలపై వారి శ్రద్ధ ఎలా ఉంటుందో చెప్పనక్కరలేదన్నారు. రెగ్యులర్ డిఇవో పోస్టుల్ని ప్రస్తుతం భర్తీ చేసి, సర్వశిక్షాభియాన్ పోస్టుల్ని తర్వాత నింపాలనుకోవడం కూడా అనుమానాలకు తావిస్తోందన్నారు. కాబట్టి అన్ని డిఇవో స్థాయి పోస్టులు ఒకేసారి భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల విధానాన్నే డిఇవోలకు పాటించాలని డిమాండ్ చేశారు.



నంద్యాల ఉపఎన్నికల్లో గెలిచిన భూమా బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా బాబు ఆయనను అభినందించారు. ఎన్నికల్లో బాగా పనిచేశారని అన్నారు. ఫోటోలో మంత్రి అఖిలప్రియ కూడా ఉన్నారు.



కేసులెలా రద్దు చేస్తారు?

ఏపి సర్కార్‌పై హైకోర్టు ఆగ్రహం

- టిడిపి నేతల కేసుల రద్దు పిల్‌ను విచారించిన ధర్మాసనం
- హైకోర్టు ఆదేశించే వరకూ కేసుల్ని ఎత్తేయం : ఏజి

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టిడిపి నేతలు 274 మందిపై ఉన్న వివిధ రకాల కేసుల్ని రద్దు చేయడాన్ని సవాల్ చేసిన వాజ్యాన్ని హైకోర్టు మంగళవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం కౌంటర్ పిటిషన్‌ను దాఖలు చేయకపోవడంపై బెంచ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కేసులెలా రద్దు చేస్తారని ప్రశ్నించింది. టిడిపి పెద్దలపై పోలీస్ కేసుల్ని రద్దు చేస్తూ జారీ అయిన పలు జీవోల్ని ప్రస్తావిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణా రెడ్డి ఉమ్మడి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ పిల్‌ను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించి ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎంతమందిపై ఏయే కారణాలతో కేసులు ఎత్తేశారో, అందుకు ఎన్ని జీవోలిచ్చారో తెలియజేయాలని ప్రతివాదుల్ని బెంచ్ ఆదేశించింది. ఎంతమందిపై దోపిడీలు, దొమ్మీలు, హత్య, అత్యాచార తదితర ఆరోపణల కేసులున్నాయో పట్టిక రూపంలో తెలియజేయాలని గతంలో హైకోర్టు ఆదేశించిన మేరకు పిటిషనర్ ఆళ్ల రామకష్ణా రెడ్డి ధర్మాసనానికి నివేదించారు. హత్య, అత్యాచార కేసుల్ని కూడా రద్దు చేశారని అతని తరఫు న్యాయవాది సుధాకర్‌రెడ్డి వాదించారు. ఈ కేసులపై కింది కోర్టుల్లో విచారణకు వచ్చినప్పుడు ఏం చేస్తారని ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌ను బెంచ్ ప్రశ్నించింది. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం కౌంటర్ పిటిషన్లు దాఖలు చేసే వరకు కింది కోర్టుల్లో కేసులపై విచారణ వాయిదా వేయమని కోరతామని, అప్పటి వరకు ఆ కేసుల్ని రద్దు చేసేది లేదన్న అడ్వకేట్ జనరల్ ఇచ్చిన హామీని హైకోర్టు రికార్డు చేసింది.

ఒక జీవోను అందరికీ ఆపాదిస్తున్నారు : ఏజి దమ్మాలపాటి

ఒక జీవోలోని విషయాలను మొత్తం కేసుల ఎత్తివేతకు ఆపాదిస్తూ వాదించడం సబబుకాదని అడ్వకేట్ జనరల్ పేర్కొన్నారు. అభ్యంతరాల్ని కింది కోర్టుల్లో చెప్పుకోవాలని, రాజకీయ వాదన చేయకూడదన్నారు. కేసుల్ని ఎత్తేసే అధికారం ప్రభుత్వానికి ఉందంటూ సుప్రీంకోర్టు గతంలో తీర్పు చెప్పిందని గుర్తు చేశారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ "పిటిషనర్ రాజకీయ ప్రయోజనాన్ని పక్కకుపెట్టండి. అవసరమైతే ఈ కేసును హైకోర్టే సుమోటోగా చేపడుతుంది. ప్రతివాదులందరికీ (కేసులెత్తేసిన వారికి) నోటీసులిస్తాం" అని ప్రకటించింది. వెంటనే ఏజి కల్పించుకుని తొలుత ప్రభుత్వ వాదన తెలుసుకునేందుకు ఏపి సర్కార్‌కు నోటీసులివ్వాలని సూచించడంతో అందుకు ధర్మాసనం అంగీకరించింది.

జీవోల్ని కొట్టేయాలి : పిటిషనర్ తరపు న్యాయవాది పొన్నవోలు

సిఎం చంద్రబాబు తన మంత్రివర్గంలోని కొందరు సభ్యులు, అధికార టిడిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర పార్టీ నేతలపై గతంలో పోలీసులు నమోదు చేసిన కేసుల్ని ఉపసంహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ తేదీల్లో జారీ చేసిన పలు జీవోల్ని కొట్టేయాలని పిటిషనర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. అధికార పార్టీ నేతలపై నమోదైన కేసులపై పలు కోర్టుల్లో జరుగుతున్న ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకోవాలని ఆయా కోర్టుల పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆదేశిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు రాజ్యాంగ విరుద్ధమంటూ ప్రకటించాలని కోరారు. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమైన ఆ జీవోల్ని కొట్టేయాలన్నారు. 274మంది టిడిపి నేతలపై కేసుల ఉపసంహరణకు ఏపి సర్కార్ 132 జీవోల్ని జారీ చేసిందని, మూకుమ్మడిగా కేసులెత్తేసే ప్రభుత్వ ప్రయత్నాల్ని అడ్డుకోవాలని ఆయన హైకోర్టును కోరారు. ఏపి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాదరావు, మండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఉప ముఖ్యమంత్రి కెఇ కష్ణమూర్తి, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కింజరాపు అచ్చెన్నాయుడు, గంటా శ్రీనివాసరావు, సిద్దా రాఘవరావు, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీలు కరణం బలరాం, ఎమ్మెల్యేలు నందమూరి బాలకష్ణ, టీవీ రామారావు, గొల్లపల్లి సూర్యారావు, దాట్ల సుబ్బరాజు, దాసరి బాలవర్ధనరావు, చింతమనేని ప్రభాకర్, ఎ.ఆనంద రావు, ఎం.అశోక్‌రెడ్డిలతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, టిడిపి నేతలు, పార్టీ కార్యకర్తలు ఇలా మొత్తం 274 మందిపై కేసుల్ని చంద్రబాబు సర్కార్ రద్దు చేసిందని పిల్‌లో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. 274 మందినీ వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. డిజిపి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, వివిధ జిల్లాల కలెక్టర్లను ప్రతివాదులుగా చేశారు. కేసు విచారణ మూడు వారాలకు వాయిదా పడింది.

అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాలకు కాంట్రాక్టు నామినేషన్‌పై ఎలా ఇచ్చారు?

హైకోర్టులో ఎమ్మెల్యే ఆర్కే పిల్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాల హక్కులను అడ్వాన్స్‌డ్ టెలీ కమ్యూనికేషన్స్‌కు అక్రమంగా ఇచ్చారంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. నామినేషన్ విధానంపై రెండేళ్లకు లైవ్ ప్రసారాలు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ మంగళగిరి వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ రిట్‌ను ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారించి ప్రతివాదులైన ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి, అసెంబ్లీ కార్యదర్శి, అడ్వాన్స్‌డ్ టెలీకమ్యూనికేషన్స్‌కు నోటీసులు జారీ చేసింది. ఎలాంటి టెండర్లు పిలవకుండా ఆంధ్రజ్యోతి దినపత్రిక యజమాన్యానికి సంబంధించిన అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌కు అసెంబ్లీ లైవ్ ప్రసారాలు ఎలా ఇస్తారని పిటిషనర్ తరఫు న్యాయవాది పి.సుధాకర్‌రెడ్డి వాదించారు. నామినేషన్ విధానంలో ఇవ్వడంలో ఆ కంపెనీకి ఉన్న అర్హత ఏమిటి, గంటకు రూ.75 వేలు చొప్పున చెల్లింపునకు ప్రమాణికం ఏమిటి, రెండేళ్లకు కాంట్రాక్టు ఎలా ఇచ్చారో తేల్చాలని ఆయన హైకోర్టును కోరారు. టెండర్లు లేకుండా అసెంబ్లీ ప్రసారాల కాంట్రాక్టును నామినేషన్ విధానంలో ఎందుకిచ్చారో వివరణ ఇవ్వాలని ప్రతివాదులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణ వచ్చే నెల 12కి వాయిదా వేసింది.

బాలకృష్ణపై హైకోర్టులో వైసిపి కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్

నంద్యాల ఉప ఎన్నిక ప్రచార సమయంలో బాహాటంగా ఓటర్లకు డబ్బులిచ్చిన హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణపై ఎన్నికల సంఘం కేసు నమోదు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తూ ప్రతిపక్ష వైసిపి ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్ హైకోర్టులో కేసు వేశారు. నంద్యాలలో 16న బాలకష్ణ రోడ్‌షో నిర్వహించినప్పుడు ఓటర్లకు డబ్బులిచ్చి ప్రలోభపర్చుకున్నారని ఈ రిట్‌లో పేర్కొన్నారు. ఫొటో ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఎన్నికల సంఘం కేసు నమోదు చేయక పోవడం అన్యాయమన్నారు. కోర్టు స్పందించి ఇసి కేసు పెట్టేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. రిట్ లో కేంద్ర ఎన్నికల సంఘం, ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, నంద్యాల నియో జకవర్గ రిటర్నింగ్ అధికారి సహా బాలకష్ణనూ ప్రతివాదులుగా పేర్కొన్నారు.

మాట వినకపోతే అంతే!

- పంటల బీమా నుంచి బజాజ్ ఔట్
- సిఎం ఆగ్రహం ఫలితం
- క్లెయిముల వివరాలు ఇవ్వనన్నందుకే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పంటల బీమా అమలుకు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ఎంపికలో చంద్రబాబు ప్రభుత్వం అస్మదీయులకే పట్టం కడుతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. తన మాట వినని సంస్థలను పక్కన పెడుతున్నట్లు సమాచారం. తన ఆదేశాలను తిరస్కరించినందుకు బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి అవకాశం ఇవ్వకుండా ముఖ్యమంత్రి తెరవెనుక చక్రం తిప్పినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు మేలు చేసేందుకంటూ మోడీ సర్కారు పంటల బీమా పథకాల అమలులో ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలను ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు ప్రభుత్వరంగంలోని అగ్రికల్చరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా (ఎఐసి)నే దేశం యావత్ పంటల బీమా స్కీంలను అమలు చేయగా గతేడాది నుంచి సర్కారీ సంస్థతో పాటు ప్రైవేటు కంపెనీలూ ఆ రంగంలోకి వచ్చి పడ్డాయి. జాతీయ స్థాయిలో ప్రైవేటు సంస్థలను గుర్తించిన కేంద్రం రాష్ట్ర స్థాయిలో వాటిలో వేటినైనా ఎంపిక చేసుకునే అధికారాన్ని రాష్ట్రాలకు విడిచిపెట్టింది. పంటల బీమా అమలు ఏజెన్సీల (ఐఎ) ఎంపిక ప్రక్రియను రాష్ట్ర స్థాయిలో అధికారులు, బ్యాంకర్లతో సమన్వయ కమిటీ చేపట్టాలంది. ఏపీలో మొదటి సంవత్సరం 2016-17 ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో సర్కారు నోటిఫై చేసిన పంటలకు బీమా అమలు చేసేందుకు బిడ్లు ఆహ్వానించారు.

వాతావరణ ఆధారిత బీమా పథకం (డబ్ల్యుబిఐఎస్) అమలుకు బజాజ్ అలియాంజ్ సంస్థను ఎంపిక చేశారు. నిరుడు ఖరీఫ్‌లో రాయలసీమ నాలుగు జిల్లాల్లో తీవ్ర కరువు రావడంతో వేరుశనగ పంటకు అపారనష్టం వాటిల్లింది. సీమ నాలుగు జిల్లాల్లో వేరుశనగకు వాతావరణ బీమా అమలైంది. బీమాను అమలు చేసిన బజాజ్ కంపెనీ రైతులకు ఎక్కువ క్లెయిములు చెల్లించాల్సి వచ్చింది.

బీమాతో ఇన్‌పుట్ లింక్

వేరుశనగ పంట నష్టపోయిన రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాల్సి ఉంది. కేంద్రం ఇన్‌పుట్ సబ్సిడీ తక్కువ ఉంది. అది పోను మిగతా మొత్తాన్నీ రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. దీంతో నిధులను మిగుల్చుకునేందుకు చంద్రబాబు సర్కారు బీమాకు, ఇన్‌పుట్ సబ్సిడీకి లింక్ పెట్టింది. రెండూ కలిపి హెక్టారుకు రూ.15 వేలు చొప్పున గరిష్టంగా రెండు హెక్టార్లకు చెల్లిస్తామంది. ఇన్సూరెన్స్ క్లెయిము ఎంత వచ్చిందో తెలిస్తేనే రాష్ట్ర ప్రభుత్వం జత చేయాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ తేలుతుంది. అందుకోసం రైతుల వారీగా ఇన్సూరెన్స్ క్లెయిముల పూర్తి సమాచారం ఇవ్వాలని బజాజ్ సంస్థను బాబు సర్కారు కోరింది. కాగా క్లెయిముల వివరాలు నిబంధనల ప్రకారం రహస్యంగా ఉంచాలని, వెల్లడించడం కుదరదని, ఎవరైనా కోర్టులకెళితే ఇబ్బందని బజాజ్ కంపెనీ ఏపీ సర్కారు వినతిని తోసిపుచ్చింది. పైగా వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగిస్తుందని అభిప్రాయపడింది. అంతేకాకుండా తాను చెల్లించాల్సిన క్లెయిముల మొత్తాన్నీ రైతుల ఖాతాలకు విడుదల చేయనారంభించింది. దీంతో ఆగ్రహం చెందిన సిఎం, తన ఆదేశాలను పాటించని బజాజ్ కంపెనీకి తదుపరి పంటల బీమా అమలులో అవకాశం ఇవ్వొద్దని అధికారులకు హుకుం జారీ చేసినట్లు సమాచారం.


కొర్రీలు పడతాయనే...

స్వయానా ముఖ్యమంత్రే అసంతృప్తితో ఉన్నారని తెలుసుకున్న బజాజ్ కంపెనీ 2017-18 ఖరీఫ్‌లో బిడ్ దాఖలు చేయలేదని తెలిసింది. ఒక వేళ టెండర్ వేసినా కొర్రీలు పడతాయని భావించినట్లు సమాచారం. ప్రస్తుత ఖరీఫ్‌లో వాతావరణ బీమా అమలుకు బజాజ్ స్థానంలో హెచ్‌డిఎఫ్‌సి-ఎర్గో జనరల్ ఇన్సరెన్స్ కంపెనీ ఎంపికైంది. కాగా నిరుడు రెండు సీజన్లలో వాతావరణ బీమాను అమలు చేసిన బజాజ్ ఈ సంవత్సరం మొత్తానికే ఉనికిలో లేకపోవడం గమనార్హం. కాగా ప్రభుత్వ పెద్దలు, కొంత మంది ఉన్నతాధికారుల వాదన మరోలా ఉంది. ముందుగా ఊహించినదాని కంటే ఎక్కువ క్లెయిములు చెల్లించాల్సి రావడం వల్లనే రెండో ఏడాది బజాజ్ కంపెనీ బిడ్ దాఖలు చేయలేదని చెబుతున్నారు. ఒకవేళ ఆ వాదనే నిజం అనుకుంటే, ప్రయివేటు సంస్థలు లాభాల కోసమే పని చేస్తాయి తప్ప రైతుల సంక్షేమం కోసం కాదని బజాజ్ రుజువు చేసినట్లవుతుందని వ్యవసాయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పెరుగుతున్న గోదావరి

- భద్రాచలం వద్ద 19.09 అడుగులు
- సముద్రంలోకి 1.84 లక్షల క్యూసెక్కులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి



రాజమహేంద్రవరంలో గోదావరి నీటి ఉధృతి

గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. శబరి, పాములేరు, సోకులేరు నీటి ప్రవాహం గోదావరిలో కలవడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10 అడుగులకు చేరుకుంది. అదే సమయంలో భద్రాచలంలో 19.09 అడుగులకు నీటిమట్టం చేరింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజికి చెందిన 175 గేట్లను 0.05 మీటర్ల ఎత్తుకు లేపి మంగళవారం 1.84 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. అదే సమయంలో ఉభయగోదావరి జిల్లాల డెల్టా కాల్వలకు 10,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాల్వలకు 3,600 క్యూసెక్కులు, మధ్య డెల్టా కాల్వలకు 2,300 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. గోదావరిలో ఇన్‌ఫ్లో మూడు లక్షల క్యూసెక్కులు ఉండటంతో కాళేశ్వరం వద్ద 5.04 అడుగుల నీటిమట్టం నమోదైంది. అదే విధంగా పేరూరు వద్ద 7.07 అడుగులు, దుమ్ముగూడెం వద్ద 6.90 అడుగులు, కూనవరం వద్ద 8.56 అడుగులు, కుంట వద్ద 10.10 అడుగులు, కోయిదా వద్ద 11.96 అడుగులు, పోలవరం వద్ద 7.60 అడుగులు, రాజమహేంద్రవరం హేవలాక్ బ్రిడ్జి వద్ద 13.84 అడుగుల నీటిమట్టం నమోదైంది.

పర్యాటకం.. ప్రయివేటుకే వరం



- వందకుపైగా ఒప్పందాలన్నీ పిపిపి విధానంలోనే..
- ఎపిటిడిసి రిసార్టులుండగా స్టార్ హోటళ్లకు స్వాగతాలు

గోదావరి తీరాన పాపి కొండల హొయలు.. నిత్యమూ పచ్చదనంతో అలరారే కోనసీమ.. అక్కడి కొబ్బరి తోటలు... అరకు అంద చందాలు.. టెంపుల్ టూరిజంలో అటు తిరుపతి, ఇటు పంచారామాలు.. ఇలా ఒకటేమిటి ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకానికి అనువుకాని ప్రదేశమే లేదంటే అతిశయోక్తి లేదు. ఎన్నో ప్రాచీన కళలకు పుట్టినిల్లు ఇది. ఈ నేపథ్యంలో వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచేందుకు ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిటిడిసి) ద్వారా పర్యాటక శాఖ పలు సన్నాహాలైతే చేస్తోంది. కానీ అంతా ప్రయివేటు పరమేనంటోంది. మనకున్నన్ని వనరులు లేని సింగపూర్ వంటి దేశాలతో పోల్చుకుంటూ, ప్రయివేటు సంస్థలకు పెద్దపీట వేస్తే పర్యాటకంతో పెరిగే ఆదాయంలో సింహభాగం అవి తన్నుకుపోతాయని, అవి మన సంస్కృతీ సంప్రదాయాలను, వారసత్వ సంపదను పక్కన బెట్టి, పాశ్చాత్య సంస్కృతికే బాటలు వేస్తాయని పలువురు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఈ రంగంలో పలు ఒప్పందాలన్నీ పిపిపి విధానంలోనే చేసుకున్న నేపథ్యంలో పర్యాటకంపై ప్రజాశక్తి ఫోకస్...

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పర్యాటకం పూర్తిగా ప్రయివేట్ పరమవుతోంది. ఇప్పటికే చేసుకున్న 113 అవగాహన ఒప్పందాలకు తోడు అదనంగా మరో 17 ప్రయివేట్ టూర్ ఏజన్సీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. పబ్లిక్ ప్రయివేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానంలో ప్రభుత్వ సంస్థలను ప్రయివేట్‌పరం చేసేదిశగా రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు సాగుతున్నాయి. పర్యాటక మిషన్ వ్యూహం ద్వారా అన్ని రకాల ప్రధాన థీమ్, సబ్ థీమ్‌లలో పిపిపి విధానాల ద్వారానే ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతి, సర్వీసుల నిర్వహణను ప్రయివేటుకు అప్పజెప్పేందుకు సర్కారు సన్నద్ధమైంది. ఇందుకోసం ఇప్పటికే 13 జిల్లాల్లో స్వయం ప్రతిపత్తి గల మండళ్లను, జిల్లా పర్యాటక, సాంస్కృతిక మండళ్లను ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కూడా పిపిపి విధానంలో ఐదు కొత్త ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలన్నింటిలో ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్(ఎపిటిడిసి) రిసార్ట్‌లలో పర్యాటకులు బస చేసే సదుపాయమున్నా, ప్రయివేట్ హోటళ్లయిన తాజ్, ఐటిసి, నోవాటెల్ వంటి కంపెనీల త్రీ స్టార్ హోటళ్లలో పర్యాటకులు ఉండేందుకు వీలుగా 200 గదులను ఏర్పాటు చేసింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీ ఎత్తున గండి పడుతుంది. ఈ ఏడాది 17 ప్రయివేట్ టూర్ ఏజెన్సీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఎకో టూరిజం, బీచ్ టూరిజం, క్రూయిస్ టూరిజం వంటి నూతన విభాగాలను ప్రయివేట్ సంస్థల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి చేయలేమని ఎపిటిడిసి స్పష్టం చేస్తోంది.

బీచ్ టూరిజం..

దేశంలోనే చిన్న రాష్ట్రమైన గోవా బీచ్ టూరిజానికి కేరాఫ్ అడ్రస్ నిలిచింది. ఏటేటా గోవా బీచ్‌లకు సందర్శకుల సంఖ్య పెరుగుతోంది. గోవా పర్యాటకంలో పబ్ కల్చర్ ఎక్కువగా కనిపిస్తుంది. అక్కడ మద్యం కూడా తక్కువ ధరకు లభించడంతో పాటు, తాగి చిందులేసేందుకే అధిక భాగం గోవాను ఎన్నుకుంటారు. ఆ గోవా బీచ్ తరహాలో విశాఖ బీచ్‌ను ఎపి పర్యాటక శాఖ అభివృద్ధి చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో బీచ్ లవ్ ఫెస్టివల్‌ను విశాఖలో నిర్వహించాలని ఓ ప్రయివేటు సంస్థ యోచించింది. మహిళా సంఘాల నుంచి ఆందోళనలు రావడంతో వెనక్కి తగ్గింది. ఆ ఫెస్టివల్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటును అందించిందన్న వాదనలూ వచ్చాయి. నెల్లూరులోని మైపాడు, కాకినాడ ఉప్పాడ, గుంటూరు జిల్లాలోని సూర్యలంక, కృష్ణా జిల్లా మచిలీపట్నం మంగినపల్లి బీచ్‌లలోనూ బీచ్ టూరిజం అభివృద్ధి చేసేందుకు ఎపిటిడిసి ప్రణాళికలు సిద్ధం చేసింది. బీచ్ టూరిజం ఫీవర్ యువతలో మొదలైతే పాశ్చాత్య సంస్కృతి వైపు అడుగులు పడతాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విలేజ్ టూరిజం దారెటో..!

రహదారి పక్కన ఉన్న చిన్న పర్యాటక ప్రాంతాలను కూడా అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని పర్యాటక శాఖ విలేజ్ టూరిజం పేరుతో కొత్త ప్రాజెక్టులను చేపట్టింది. రిసార్ట్‌లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేసి పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించాలని ఎపిటిడిసి యోచిస్తోంది. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా విలేజ్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆ మేరకు చర్యలు చేపట్టడం లేదు. రెస్టారెంట్లలో మద్యాన్ని విక్రయించరాదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ఇప్పటికీ కొన్ని రెస్టారెంట్లలో మద్యం ప్రవాహమే అవుతోంది. విలేజ్ టూరిజం పేరుతో అభివృద్ధి చేస్తున్న ప్రాంతాల్లో మద్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టకపోతే యువత పెడదారి పట్టే అవకాశముందన్న వాదనలూ వినిపిస్తున్నాయి.

వారసత్వం కన్నా ఆదాయమే మిన్నా?

ఒక వైపు బీచ్ టూరిజానికి వంతపాడుతున్న ప్రభుత్వం ప్రాచీన, వారసత్వ కట్టడాలనూ ఆదాయ వనరులుగానే చూస్తోంది. ప్రభుత్వం పట్టించుకోపోవడం వల్ల కళావిహీనంగా మారిన ప్రాచీన కట్టడాలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. కడప జిల్లాలోని గండికోట, ఒంటిమిట్ట, కర్నూలు జిల్లాలోని యాగంటి, మహానంది, అహోబిలం, అనంతపురం జిల్లాలోని పెనుగొండ కోట, గుత్తి కోటతో పాటు పలు ప్రాంతాలు అలనాటి రాజుల పాలనకు సజీవ సాక్ష్యాలుగా నేటికీ దర్శనమిస్తున్నాయి. రాజధాని ప్రాంతంలోని ఉండవల్లి గుహ కూడా పురాతన పర్యాటక ప్రాంతాల్లో ఒకటి. అక్కడ పర్యాటక శాఖ పర్యాటకుల నుంచి రుసుమును వసూలు చేస్తున్నా అభివృద్ధి చర్యలను మాత్రం విస్మరించింది. రాష్ట్రంలోని అన్ని ప్రాచీన పర్యాటక ప్రాంతాల నిర్వహణ తీరంతా అదే విధంగానే ఉంది.



ఒప్పందాల కోసమే మార్టుల్లో భాగస్వామ్యం

పర్యాటక శాఖ బయట నుండి నిర్వహణ ఒప్పందాలను కుదుర్చుకోవడానికి వీలుగా దేశీయ, అంతర్జాతీయ మార్టుల్లో వివిధ ముఖ్య నిర్వాహకుల మధ్య జరిగిన వ్యాపార సంబంధమైన సమావేశాల్లో 22 జాతీయ, 5 అంతర్జాతీయ వ్యాపార మార్టుల్లో భాగస్వామ్యం అవుతూ ఎపి టూరిజం వాటిలో పాలు పంచుకుంటోంది. ఎపి నుండి పర్యాటక నిర్వాహకులకు, దుకాణాలకు స్థలం కల్పించింది. ఇండియా ట్రావెల్ మార్ట్, ఇండియా ఇంటర్నేషనల్ మార్కెట్ ట్రావెల్స్ అండ్ టూరిజం ఫేర్, ట్రావెల్ టూరిజం ఎక్స్‌పో, ఇండియా ఇంటర్‌నేషనల్ ట్రేడ్ ఫేర్, టిటిఇ, పిఎటిఎ, ట్రావెల్ మార్ట్, టిఎఎఐ, చలో టిటిఇ వంటి మార్టులు, ప్రదర్శనలు, ఫెయిర్స్, జర్మనీలో జరిగే అంతర్జాతీయ పర్యాటక బోర్డు(ఐటిబి)ల్లో ఈ ఏడాది కూడా పాల్గొని మరిన్ని ప్రయివేట్ ఒప్పందాలను కుదుర్చుకోవాలని పర్యాటక శాఖ ఆలోచిస్తోంది.

పర్యాటకంపై జిఎస్టీ పోటు

రాష్ట్ర వ్యాప్తంగా 2016లో 15,35,05,118 మంది పర్యాటకులు పర్యాటక ప్రదేశాలను సందర్శించారు. ఈ లెక్కలనే ప్రాదిపదికగా తీసుకున్నా పర్యాటకులపై ఏడాదికి రూ.921 కోట్ల అదనపు భారం జిఎస్టీతో పడనుంది. అంతే కాకుండా భోజనం బిల్లులపైనా 18 శాతం భారం పడనుంది. ఇది వరకూ చిన్నపాటి హోటళ్లలో భోజనంపై సేవా పన్నును వసూలు చేయడం లేదు. జిఎస్టీ ప్రకారం ఐదు నక్షత్రాల హోటళ్లలో భోజనం, బసపై ఏకంగా 28 శాతం సేవా పన్నును వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ఐదు నక్షత్రాల హోటళ్లలో 15 శాతం సేవా పన్నును విధిస్తున్నారు. ఈ హోటళ్లలో బస చేసే వారు 13 శాతం అదనపు మోతను భరించాల్సి వస్తుంది. ప్రస్తుతం రూ.6వేలు రోజు వారీ అద్దె ఉన్న గదిపై రూ.900 సేవా పన్ను విధిస్తున్నారు. జిఎస్టీ అమల్లోకి వచ్చాక ఆ పన్ను రూ.1680కి పెరిగింది.

అగ్నిమాపక శాఖలో సిబ్బంది కొరత

డ్రైవర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌పై పేచీ
ఫైర్, పోలీసు శాఖల మధ్య తేల్చని పంచాయతీ
ఖాళీల భర్తీ కోసం నిరుద్యోగుల ఎదురుచూపు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. ఎక్కడ ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా క్షణాల్లో సంఘటనా ప్రాంతానికి చేరుకుని నష్ట నివారణా చర్యలు తీసుకోవాల్సిన అగ్నిమాపక శాఖలో.. దిగువ స్థాయి పోస్టుల్లో అత్యధికంగా ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో కలిపి 3,900 మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉండగా, 2,100 మందే ఉన్నారు. అగ్నిమాపక శాఖలో కీలకమైన డ్రైవర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగడంలేదు. రాష్ట్రవ్యాప్తంగా 169 డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉంటే ప్రభుత్వం ఇటీవల 55 పోస్టుల భర్తీకి అనుమతించింది. నోటిఫికేషన్ విషయంలో పోలీస్, అగ్నిమాపక శాఖల మధ్య పంచాయతీ నడుస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అగ్నిమాపక శాఖ డిజి నోటిఫికేషన్ ఇచ్చేవారు. నేడు యూనిఫారం ఉద్యోగులకు సంబంధించిన నోటిఫికేషన్లను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం చెబుతోంది. పోలీస్‌శాఖ మాత్రం గతంలో మాదిరిగానే అగ్నిమాపక శాఖే నోటిఫికేషన్ ఇవ్వాలని పేర్కొంటుండగా, పోలీస్ శాఖ రిక్రూట్‌మెంట్ చేయాలని ప్రభుత్వం చెబుతోందని అగ్నిమాపక శాఖ వాదిస్తోంది. రెండు శాఖల పంచాయతీ ఎటూ తేలకపోవడంతో డ్రైవర్ల పోస్టుల నోటిఫికేషన్ ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఈలోగా అదనంగా ఉన్న ఆర్‌టిసి డ్రైవర్లను తమ శాఖకు కేటాయించాలని అగ్నిమాపక శాఖ చేసిన ప్రతిపాదనలపై ఆర్థిక శాఖ మెలికపెట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో హోంగార్డుల ద్వారానైనా భర్తీ చేసుకుంటే ఎలా ఉంటుందనే అంశాన్ని అగ్నిమాపకశాఖ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

జిల్లా కేంద్రాల్లో టాస్క్‌ఫోర్స్, అందుబాటులో రెస్క్యూ టీమ్‌లు

రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లా కేంద్రాల్లో ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని ఆర్తులను ఆదుకోవడంతోపాటు ప్రాథమిక చికిత్స అందించేందుకు ఒక్కో టాస్క్‌ఫోర్స్ బృందంలో 14 మంది సభ్యులను నియమించారు. వీరందరూ ప్రత్యేక శిక్షణ పొందిన వారే. అత్యవసర వైద్యం అందించే నిమిత్తం రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి వెళ్లేందుకు ఒక్కో అగ్నిమాపక శకటాన్ని రూ.3 లక్షల అదనపు ఖర్చుతో ఆధునికీకరించేందుకు ఆ శాఖ ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఒక వాహనాన్ని అందుబాటులో ఉంచగా, మరో నాలుగు ఇదే తరహాలో తయారు చేసేపనిలో నిమగ్నమైనట్లు అగ్నిమాపక శాఖ డిజి సత్యనారాయణ తెలిపారు.



విజయవాడలో బస్సు దగ్ధం

ప్రయాణికులు క్షేమం

ప్రజాశక్తి - మొగల్రాజపురం (విజయవాడ)

విజయవాడ కొత్త ప్రభుత్వాస్పత్రి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం ఓ ఆర్‌టిసి బస్సు దగ్ధమైంది. రూట్ నెం.54 (ఆటోనగర్-గుణదల-రైల్వేస్టేషన్)లో ఎపి 11 జెడ్ 6409 నెంబర్ గల సిఎన్‌జి బస్సు ఆటోనగర్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళుతోంది. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వాస్పత్రి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ బస్సును పక్కన ఆపి ప్రయాణికులను దించాడు. దీంతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. ఈ ఘటనలో బస్సు పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఇంజన్లో తలెత్తిన సాంకేతిక లోపం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక సమాచారం. జాతీయ రహదారిపై ఘటన జరగడంతో వాహనాలు భారీఎత్తున నిలిచిపోయాయి. కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన శాఖ డిడి సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరక్టర్ డి.జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉద్యాన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యాన పంటలకు సంబంధించి రైతులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సబ్సిడీల్లో కొంత భాగం తనకు ఇవ్వాలని డిడి డిమాండ్ చేస్తున్నట్లు చాలా కాలంగా ఆరోపణలు ఉన్నాయి. కొంత మంది తమకు అందిన సబ్సిడీలో కొంత భాగం ముట్టచెప్పి ప్రభుత్వ పథకాల ద్వారా కూరగాయలు, పండ్ల తోటలు పెంచుకుంటున్నారు. అయితే గుంటూరు రూరల్ మండలం గోరంట్లకు చెందిన ప్రసాదరెడ్డి, అమరావతి మండలం మందపాడు గ్రామానికి చెందిన శివరామిరెడ్డి అనే ఇద్దరు రైతులను సబ్సిడీలో 30 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేయడంతో వారు ఉద్యాన శాఖ కమిషనర్‌ను ఆశ్రయించారు. ఈ సందర్భంగా తమతో జయచంద్రారెడ్డి చేసిన ఫోన్ సంభాషణలను కూడా వారు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై విచారణ నిర్వహించిన కమిషనర్ ఆరోపణల్లో ప్రాథమిక సాక్ష్యాలుండటంతో అవినీతి ఆరోపణలపై జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

కాలువలో 125 కిలోల గంజాయి

ప్రజాశక్తి- సాలూరు (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా సాలూరు పట్టణంలోని కోటవీధి, కోట దుర్గగుడి ఎదురుగా ఉన్న కాలువలో మంగళవారం గంజాయి బస్తాలు కనిపించాయి. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాలువలో వీటిని పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. సుమారు పది లక్షల రూపాయల విలువైన 125 కిలోల గంజాయిని కాలువలో పడేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిఎస్‌టి ఆన్‌లైన్ కష్టాలు

- నెట్‌వర్క్ 'ఇన్ఫోసిస్' చేతికి
- రూ.1500 కోట్లతో కేంద్రం ఒప్పందం
- సాంకేతిక సమస్యలతో సర్వర్ ఇబ్బందులు
- ఒక్కో ఫైల్ రిటర్న్‌కు రెండేసి గంటలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చిన జిఎస్‌టికి చెందిన ఆన్‌లైన్ నెట్‌వర్క్‌ను రూ.1500 కోట్లతో ప్రైవేట్ సంస్థ ఇన్‌ఫోసిస్‌కు అప్పగించింది. కర్నూలు జిల్లాలో 15 వేల మంది ట్రేడర్లు ఉన్నారు. దేశవ్యాప్తంగా 50 లక్షల మంది డీలర్లు ఉన్నారు. వీరంతా జిఎస్‌టి కింద రిజిస్టర్ అయ్యారు. వీరు తమ ఇన్‌కంట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేసుకోవాలంటే ఇన్‌ఫోసిస్ సంస్థ ద్వారా ఆన్‌లైన్‌లో చేసుకోవాల్సిందే. అయితే సాంకేతిక సమస్యలతో ఇన్‌కంట్యాక్స్ ఫైల్ రిటర్న్స్ ఆలస్యం అవుతున్నాయి. ఒక్కో ఫైల్ రిటర్న్ చేయడానికి కనీసం రెండు గంటల సమయం పడుతోంది. నేను సాంకేతిక విప్లవకారుణ్ణి అని చెప్పుకునే ప్రధానమంత్రి మోదీ దేశ వ్యాప్తంగా పన్నుల వ్యవస్థను మార్చినపుడు సాంకేతిక సమస్యలు తలెత్తితే ఎలా అన్న విషయం గుర్తుకు రాలేదా అని పలువురు డీలర్లు ప్రశ్నిస్తున్నారు. రిటర్న్స్ ఆలస్యం అయితే దానిమీద పడే వడ్డీలకు బాధ్యులెవరని ఆందోళన చెందుతున్నారు.

జిఎస్‌టి, దాని టెక్నాలజీ గురించి డీలర్లకు ఇప్పటికీ ఎలాంటి అవగాహన లేదు. చిన్న వ్యాపారులకు తమ ఇన్‌కంట్యాక్స్ రిటర్న్స్ ఎలా ఫైల్ చేయాలో తెలియదు. ఇందులో భాగంగా జిఎస్‌టిఎన్ కింద 30 ప్రయివేటు కంపెనీలకు సంబంధించిన ఫైల్ రిటర్న్స్ బాధ్యతను.. ఇన్‌ఫోసిస్ సువిధ ప్రొవైడర్స్‌కు సబ్ కాంట్రాక్ట్ ఇచ్చింది. అంటే కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిని ఒక వ్యాపారంగా మార్చింది. ముందుగా సాంకేతిక సమస్యలను తొలగించకుండా, డీలర్ల సమస్యలు తీర్చకుండా, జిఎస్‌టికి సంబంధించిన నెట్‌వర్క్ వ్యవస్థను అప్‌డేట్ చేయకుండా, ఇన్‌కంట్యాక్స్ ఫైల్ రిటర్న్స్‌ను కూడా వ్యాపారంగా మార్చి ఒక్కో ఫైల్ రిటర్న్‌కు కొంత సొమ్ము చెల్లించేలా చేసింది. ఈ నెల 1 నుంచి ఇన్‌కంట్యాక్స్ ఫైల్ రిటర్న్స్ మొదలైంది. 20వ తేదీలోపు పూర్తి చేయాలి. కానీ సర్వర్ సరిగా పనిచేయనందున ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించారు. దేశంలో జిఎస్‌టి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు 50 లక్షల మంది ఉన్నారు. వీరంతా 25వ తేదీ లోపు రిటర్న్స్ ఫైల్ చేయాలి. జిఎస్‌టి ఆర్3బి కూడా ఫైల్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. 2017 జూన్ 30 నాటికి డీలర్ల వద్ద ఉన్న క్లోజింగ్ స్టాక్ మీద పన్ను ఏమైనా ఉంటే ట్రాన్స్ 1 ను ఈ నెల 28 లోపు ఫైల్ చేసుకోవాలి.

తలలు పట్టుకుంటున్న అధికారులు : ప్రధానంగా జిఎస్‌టి సూపర్‌వైజింగ్ మొత్తం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. వ్యాపారులు తమ రిటర్న్స్‌ను ఎవరు ఎంత ఫైల్ చేస్తున్నారు, ఎంత ట్యాక్స్ కడుతున్నారు అనేది సంబంధిత అధికారులకు తెలియడం లేదు. వాస్తవానికి ప్రతిరోజు ఆన్‌లైన్ రిపోర్టు ఇవ్వాలి. అవేవీ రాకపోవడంతో సంబంధిత అధికారులకు జిఎస్‌టి విధానం తలనొప్పిగా తయారైంది. కనీసం సేల్స్ ట్యాక్స్ ఛీఫ్ కమిషనర్‌కు కుడా సమాచారం ఇవ్వడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నెట్‌వర్క్‌ను తమ ఆధీనంలో పెట్టకోవడమే మూల కారణంగా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు భావిస్తున్నారు. గత వ్యాట్ చట్టంలో ఎవరైనా రిటర్న్ ఫైల్ చేయగానే అధికారులకు తెలిసేది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడిందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

రక్తమోడుతున్న హైవేలు

- రోడ్లు అధ్వానం, ఏర్పాటు కాని స్పీడ్ బ్రేకర్లు
- బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు ప్రక్రియలో రవాణా శాఖ



ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలతో జాతీయ రహదారు(హైవే)లు రక్తమోడుతున్నాయి. ఏడాదికి సరాసరిన 8 వేలకు తగ్గకుండా మృత్యువాత పడుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావట్లేదు. వేలాది మంది క్షతగాత్రులు కావడంతో యువత కోలుకోలేని దెబ్బతింటోంది. ప్రమాదాలకు అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, కార్లలో సీటు బెల్టు ధరించకపోవడం, హెల్మెట్ లేకుండా బైక్‌లు నడపడం ప్రధాన కారణాలుగా అధికార యంత్రాంగం భావిస్తోంది. జాతీయ రహదారులపై పలు ప్రాంతాల్లో ముఖ్యంగా ఆర్‌అండ్‌బి రహదారుల నుంచి హైవే రోడ్డు ఎక్కే ప్రాంతాల్లో స్పీడు బ్రేకర్లు లేకపోవడం, విద్యుత్ దీపాలు లేకపోవడం, అవసరమైన చోట స్పీడు బ్రేకర్లు లేకపోవడం కారణాలుగా గుర్తించారు. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా రవాణా, పోలీసు, విపత్తు నిర్వహణా సంస్థ, మెడికల్ అండ్ హెల్త్, రెవెన్యూ తదితర శాఖలు వివిధ రకాల సర్వేలు నిర్వహించి సుమారు వెయ్యి ప్రాంతాలను బ్లాక్‌స్పాట్‌లుగా గుర్తించారు. ఇటీవల కాలంలో బ్లాక్‌స్పాట్‌లను నివారించే క్రమంలో 50 శాతానికి పైగా తక్షణ చర్యలకు ఉపక్రమించడం ద్వారా ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు రవాణా శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. బ్లాక్‌స్పాట్‌ల నివారణలో ఆర్థిక అంశాలతో ముడిపడి ఉండడంతో విషయం ప్రభుత్వ పరిశీలన కోసం ఒక నివేదికను పంపినట్లు సమాచారం. 2010 నుండి 2017 వరకు గణాంకాలను పరిశీలిస్తే రోడ్డు ప్రమాదాల తీవ్రత ఎమిటో అవగతమవుతోంది. ఈ ఏడాది శ్రీకాకుళం 35.37 శాతం, విజయనగరం 22.84 శాతం, నెల్లూరు 6.50 శాతం మంది గతం కంటే అత్యధికంగా మృత్యువాతపడ్డారు. జాతీయ రహదారుల మీద జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా పశ్చిమ గోదావరి జిల్లాలో 32.85 శాతం, నెల్లూరు 21.30 శాతంగా జరుగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

2010 -17 వరకు రోడ్డు ప్రమాదాలు,మృతుల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2010	24,495	8556	32850
2011	23,721	8043	31304
2012	23053	7996	28,352
2013	23940	7546	28893
2014	23512	7862	29791
2015	23,178	8114	29,893
2016	23,725	8542	30245
2017	11633	4356	14542

(జూన్ నెల వరకు)

సంపాదకీయం

డోక్లామ్‌లో శాంతి పవనాలు


ప్రపంచంలో అతి పెద్ద దేశాలైన భారత్‌-చైనాలు డోక్లామ్‌ సరిహద్దుల్లో ఉద్రిక్తతలకు స్వస్తి చెప్పి, విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న కృతనిశ్చయాన్ని వ్యక్తం చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. చైనాలో జరుగుతున్న బ్రిక్స్‌ సదస్సుకు వారం రోజుల ముందు వీచిన శాంతి పవనాలు ఈ ప్రాంతంలోని శాంతికాముకులకు కొండంత ఊరటనిచ్చాయి. డోక్లామ్‌పై గత రెండు మాసాలుగా కొనసాగిన ఉద్రిక్తత మరో యుద్ధానికి దారి తీస్తుందా? అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్న తరుణంలో ఇరు దేశాల నాయకత్వాలు విజ్ఞత ప్రదర్శించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు అంగీకరించడం ముదావహం. ఇక్కడ ఎవరు గెలిచారు, ఎవరు ఓడారు అన్నది కాదు ముఖ్యం. ఉభయ దేశాల మధ్య సత్సంబంధాల మెరుగుదలకు ఇది ఏమేరకు తోడ్పడుతుందన్నదే ప్రధానం. పరస్పర అపనమ్మకాలు, అపోహల స్థానే పరస్పర విశ్వాసం, అవగాహనతో ఇరు దేశాలు ముందుకు సాగితే సరిహద్దులను శాంతి వారధులుగా మార్చుకోవడం అసాధ్యమేమీ కాదు.

చారిత్రకంగా లభించిన సరిహద్దు సమస్యలను అధిగమించి ఐక్యంగా ముందుకు సాగిన చరిత్ర భారత్‌, చైనాలకు వుంది. వేల సంవత్సరాల పాటు సత్సంబంధాలు, ఆదానప్రదానాలు కలిగిన రెండు దేశాల మధ్య పొరపొచ్చాలు వచ్చింది కొద్దిపాటి కాలం మాత్రమే. 1962 సరిహద్దు యుద్ధం తరువాత రెండు దేశాల మధ్య తెగిపోయిన సంబంధాలు 1993లో కుదిరిన చారిత్రాత్మక శాంతి పరిరక్షక ఒప్పందంతో మళ్లీ గాడిన పడ్డాయి. సరిహద్దు సమస్యలను చరిత్రకు వొదిలిపెట్టి వాణిజ్యాన్ని పునరుద్ధరించుకోవాలని నిర్దేశించిన ఆ ఒప్పందం తరువాత రెండు దేశాల మధ్య వాణిజ్యాభివృద్ధికి మార్గం సుగమమైంది. 2013 సరిహద్దు రక్షణ సహకార ఒప్పందం ద్వారా సరిహద్దులో వచ్చే సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్దిష్టమైన యంత్రాంగాన్ని, విధివిధానాలను రూపొందించుకోవడం జరిగింది. ఈ ఒప్పందాలు రెండు దేశామధ్య దౌత్య, వాణిజ్య సంబంధాల అభివృద్ధికి ఎంతగానో దోహదం చేశాయి. 2004 నాటికి 1360 కోట్ల డాలర్లుగా ఉన్న భారత్‌-చైనా వాణిజ్యం ఇటీవల కాలంలో ఉరుకులు పరుగులతో అభివృద్ధి చెంది 2016 నాటికి 7,150 డాలర్లకు చేరింది. ప్రపంచంలో భారత దేశానికి అది పెద్ద వాణిజ్య భాగస్వామి చైనాయే. అయితే రెండు దేశాల వాణిజ్య లోటు భారత్‌కు ప్రతికూలంగా ఉండడం ఒక సమస్యగా ఉంది. దాన్ని పరిష్కరించాల్సి ఉంది. ఏమైనా భారత్‌, చైనాల మధ్య 3,488కి.మీ పొడవైన సరిహద్దును వాణిజ్య మార్గంగా మార్చుకుంటే రెండు దేశాల ప్రజలూ ప్రయోజనం పొందుతారు.

కానీ ఆసియా ఖండాన్ని ప్రపంచాభివృద్ధికి కేంద్రంగా మారుస్తున్న భారత్‌-చైనాల మధ్య అగాథాన్ని పెంచాలని అమెరికా చూస్తోంది. చైనాకు వ్యతిరేకంగా పన్నిన యుద్ధ వ్యూహంలోకి భారత్‌ను లాగడానికి అమరికా వేసిన ఉచ్చులో దురదృష్ట వశాత్తు మన ప్రభుత్వాలు పడుతున్నాయి. అమెరికాకు జూనియర్‌ భాగస్వామిగా భారత్‌ను చేర్చేందుకు మోడీ ప్రభుత్వం తహతహలాడుతోంది. ఇప్పటికే ఆ దేశంతో రక్షణ రంగంలో లాజిస్టిక్‌ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. అమెరికాయుద్ధ విమానాలకు, యుద్ధ నౌకలకు భారత వైమానిక, నావికా స్థావరాల్లో ఇంధనాన్ని నింపుకోవడానికి, మరమ్మతులు చేయడానికి ఈ ఒప్పందం వీలుకల్పిస్తోంది. మోడి ప్రభుత్వం అమెరికా యుద్ధ వ్యూహం నుండి బయట పడి స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అవలంభిస్తే చైనాతో సహా ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు మెరుగుపడతాయి.

డోక్లాం వివాదం నిజానికి పరిష్కరించలేనంత జటిలమైన సమస్యేమీ కాదు. గతంలో ఇంతకన్నా పెద్ద సమస్యలను ఈ రెండు దేశాలు దౌత్యపరమైన చర్యల ద్వారా సులువుగా పరిష్కరించుకున్నాయి. డోక్లామ్‌ వివాదాన్ని కూడా అదే స్ఫూర్తితో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని వామపక్షాలు, విదేశాంగ నిపుణులు సూచించారు. మోడి ప్రభుత్వం ఆలస్యంగా అయినా ఈ చర్చల ప్రాధాన్యతను గుర్తించినందుకు సంతోషం. డోక్లామ్‌ సెక్టార్‌ నుంచి దళాలు వెనక్కి తీసుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించిన తరువాత కూడా ఈ ఒప్పందానికి గండి కొట్టేందుకు, రెండు దేశాల మధ్య అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. బ్రిక్స్‌ సదస్సులో మోడీ, జిన్‌పింగ్‌ భేటీ తరువాత ఉన్నత స్థాయి దౌత్య అధికారుల మధ్య చర్చల ప్రక్రియ ఊపందుకుంటుందని ఆశిద్దాం. వాణిజ్య సంబంధాలు అభివృద్ధి చేసుకుంటూనే రెండు దేశాలూ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సరిహద్దు సమస్యను పరిష్కరించుకోడానికి కూడా చొరవ చూపాలి.

మహనీయుల మాట




ఆధునిక మహిళ భారతదేశ చరిత్రను పునర్లిఖిస్తుంది.

- గురజాడ అప్పారావు

అణు రేడియేషన్‌తో పెను ముప్పు

ప్రజాగళం

మనం ఎదుర్కొంటున్న విద్యుత్‌ కొరతకు అణుశక్తే పరిష్కారమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. కాని జల విద్యుత్తు, థర్మల్‌ విద్యుత్తు కంటే అణు విద్యుత్తు ఎక్కువ ధర వుంటుంది. అంతేకాక అణు రియాక్టర్లు విడుదల చేసే రేడియేషన్‌ వల్ల పర్యావరణం కలుషితమవ్వడమే కాక, అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఎందుకంటే అణు విద్యుత్‌ ఉత్పత్తిలో వ్యర్థ పదార్థాలు ఎక్కువగా మిగులుతాయి. ఇవి చాలా ప్రమాదకరమైనవి. అసలు ఈ వ్యర్థ పదార్థాలను ఏం చేయాలనేది కూడా ఒక పెద్ద సమస్యగా వుంది. వీటిల్లో ఖర్చు చేసిన ఇంధన రాడ్స్‌, ప్లూటోనియం వంటి అణు విచ్ఛేదక పదార్థాలు వుంటాయి.



వీటిని ఖర్చు చేయగా మిగిలిన ఇంధనం అధికమొత్తంలో ఉష్ణాన్ని సృష్టిస్తుంది. దీన్ని చల్లార్చాలంటే వందల ఏళ్లు పడుతుంది. అందుకే స్టోరేజ్‌ ఏర్పాట్లు అవసరమౌతాయి. ఈ ప్రమాదకర వ్యర్థ పదార్థాలను భూ గర్భంలో, బాగా లోతుగా వుండే సొరంగంలో పాతి పెడుతున్నారు. అయితే వీటిని అత్యధిక వేడి, చల్లదనాన్ని తట్టుకొనే గాజు నాళికలలోనే వుంచాలి. అణు విద్యుత్తు నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు గల సిలిండర్లను 25 సెంటీమీటర్ల మందం గల స్టీల్‌ కంటైనర్లలో వుంచాలి. వీటిని 300 నుంచి 1000 మీటర్ల లోతుగల సొరంగాల్లో నిల్వ వుంచాలి. ఆ సొరంగాలను బంకమట్టి, ఇతర పదార్థాలతో మూసివేయాలి. అయితే అణు విద్యుత్తును వినియోగించే రేడియో యాక్టివ్‌ అణుశక్తి వ్యర్థ పదార్థాలను, గ్రామీణ ప్రాంతాల్లో నిల్వ చేస్తూ వుంటారు. ఇందువల్ల ఆ ప్రాంతాల్లో ఆస్తుల విలువ తగ్గిపోవడమే కాకుండా ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుంది. అయితే సుప్రీం కోర్టు తీర్పును కూడా పరిగణలోకి తీసుకోకుండా శ్రీకాకుళం జిల్లాలోని రణస్థలం మండలంలో గల కొవ్వాడ గ్రామం వద్ద ఇంత ప్రమాదకర అణు విద్యుత్‌ కేంద్రాన్ని నిర్మించేందుకు 2500 ఎకరాల పంటభూములను ప్రభుత్వం సేకరించింది. అయితే భూమిని సర్వే చేసేందుకు 1840లలోనే బ్రిటీష్‌ ప్రభుత్వం ఒక చట్టం చేసింది. దాని ప్రకారం అడవులు, కొండలు, పంటభూములు, మెట్ట భూముల్లో సర్వే రాళ్ళు వేయించింది. కాని ఆ సర్వే రాళ్ళు ఇప్పుడు లేవు. అప్పటి నుంచి భారత ప్రభుత్వం గానీ, మన రాష్ట్రం గానీ వాటిని సర్వే చేయించలేదు సరికదా కొత్త సర్వేనెంబర్లు గల రాళ్ళను పాతించి భద్రపర్చలేదు. దీంతో కేవలం రెవెన్యూ రికార్డుల్లోని సర్వే నెంబర్లు ప్రకారమే ఈ భూముల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. కొందరు రాజకీయ నాయకులు సర్వేరాళ్ళు లేకపోవడాన్ని ఆసరాగా తీసుకొని వీటిని ఆక్రమిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనే కొవ్వాడ అణువిద్యుత్‌ కేంద్రాన్ని నిర్మిస్తూ, ఆరు వేల కుటుంబాలను నిర్వాసితులను చేయడం న్యాయం కాదు. పర్యావరణ చట్టం, వాయు కాలుష్య చట్టం, అడవుల పరిరక్షణ చట్టం తదితర చట్టాలను పరిగణలోకి తీసుకొని లిఖితపూర్వక అనుమతి పత్రాలను పొందిన తరువాతనే ఈ ప్లాంటు నిర్మాణం తలపెట్టాలి. కానీ అటువంటివేమీ లేకుండానే కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేస్తోందీ ప్రభుత్వం.

పి గంగునాయుడు

హవుసు పెయింటర్‌



అస్తమానూ చెయినూడే సైకిల్‌ మీద
ఊర్లోకి బయలుదేరతాడు
కోడిగుడ్డు సైజులో కళ్లు పెంచి
వెతుకుతాడు
అప్పుడే పునాది వేస్తున్న ఇంటి
యజమానితో
ముందే మాట్లాడుకుంటాడు
వడ్రంగి పనుల వాళ్లకి కమీషనిచ్చుకుని
ఏదొక పనిని దొరకబుచ్చు కుంటాడు!
ఏ బేరమూ తగలలేదంటే
ఏటి మాసిక తంతు జరిగే ఇళ్లే గతి
ఇంతకీ వాడు హవుసు పెయింటరు
వాడు సైతం సబ్బండ వర్గమే
వాడి జీవితం కూడా ప్రగతి పొద్దుకు
దూరమే
చిల్లులు బడ్డ చెక్కనిస్తే
మక్కుబెట్టి సమంగ పేపరు గొట్టి
ఎనామిలు రంగుతో రెండు కోటింగులిచ్చి
చెక్కకు చక్కని లావణ్యాన్ని అద్దుతాడు!
బహుళంతస్తుల మేడపై నుంచి
తాడుగట్టుకుని వేలాడుతూ రంగేస్తు
జానెడు పొట్ట కోసం
పూటపూటనీ సాహసంతో గట్టెక్కిస్తాడు
కిటికీ ఫ్రేముల్ని మెరిపిస్తాడు
కిటికీ ఊచలకి వెండి రంగుల్ని పూసి
దర్వాజాలకి రాజసం వచ్చేలా చేస్తాడు!
గడపగడపకీ పసుపురంగు పూసి
వాటిపై ఎరుపు తెలుపాకుపచ్చ వర్ణాలతో
పువ్వుల్ని గీసే వాడిని చూసినప్పుడల్లా
ఎన్నో గడపల్ని శోభామయం చేస్తేనే
వాడికి కొన్ని మెతుకులు
దక్కుతాయనిపించింది
హవుసు పెయింటరు వల్లే
కాంక్రీటరణ్యాలు
ఇంద్రధనుస్సులవుతాయి
రంగుల హంగులతో కనబడతాయి
ఇంతకీ
ఎన్నిళ్లకు రంగులు వేసినా
వాడి జీవితం మాత్రం
వెలిసిపోయిన రంగుల గోడలాగ
రంగు పెచ్చులు లేచిన సైన్‌
బోర్డులాగ
వెలవెల బోతుంటుంది!
మన దేశం చాలా గొప్పది
శ్రమజీవుల్ని విస్మరించడంలో
దూసుకు పోతోంది!

మెట్టా నాగేశ్వరరావు

మెయిల్‌ @ ప్రజాశక్తి

ప్రజాశక్తి సంపాదక పేజీలో వ్యాసాలు మాత్రమే కాదు. వివిధ విషయాలపై మీ అభిప్రాయాలకు కూడా అవకాశం. మీరు అనుకునే ఏ సమస్య పైనైనా సరే- మరీ సుదీర్ఘం కాకుండా సూటిగా క్లుప్తంగా రాసి పంపించండి లేదా ఇ మెయిల్‌ చేయండి. వెంటనే ప్రచురిస్తాం.

ఇ- మెయిల్‌ అడ్రస్‌ : editpageps@gmail.com

చిరునామా
ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్‌ నెం. 27-30-4,
ఆకులవారి వీధి,
గవర్నర్‌ పేట, విజయవాడ-2.

నంద్యాల ఎన్నికల తీరు : వధ్య శిలపై ప్రజాస్వామ్యం



వి శంకరయ్య

విశ్లేషణ

నంద్యాల ఎన్నికల నిర్వహణ తీరు ప్రజాస్వామ్య వాదులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ, ప్రతిపక్షాలు ప్రధానంగా అధికార పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థపై క్రూరమైన దాడి చేసింది. బహుశా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గానీ ఇతర రాష్ట్రాలలో గానీ ఇంతకు ముందు జరిగిన ఉప ఎన్నికల్లో ఇంత భారీ ఎత్తున ధన ప్రవాహం, అధికార దుర్వినియోగం జరిగి వుండదు. కౌంటింగ్‌ జరగక మునుపే నంద్యాల నుంచి ఒక మిత్రుడు సమాచారం అందజేశారు. 'అవినీతి, అసంబద్ధతతో జరిగిన ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారని అంచనా వేయడం అవివేకం. అధికార పార్టీ హద్దులు దాటేసింది. ఎన్నికలు జరిగిన తీరు పరిశీలిస్తే మున్ముందు ప్రజాస్వామ్య వ్యవస్థకు రానున్న పెను ప్రమాదాన్ని అంచనా వేసి నిరోధించడం ప్రజాస్వామ్య శక్తుల తక్షణ కర్తవ్యం' అని ఒక ప్రత్యక్ష సాక్షిగా చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాల రుణాలకు బకాయి పడి వున్న మొత్తాన్ని తెలుగుదేశం పార్టీ అధికార గణాన్ని ఉపయోగించి పంపకం చేసినందున మహిళలు పోలింగ్‌ బూతుల వద్ద పెద్ద సంఖ్యలో క్యూ కట్టారని వివరించారు.

ఈ పాటికే ఎన్నికలు ఖరీదైన నేపథ్యంలో కోట్లు కుమ్మరిస్తే గానీ గెలుపొందలేని ప్రమాదకర ధోరణిని నంద్యాల ఉప ఎన్నికలు మరింత ముమ్మరం చేశాయి. ఈ అంశంలో వైకాపా కూడా తక్కువ తినలేదు. రెండూ ఒక ఆకులో చింపుళ్ళే. గతంలో విపక్షనేత జగన్‌ తెలుగుదేశం పార్టీకి డిపాజిట్లు కూడా దక్కనీయకుండా చేసిన అనుభవముంది. ప్రస్తుతం అధికార దండం చేత పట్టుకున్న ముఖ్యమంత్రి పైచేయి సంపాదించి విపక్షాన్ని చిత్తు చేయడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలను మంట గలిపారు. సాధారణంగా ఉప ఎన్నికలు అధికార పార్టీకి అనుకూలంగా వుంటాయి. 1999 నుంచి 2004 వరకు జరిగిన ఉప ఎన్నికల్లో తెలుగుదేశం హయాంలో ప్రతిపక్షాలు గెలుపొందలేదు. అయితే ఈ ఎన్నికల సందర్భంగా అనుసరించిన పెడ ధోరణుల గురించే వామపక్ష ప్రజాతంత్ర ప్రజాస్వామ్య వాదులు ఆలోచించవలసి వుంది. ఈ సందర్భంలో ఒక అంశం పేర్కొనక తప్పడం లేదు. హాస్యకళా చక్రవర్తి, ప్రగతిశీలవాది, చార్లీ చాప్లిన్‌ నటించిన హాస్య సన్నివేశమొకటి సమాచార మాధ్యమాలలో హల్‌చల్‌ చేస్తోంది. సర్కస్‌లో బఫూన్‌గా పని చేసే చాప్లిన్‌ జంతుజాలముండే ఆవరణలోకి రాగానే గుర్రమొకటి పొడిచేందుకు తరుముతుంటుంది. దాని నుంచి తప్పించుకునేందుకు చాప్లిన్‌ పరిగెత్తుకుంటూ ఒక ఇనుప బోను లోనికి వెళ్ళి తలుపు వేసుకొంటాడు. తీరా చూస్తే బోనులో సింహమొకటి నిద్ర పోతుంటుంది. చివరికి చాప్లిన్‌ బోను నుంచి బయటపడి తప్పించుకుంటాడు. ఇదంతా ఎందుకంటే ప్రస్తుతం నంద్యాల ప్రజలతో పాటు రాష్ట్ర ప్రజల అవస్థ చాప్లిన్‌ ఎదుర్కొన్న అనుభవాన్ని తలపిస్తోంది. అందుకే రాష్ట్రంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులు తెలుగుదేశం పార్టీ ఓటమి చెందాలని అభిలషించాయి.

అదే సమయంలో 2019 ఎన్నికలకు నంద్యాల ఎన్నికల ఫలితాలు గీటురాయిగా వుంటాయా? రాజకీయ సమీకరణలు ఎలా వుంటాయి? సంప్రదాయంగా ఆయా పార్టీలకున్న ఓటు బ్యాంక్‌ అలాగే వుంటుందా? మార్పులేవైనా జరుగుతాయా? నూతన సమీకరణలు ఎలా వుంటాయి? తెలుగుదేశం, వైకాపా రెండూ బిజెపితో చెలిమి చేస్తున్నందున దళితులు, మైనార్టీల వైఖరి ఎలా వుంటుంది? ఇత్యాది అంశాలకు నంద్యాల ఎన్నికల ఫలితాలతో జవాబు లభిస్తుందని విశ్లేషకులు ఆశించారు. అయితే రాష్ట్రంలోని అధికార పార్టీ తన ధన, అధికార మదంతో మొత్తంగా ఈ రాజకీయ సమీకరణలను తుడిచి పెట్టింది. అంతేకాక పలు రకాల ప్రలోభాలు తెరమీదకు వచ్చాయి. కులాలు మతాల వారీగా పదవుల పంపకాలు జరిగాయి. కుల, మత సమావేశాలకు ఆత్మీయతనే ముసుగు తొడిగారు. ఎన్నికల సంఘం కూడా అచేతనంగా వుండిపోయింది. ఒకరు వెయ్యి రూపాయలిస్తే మరొకరు మూడు వేలు ఇచ్చారు. చీరలు, బొట్టుబిళ్ళలు, ముక్కు పుడకల పంపకానికి అంతే లేదు. 20 మంది మంత్రులు 50 మంది ఎమ్మెల్యేలు అక్కడే మకాం పెట్టారు. ఇందుకు దీటుగా వైకాపా కూడా తన బలగాన్ని నంద్యాలలో దింపింది. ఎన్నికల ప్రకటన వెలువడక ముందే రూ.1500 కోట్లతో అభివృద్ధి పథకాలు ప్రకటించారు. 17 వేల గృహాలు మంజూరు చేశారు. అదనంగా 10 వేల ఫించన్లు ఇచ్చేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంలో ఒక టీవీ ఛానల్‌ నిర్వహించిన గేలప్‌ పోల్‌లో ధన ప్రవాహం, ఎన్నికల ముందు ప్రకటించిన అభివృద్ధి పథకాలు గెలుపుకు కారణమని అత్యధికులు పేర్కొన్నారు. వలసల బతుకుతో, దుర్భిక్షంతో మిగిలిన రాయలసీమ మట్టిగొట్టుకు పోయినా సరే తన గెలుపుకు తన విధానాలకు నంద్యాల ఎన్నికలు నిదర్శనం కావాలని ముఖ్యమంత్రి పన్నిన పన్నాగంలో ప్రజలు చిక్కుకొని విలవిలలాడారు. ఇలా ఆయన మాయలోపడి మోసపోయారు. నంద్యాలలో టిడిపి గెలుపొందకపోతే అభివృద్ధి పథకాలు ఆగిపోతాయని... కొత్తగా ప్రకటించిన గృహాలు, ఫించన్లు నిలిచిపోతాయని పెద్ద ఎత్తున ఊదరగొట్టారు. ఈ భయాందోళనలు ఎబోలా వైరస్‌ లాగా వ్యాపించడంతో ప్రభుత్వ వ్యతిరేకత పెనుభూతంగా వున్నా... మూడున్నరేళ్ళ కాలంలో ముఖ్యమంత్రి కన్నెత్తి చూడకున్నా... ప్రలోభాలలో, ధన ప్రవాహంలో ఇవన్నీ కొట్టుకుపోయాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇది అసహజమేమీ కాదు. అయినా ప్రజాస్వామ్య విలువలు ఎంత కారుచీకట్లోనైనా మిణుగురు పురుగుల్లాగా మెరుస్తూనే వుంటాయి. అవే పీడిత తాడిత ప్రజలకు శ్రీరామ రక్ష.



నంద్యాలలో టిడిపి గెలుపొందకపోతే అభివృద్ధి పథకాలు ఆగిపోతాయని... కొత్తగా ప్రకటించిన గృహాలు, ఫించన్లు నిలిచిపోతాయని పెద్ద ఎత్తున ఊదరగొట్టారు. ఈ భయాందోళనలు ఎబోలా వైరస్‌ లాగా వ్యాపించడంతో ప్రభుత్వ వ్యతిరేకత పెనుభూతంగా వున్నా... మూడున్నరేళ్ళ కాలంలో ముఖ్యమంత్రి కన్నెత్తి చూడకున్నా ... ప్రలోభాలలో, ధన ప్రవాహంలో ఇవన్నీ కొట్టుకుపోయాయి.


ఇంతకీ తెలుగుదేశం పార్టీ గెలిస్తే ఏమవుతుంది? వైకాపా గెలిస్తే కలిగే లాభమేమిటి? ఇవి కీలక ప్రశ్నలేమీ కావు. వైకాపా గెలిచి వుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు అపసవ్య ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలకు తాత్కాలికంగా బ్రేకు పడి వుండేది. ప్రస్తుతం ముఖ్యమంత్రికి పట్టపగ్గాలుండవు. ఈ అంశంలో తెలుగుదేశం నేతల్లోనే విస్తృత చర్చ సాగుతోంది. ఇక ఇంటర్వ్యూలు కూడా దొరకవేమోనని జోకులు వేసుకుంటున్నారట. తను ఇన్నాళ్ళు రాజధాని నిర్మాణం, ప్రాజెక్టులకు, పరిశ్రమలకు భూ సేకరణ సందర్భంగా అనుసరిస్తూ వచ్చిన ఏకపక్ష ప్రజా వ్యతిరేక విధానాలకు నంద్యాల ప్రజలు వేసిన ఆమోద ముద్రను రాష్ట్రం లోని ప్రజలందరికీ ఆపాదించి మరీ ఎదురు దాడికి దిగే ప్రమాదం పొంచి వుంది.

రాష్ట్రం ఈపాటికే అప్పుల ఊబిలో కూరుకుపోయి వున్నా చట్టబద్ధంగా కేంద్రం నుంచి రాజధాని నిర్మాణానికి రావాల్సిన నిధులు రాబట్టకపోగా మరింత అప్పులు చేసి భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలపై పెనుభారం మోపబోతున్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమల స్థాపనలో భూ సేకరణ సందర్భంగా దళితులు చిన్న సన్నకారు రైతులకు మరింత అపకారం జరిగే అవకాశం వుంది. ప్రధానంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల ప్రజలలో అసమానతలపై నెలకొన్న భావాన్ని ముఖ్యమంత్రి ఒక్క ముక్కలో కొట్టిపారేసే అవకాశం లేకపోలేదు. రాయలసీమ ప్రజలే తనకు తన విధానాలకు చట్టబద్ధమైన లైసెన్స్‌ ఇచ్చారని చెప్పినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. రాయలసీమలో నెలకొన్న దుర్భిక్షం, రైతుల ఆత్మహత్యలు, ప్రభుత్వ వ్యతిరేకత ఇవన్నీ కూడా నంద్యాల ఎన్నికలలో వంద కోట్ల ధన ప్రవాహంతో తుడిచి పెట్టుకుపోయాయి. తన స్వంత జిల్లా ఏర్పేడులో ఇసుక మాఫియాకు కీలకంగా వున్న తెలుగుదేశం నేతపై అరెస్టు వారెంట్‌ వున్నా శ్రీకాళహస్తి ఆలయంలో రాచమర్యాదలు జరిగాయి. ఆ తర్వాతే కోర్టుకు హాజరై లొంగిపోయారు. ఈ సందర్భంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు. కానీ ముద్రగడ పద్మనాభం పాదయాత్ర సందర్భంగా డిఎస్‌పి సరిగా వ్యవహరించలేదని సస్పెండ్‌ చేశారు. ఇది ఈ రోజు రాష్ట్రంలో వున్న వాస్తవ చిత్రం. ప్రధాన మంత్రి మోడీ వద్ద మెప్పులు పొందేందుకు మున్ముందు మతోన్మాద శక్తులను ప్రతిఘటించే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల గొంతు నొక్కే అవకాశముంది. ఈ మూడున్నరేళ్ల కాలంలో జరిగిన అప్రజాస్వామిక పోలీసు జులుం చాలా తక్కువే. ముందున్నది ముసళ్ళ పండుగ. దళితులు, పీడిత వర్గాల పక్షాన నిలబడి పోరాడే వారిపై తీవ్రమైన దమనకాండ ప్రయోగించేందుకు నంద్యాల ఎన్నికల గెలుపును ఒక సర్టిఫికెట్‌గా ముఖ్యమంత్రి చూపవచ్చు. కొసమెరుపు ఏమంటే రాష్ట్రంలో ఒక మారుమూల నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపొందితే ప్రధాన మంత్రి ట్వీట్‌ చేస్తూ అభినందనలు చెప్పారంటేనే భవిష్యత్తులో టిడిపి-బిజెపి అనుబంధం ఎంత ప్రగాఢంగా వుండబోతోందో తెలుస్తోంది. వైకాపా నేత జగన్‌ ఇప్పటికైనా గుర్తిస్తే ఎంతో క్షేమం. అంతేకాదు! నంద్యాల ఎన్నికల తీరుపై కేంద్ర ఇంటలిజెన్స్‌ వర్గాలు వాస్తవ రిపోర్టులు ఇచ్చి వుంటాయి. ప్రజాస్వామ్యం ఎలా పరిహసింపబడిందో చెప్పి వుంటాయి. అయినా ప్రధానమంత్రి ట్వీట్‌ చేశారంటే భవిష్యత్తులో దేశ వ్యాప్తంగా బిజెపి, దాని మిత్రులు అనుసరించబోయే ప్రమాదకర ధోరణికి నిదర్శనంగా వుంది.

(రచయిత విశ్రాంత పాత్రికేయుడు), 9848394013 .

ఆనాటి విలువలు తరిగిపోయాయా?

డాక్టర్‌ చుక్కా రామయ్య



సమీక్ష

దేశంలో ఏటా మనం రెండు ప్రజా పండుగలు చేసుకుంటున్నాం. ఒకటి పంద్రాగస్టు కాగా, రెండోది రిపబ్లిక్‌ డే. పంద్రాగస్టు వేడుకల సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షలు ఎంత వరకు నెరవేరాయో నెమరు వేసుకుంటే.. రిపబ్లిక్‌ డే రోజున రాజ్యాంగ లక్ష్యాలు ఎంతవరకు పరిపుష్టమయ్యాయో ఆత్మావలోకనం చేసుకొని కొత్త లక్ష్యాలను ఎంచుకుంటూ ముందుకెళ్తున్నాం. మన దేశంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం ఎన్నో ఒడిదుడుకులకు గురైంది. భావితరాల స్వేచ్ఛ కోసం, స్వతంత్రంగా బతకడం కోసం ఎంతోమంది మహనీయులు ప్రాణ త్యాగాలు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మనం సాధించుకున్నది లౌకికవాదం. మహత్తర పోరాటం ద్వారా మనకు సంక్రమించిన గొప్ప వారసత్వం కూడా అదే. అందుకే మన రాజ్యాంగంలో సెక్యులరిజానికి ఎక్కువ ప్రాధాన్యం కల్పించారు. అదే నాటి పోరాటం గొప్ప విలువ. ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో సెక్యులరిజానికి విలువ తరుగుతున్నదా? పెరుగుతున్నదా? అనేది నేడు ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆనాటి మహా పోరాటంలో కొంత భాగం చూసే అవకాశం నాకు లభించించింది. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా దాన్ని నేను ప్రస్తావించక తప్పడంలేదు. నాటి మన 'స్వాతంత్ర్య సాధన స్వప్నం' ఒకేరకమైన నాయకత్వం కింద సాకారం కాలేదు. వంద పూలు వికసించాలనే భావన ఆ రోజుల్లో ఉండేది. అందువల్లే ఓ వైపు అంబేద్కర్‌ వస్తే.. మరోవైపు నుంచి గాంధీజీ వచ్చారు. అలాగే సుభాష్‌ చంద్రబోస్‌, జవహర్‌లాల్‌ నెహ్రూ, ఈఎంఎస్‌, డాంగే ఇలా.. రకరకాల భావజాలం, ఆలోచనలతో కలగలిసిన గొప్ప నాయకత్వం పుట్టుకొచ్చింది. ఆనాడు నాయకత్వం ఎక్కడా కేంద్రీకృతం కాలేదు. అందువల్లే గొప్ప రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకోగలిగాం. వారు వేసిన ఆ పునాదులే ఈ దేశాన్ని ఇప్పటికీ సమైక్య భావనతో ఉంచగలుగుతున్నాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు. దేశంలో ఆనాటి మహనీయులు ఏ ఆశయాల కోసం ప్రాణత్యాగం చేశారో ఆ స్ఫూర్తి నేడు కరువైపోతోంది. కేంద్రీకృతమైన రాజకీయాలవైపు పోతున్నాం. తద్వారా ప్రజా సమస్యల్ని పరిష్కరించడంలో విఫలమవుతున్నామనే చెప్పాలి.

స్వాతంత్ర్య సంగ్రామంలో స్వాతంత్ర్యం, జాతీయ వాదమే నినాదం. యూనివర్సిటీల్లోనైనా, గ్రామాల్లోనైనా జనాలను సమీకరించడం, వారిని పోరాటంలో భాగస్వాముల్ని చేయడం ఆనాడు ప్రధానంగా భావించేవారు. ఈ నేపథ్యంలో ఎక్కువగా రైతులు, కార్మికులపైనే కేంద్రీకరించారు. కాబట్టి ఆ తరం వారికి అవే విలువలు వారసత్వంగా వచ్చాయి. అయితే, కొందరు మతం ప్రాతిపదికన జనాన్ని సమీకరించి తద్వారా వారిని ఏకం చేసేందుకు ఆ దిశగా ప్రయత్నాలు చేశారు. అందుకే బ్రిటిష్‌ వాళ్లు మత ప్రాతిపదికన దేశాన్ని చీల్చారు. సిమ్లా కాన్ఫరెన్స్‌ వరకు కాంగ్రెస్‌ దాన్ని వ్యతిరేకించినా చివరకు బ్రిటిష్‌ వారి పెత్తనం నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు రాజీపడక తప్పలేదు. ఆనాడు ప్రగతి శీల ఉద్యమమంతా మత ప్రాతిపదికన కాకుండా సెక్యులర్‌ భావాలపైనే కొనసాగింది. వికేంద్రీకరణ ఆధారంగా పోరాటాలు జరిగాయి. ఆనాటి ఉద్యమంతో నేటి పరిస్థితుల్ని బేరీజు వేసుకొని చూస్తే.. మత శక్తులు మళ్లీ ప్రతి అంశాన్ని రాజకీయాలతో ముడి పెడుతున్నట్టు కనబడుతోంది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య ఉద్యమంలో మనం సాధించుకున్న విలువలు తరిగిపోయాయా? అనిపిస్తోంది.



స్వాతంత్ర్య సంగ్రామంలో స్వాతంత్ర్యం, జాతీయ వాదమే నినాదం. యూనివర్సిటీల్లోనైనా, గ్రామాల్లోనైనా జనాలను సమీకరించడం, వారిని పోరాటంలో భాగస్వాముల్ని చేయడం ఆనాడు ప్రధానంగా భావించేవారు. వికేంద్రీకరణ ఆధారంగా పోరాటాలు జరిగాయి. ఆనాటి ఉద్యమంతో నేటి పరిస్థితుల్ని బేరీజు వేసుకొని చూస్తే.. మత శక్తులు మళ్లీ ప్రతి అంశాన్ని రాజకీయాలతో ముడి పెడుతున్నట్టు కనబడుతోంది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య ఉద్యమంలో మనం సాధించుకున్న విలువలు తరిగిపోయాయా? అనిపిస్తోంది.

నేడు దేశంలో విపరీతంగా పెరుగుతోన్న జనాభాతో పాటు అనేక కొత్త సమస్యలు కూడా పుట్టుకొస్తున్నాయి. అవినీతి ప్రధానంగా ప్రతి స్థాయిలోనూ పట్టి పీడిస్తోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో నల్ల ధనం విపరీతంగా పేరుకుపోతోంది. నల్ల ధనం ఉత్పత్తి జరుగుతున్న దేశాల్లో భారత్‌ది నాలుగో స్థానం అంటేనే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు! మహిళలకు భద్రత కరువవుతోంది. ఎన్ని చట్టాలు తీసుకొచ్చినా ఏమాత్రం వ్యవస్థలో మార్పు రావడంలేదు. దేశంలో ప్రతి రెండు గంటలకు సుమారు ఏడుగురు మహిళలు లైంగిక దాడులకు గురవుతున్నారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ఇక కిడ్నాప్‌లు, వేధింపులకు గురవుతున్న మహిళల సంఖ్య వేల సంఖ్యలోనే ఉంది. ఇక శిశు మరణాలు, ఆకలి చావులు ఇలా చెప్పుకుంటూ పోతే సమస్యల చిట్టా చాంతాడంత ఉంది. ఎన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాటుచేసినా వాటి మధ్య సమన్వయ లోపం, పర్యవేక్షణ కరువవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయి. ఏ పార్టీలు అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఎన్నికలను డబ్బుమయం చేసి రాజకీయాలను భ్రష్టు పట్టించారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు ఆగడంలేదు. కార్మికుల హక్కులకు రక్షణ కరువవుతోంది. స్వాతంత్ర్యం తొలి రోజుల్లో వచ్చిన ప్రభుత్వాలు కార్మికులకు అనుకూల విధానాలను తీసుకుంటూ అభివృద్ధిలో నడిస్తే.. నేడు కొద్దిమంది పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉండే విధానాలతో మన ప్రభుత్వాలు నడుస్తున్నాయి. అదే ఆనాటికి నేటికీ ఉన్న ప్రధాన తేడా. ఉద్యమ స్వరూపాన్ని నాటి పార్లమెంట్‌ ప్రతిబింబిస్తే.. ఈనాడు పార్లమెంట్‌కు వెళ్తున్న అధికశాతం మందికి అనుకూలంగా విధానాలను ప్రభుత్వాలు తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్నాయి.

నాటి ఉద్యమంలో ఫ్యూడల్‌ శక్తుల్ని బలహీనపరిచే దిశగా విధానాలు కొనసాగిస్తే.. ఈనాడు మళ్లీ అవే శక్తులను బలపరిచే విధానాలు వస్తున్నాయి. తద్వారా అణగారిన వర్గాల సంక్షేమాన్ని పెడచెవిన పెడుతూ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి నుంచి తప్పుతున్నామా అనే అనుమానం కలుగుతోంది. ఆనాడు స్వేచ్ఛ ఎక్కువగా ఉండేది. స్వాతంత్ర్య ఉద్యమంలో భిన్నాభిప్రాయాలు, వైరుధ్యాలు కనబడేవి. అందరి అంతిమ లక్ష్యం ఒక్కటే అయినప్పటికీ దాన్ని సాధించేందుకు అనుసరించాల్సిన మార్గాలపై వేరువేరు అభిప్రాయాలను వ్యక్తం చేసేవారు. కాంగ్రెస్‌తో పాటు కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీలు వచ్చాయి. అయితే, ఈనాడు అలాంటి వైరుధ్యాలను భరించే పరిస్థితి కనబడకపోవడం ఆందోళనకరం. ఈనాడు సెన్సార్‌షిప్‌ వస్తోంది. నాటి ప్రజాస్వామ్యంలో అందరి అభిప్రాయాలను గౌరవించేవారు. ఈనాడు అలాంటి వాటిని భరించే పరిస్థితి కూడా లేకుండా పోతోంది. ప్రతిపక్షాలు చేసే విమర్శల్ని సైతం తట్టుకోలేని పరిస్థితులు దాపురించాయి. ప్రజాస్వామ్య మనుగడకు ఇదెంతో ప్రమాదం. ఒక ప్రజాప్రతినిధి మాట్లాడిన దాన్ని సెన్సార్‌ చేయడం వాక్‌ స్వాతంత్ర్యంపై దాడి చేయడమే అవుతోంది. ఈనాడు దేశంలో ఇలాంటి పరిస్థితులే తలెత్తుతుండటం బాధాకరం. గతంలో అమెరికాలోని బర్కెలీ విశ్వవిద్యాలయంలో వాక్‌ స్వాతంత్ర్యంపై దాడిని నిరసిస్తూ పెద్ద ఎత్తున ఉద్యమం వచ్చింది. విద్యార్థి సంఘాల నేతల ఉపన్యాసాలను వీసీ సెన్సార్‌ చేసేవారు. దీన్ని వ్యతిరేకిస్తూ అక్కడి విద్యార్థులు కదం తొక్కి చివరకు అపూర్వమైన విజయం సాధించారు. ఏ దేశంలోనైనా వాక్‌ స్వాతంత్ర్యంపై దాడి జరిగితే దానిపై రాజీ లేని పోరాటం చేయాల్సిందే.

స్వాతంత్ర్య ఉద్యమం మనకు రెండు సందేశాలను ఇచ్చింది. ఒకటి సోషలిజం కాగా, రెండోది సామాజిక న్యాయం. ఈ రెండింటినీ సాధించేందుకు అద్భుతమైన రాజ్యాంగాన్ని కూడా రూపొందించారు. అది 'రాజ్యాంగం' అనేకంటే 'గత తరం వీలునామా' అంటే బాగుంటుందేమో. మనం ఆ త్యాగధనుల వారసులం. వాటిని ఎంతవరకు నిల బెట్టుకుంటామోనని చరిత్ర ఎదురుచూస్తోంది. ఆ ఉద్యమంలో ఎంతో మంది మహనుభావులు రక్తతర్పణం చేశారు. కష్టాలు అనుభవించారు. వారి ఆశయాలను కొనసాగించేందుకు ఉద్యుక్తులు కావడమే నేటి తరం ముందున్న సవాల్‌.

(రచయిత ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు)

సన్నాసి.. డేరా చిరిగిపోయింది!!

"నేనెవరు.. నువ్వెవరు.. ఈ దేహం.. వొట్టి .. మాంసపు ముద్ద మాత్రమే.. భూమిలో కప్పెడితే మట్టి.. కాలిత్తే బూడిద.. అంతే.. అంతదానికి.. డబ్బు.. దర్పం.. భూములు, ఇనాములు, మమకారాలు, రాజకీయాలు, భోగాలు, విరహాలు.. ఇవన్నీ వొట్టి మిథ్య. ఓం..తత్సత్.." చల్లని మంచుకొండపై నిద్రాహారాలు మానేసి ఒంటికాలుపై తపస్సు చేసే యోగిలా ఫోజుపెట్టి మరీ అన్నాడు అప్పారావు.. అలియాస్ అప్పి.

"ఏవండీ సన్నాసిగారూ! ఇటేపేమైనా మా అప్పిగాడుగానీ వచ్చినట్టు చూసినారా..?" అంటూ.. చుట్టుపక్కల వెదుకుతూ అడిగాడు సుబ్బారావు.. అలియాస్ సుబ్బి.

"హల్లో సుబ్బిగా.. హిహ్హీహ్హీ.. ఓపాలి నన్ను చూడు.." కాషాయ వస్త్రాలు ధరించి సాధువు గెటప్‌లో ఉన్న అప్పారావు.. నవ్వుతూ సుబ్బిని పిలిచాడు.

"ఓరోరి.. నువ్వట్రా అప్పిగా.. ఇదేంది సన్నాసి గెటప్పేశావు..?! కొంపదీసి వచ్చే దసరాకి ఇదే యేషంకట్టి.. చందాల కోసం ఊరంతా తిరుగుతావా? ఏంది? ఆ పని మాత్రం సేయమాక పిల్లకాయలు, ఆడలేడీసూ.. జడ్సుకు సత్తారు..!!" బిత్తరపోయినట్టు చూస్తూ అన్నాడు సుబ్బి.

"నీబోటి సామాన్యుడికి నాబోటి గొప్పోళ్ళ గురించి ఏటి తెలుత్తుందిలే..? ఓం తత్సత్..!" పెట్టుడు గెడ్డం సవరించుకుంటూ నింపాదిగా అన్నాడు అప్పి.

"అవును మరీ.. నీబోటి సన్నాసోళ్ళ గురించి.. మాబోటోళ్ళకు ఎట్టా తెలుత్తుందిలే..?" అంతే యెటకారంగా బదులిచ్చాడు సుబ్బి.



"రేయ్.. మాటలు జాగ్రత్తగా మాటాడు.. సన్నాసేంది సన్నాసి.. మేము.. సన్యాసులం.. నాట్ సన్నాసులం.. సమ్జే..?" తెలుగు, హిందీ, ఇంగ్లీషు మాటల్ని కలగలిపి అన్నాడు అప్పిస్వామి.

"అబ్బో.. అంటే సన్నాసికి.. సన్యాసికి తేడా ఏంటో..? సన్నాసి సన్నాసే కదా..?!" మళ్ళీ వెటకారంగా అన్నాడు సుబ్బి.

"ఇదిగో.. నాతో యెట్టుకోమాక.. కోపమొత్తే షపించి పాడేత్తా..! దెబ్బతో కుక్కవైపోతావ్!!" కళ్ళు మిటకరించి మరీ అన్నాడు అప్పి.

"ఒరేయ్ అట్టా అనమాక.. జనాలు కుక్కని కొట్టినట్టు కొడతారు.. షపించేత్తాడంట..! పొద్దున్నే తిన్న దగ్గర నుంచి పనీపాటాలేక.. ఏటి సేయాలో తెలీక సన్నాసి యేసాలేత్తన్నాడు సన్నాసి యెధవా.." నోట్లో అనుకున్నాగానీ.. బయటకు వినపడేలా అనేశాడు.. అన్నాడు సుబ్బి.

"ఇదిగో.. మాటిమాటికీ సన్నాసీ.. సన్నాసీ.. అనమాక. నీకు చేతనైతే 'అప్పానందస్వామీ..!' అని నోరారా పిలువు. లేకపోతే.. మానేయ్.." కాస్తంత కటువుగానే అన్నాడు అప్పి.

"అబ్బో.. ఈ పైత్యం ఎప్పుడ్నుంచి మొదలైందిరా..? నాయినోయ్.. నిన్నటిదాకా బాగానే ఉన్నావ్‌గందా... ఈ లోపల్నే ఏటయిపోనాదీ..? నోరారా.. 'అప్పిగా.. అప్పిగా..!' అని పిలిత్తే.. ఎంచక్కా.. 'ఏందిరా సుబ్బిగా..?' అనేటోడివి.. ఏమైందిరా సామీ..?" జాలిగా చూస్తూ అడిగాడు సుబ్బి.

"ఆ.. ఆఁ.. ఇప్పుడు నచ్చావురా బామ్మర్దీ! నువ్వన్నట్టు నిజంగానే నేను సామినే.. నీ పాపాలన్నీ కడిగేయడానికి.. మీ జీవితాల్లో పెట్రమాక్స్ లైట్లు వెలిగించడానికి.. అప్పానందస్వామి అవతారం ఎత్తా..! హిహ్హీహ్హీ" చేత్తో దీవిస్తూ చెప్పుకొచ్చాడు అప్పారావు.

"అప్పానంద సామా..?! ఏందిరా.. ఆ తలమాసిన పేరు.. లచ్చనంగా 'అప్పిగా!' అని పిలిస్తే పలికేటోడివి.. రేతిరికి రేతిరి నీకు ఈ పోయేకాలం.. ఎక్కడ్నుంచి దాపురించిందిరా నాయినా?" బాధపడుతూ అడిగాడు సుబ్బి.

"ఇందాక సెప్పానా.. లేదా? మీ అందరికీ.. ఊళ్ళో వాళ్ళందరికీ మోక్షం ప్రెసాదించాలని.. అందుకే, మీ అందరికోసం.. సంసార జీవితాన్ని ఒదిలేసి సన్యాసిగా మారా.." మరోసారి తనదైన కొత్త అవతారాన్ని ఫోకస్ చేస్తూ రెండు చేతులతో దీవించాడు అప్పి.. అలియాస్ అప్పానందస్వామి.

"ఓరి..సన్నాసెధవా.. నీకు ఇట్టా మాటల్తో సెప్తేకాదురా.. వట్రంగా ఉన్న తాటమట్ట వెదికి.. యెనకపాలే నాలుగిత్తే.. అప్పుడు నెత్తికెక్కిన దెయ్యం దిగిపోద్ది.. సన్యాసంటా.. సన్నాసి.." గట్టిగా కసురుకున్నాడు సుబ్బి

"చూడు భక్తా..! శాంతం నాయినా..!! భార్యాపిల్లలు.. పెళ్లి పేరంటాలు.. స్నేహాలూ.. బంధుత్వాలూ ఇవన్నీ.. నీటి మీద బుడగల్లాంటివి నాయినా.. అయన్నీ కాసేపు కంటికి కనిపిత్తాయేగానీ.. చివరికి అన్నీ గాల్లో పేలిపోయేవే. అందుకే.. మనసు నిమ్మదించుకుని.. ఈ అప్పానందస్వామి చెప్పే.. నాలుగు మాటలు చెవులో వేసుకుని.. జీవితాన్ని సన్మార్గంలో పెట్టుకో నాయినా..!" అచ్చం.. జీవితతత్వాన్ని ప్రబోధించే స్వామీజీలానే మాట్లాడాడు అప్పి.

"అరె.. ఎంకయ్యా.. పుల్లయ్యా.. కాంతమ్మా.. శాంతమ్మా.. నల్లశీనూ.. తెల్లశీనూ.. సుబ్బయ్యా.. బంగారయ్యా.. తొందరగా రండ్రా..! మన అప్పిగాడికి ఏదో గాలిసోకి.. పిచ్చపిచ్చగా వాగుతున్నాడు.. తొందరగా రండ్రోయ్..!!" అప్పి వ్యవహారం చూసి గావుకేక పెట్టాడు సుబ్బి.

"శాంతం నాయినా.. శాంతం.. వాళ్ళంతా పిల్లకాకులు.. లోకం తెలియని అమాయకులు.. సంసార సాగరంలో కొట్టుకుపోతున్న అతి సామాన్య మానవులు.. వారందర్నీ పిలిచి.. ఈ అప్పానందస్వామిని నువ్వేం చేయుదువు.. హిహ్హీహ్హీ.. అల్పుడా..!" వారించబోయాడు అప్పి.

ఇంతలో పదిమంది జనాలు అక్కడ గుమిగూడి.. అప్పారావును ఎగాదిగా చూడసాగారు.

"ఏందిరా అప్పి.. పోయేకాలమేమైనా వచ్చిందా..?! ఈ యేషమేంటీ..? ఆ వొంటికేసుకున్న గుడ్డలేంటీ..? నెత్తిపై పిచ్చిగ్గూడులాంటి ఆ జులపాలేంటీ..? ఆ పెట్టుడు గెడ్డమేంటీ? కొంపదీసి రేత్రి ఏదైనా కొండముచ్చు కరిచిందేందిరా...?!" నోరెళ్ళబెట్టి చూస్తూ అడిగాడు దారిపోయే దానయ్య.

"భక్తా.. శాంతము.. శాంతము.. నోరు సంభాళించుకుని మాట్లాడుము.. మా అవతారము చూసి.. వ్యంగ్యము ప్రదర్శించినచో.. నోరు పడిపోయేలా షపించి పారేత్తా.. జాగ్రత్త..!" అంటూ కళ్ళెర్రజేశాడు అప్పి.

"రేయ్ సుబ్బీ..! ఈడికి నిజంగానే దెయ్యం పట్టిందిరా.. లేకపోతే ఇట్టా పిచ్చపిచ్చగా మాటాడతా సెప్పు..? లాభంలేదు.. ఈడికి పొయ్యిలోంచి కొరకంచ తీసి యెనకపాల నాలుగు వాతలు పెట్టాల్సిందే..! వొంటి మీదున్న దెయ్యం దెబ్బతో దిగిపోద్ది.. నాయాల్ది.." అంటూ దారిపోయే దానయ్య అనేసరికి.

"ఓరోరి పాపాత్ములారా..! నాకు వాతలు పెడతార్రా.. ఉండండి.. నేనేంటో సూపిత్తా.. ఓం.. క్లీమ్.. తత్సత్.." అంటూ తూతూ మంత్రాలు చదవబోయాడు అప్పి.. అలియాస్ అప్పానందస్వామి.

"లాభంలేదురా సుబ్బీగా..! వీడికి నిజంగానే.. ఎర్రగా కాల్చిన కొరకంచి తెచ్చి.. కింద నుంచి పైకి నాలుగు వాతలెట్టెత్తేగానీ.. తిక్క కుదిరేలాలేదు.. రేయ్ సుబ్బీ.. గట్టిగా పట్టుకోండ్రా.. నేనెళ్లి కొరకంచ తెస్తా..!" అంటూ దానయ్య రంగంలోకి దిగేసరికి... "ఒరేయ్.. సుబ్బయ్యా.. దానయ్యా.. అంత పనిసెయ్యమాకండ్రా.. నేను స్వాములోరేంటీ... ఒట్టి సన్యాసిని.. కాదు కాదు.. ఒట్టి సన్నాసిని... హిహ్హీహ్హీ.. అంతే.. " రెండు చేతులు జోడించి మరీ వేడుకున్నాడు అప్పి.

"అంత భయమున్నోడివి.. ఏందిరా ఈ పిచ్చ నాటకాలు..?" నిలదీశాడు సుబ్బి.

"స్వాములకీ.. సన్నాసులకీ.. ఈ మధ్య మంచి గిరాకీ పెరిగింది కదా..! పైగా అట్టాంటోళ్లకి.. రాజకీయ పలుకుబడి కూడా ఎక్కువే. ఎన్నాళ్ళని.. కూలీనాలీ చేసుకుని బతుకుతాం అని..?! ఈ యేషం కట్టా.. అంతే.." అని అసలు విషయం చల్లగా చెప్పుకొచ్చాడు అప్పారావు.


"ఓరి తింగరనాయాలా.. డేరాలు కట్టుకుని.. సన్నాసుల్లా అవతారం ఎత్తి.. యెకసెకాలు యేత్తే.. సూత్తూ ఉండటానికి.. జనాలు అంత యెర్రోళ్ళుకాదు.. బొక్కలో యేసి.. తొక్కేత్తారు.. జాగ్రత్త...?!" అని సుబ్బి అనేసరికి..

"అరె.. బాబూ.. ఇప్పటికే.. మొలకు చుట్టుకున్న లుంగీ చిరిగిపోయింది. ఇక నన్నొదిలేయండ్రా.. నాయినా.." బతిమాలుతూ అప్పి అనేసరికి..

"మరిందాకేదో శపించేత్తానన్నట్టు గుర్తే! ఓపాలి అందర్నీ షపించేత్తే.. అదేంటో మేమూ సూత్తాం.." అని సుబ్బి యెటకారంగా అంటుండగానే..

"రేయ్.. సుబ్బిగా.. అర్జంటుగా పాట పాడాలి.. వత్తానే..!" అంటూ అక్కడ్నుంచి పరుగుతీశాడు అప్పి.. అలియాస్ అప్పారావు.

- గంగాధర్ వీర్ల



వర్షంలో వేడి వేడి నాన్‌వెజ్ సూప్స్

వర్షాకాలంలో గుర్తుకొచ్చేవి వేడి వేడి భజ్జీలే కాదు, సూప్స్ కూడా గుర్తుకొస్తాయి. వీటిని వేడివేడిగా తీసుకుంటే ఆ మజానే వేరు. ఈ సీజనల్లో వచ్చే జలుబు దగ్గు వల్ల ఏదీ తినాలనిపించదు. వేడి వేడి సూప్స్ తాగడం వల్ల నోటికి రుచే కాకుండా.. ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఎప్పుడూ రొటీన్‌గా వెజిటబుల్ సూప్స్ కాకుండా.. ఈసారి నాన్‌వెజ్ సూప్స్ ట్రై చేయండి.

చికెన్‌తో



కావల్సిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్ ముక్కలు – కప్పు, ఉడికించి నీళ్లు పిండేసిన మీల్‌మేకర్ గ్రాన్యూల్స్ – కప్పు, పచ్చిమిర్చి – రెండు, ఉల్లిపాయ – ఒకటి, పుదీనా ఆకులు – కొన్ని, కొత్తిమీర – కట్ట, పసుపు – చిటికెడు, ఉప్పు – తగినంత, వెల్లుల్లి రెబ్బలు – రెండు, మిరియాల పొడి – రుచికి సరిపడా, ఉల్లికాడల తరుగు – కొద్దిగా.

తయారుచేసే విధానం: ముందుగా ఉల్లిపాయ, కొత్తిమీర, పుదీనా ఆకులు, వెల్లుల్లి రెబ్బలు, మిరియాల పొడిని మిక్సీలో తీసుకుని మెత్తని పేస్టులా చేసుకోవాలి. ఇప్పుడు చికెన్ ముక్కలూ, మీల్ మేకర్ గ్రాన్యూల్స్, తగినంత ఉప్పు, పసుపు ఓ గిన్నెలోకి తీసుకుని అందులో కొత్తిమీర మిశ్రమం వేసుకోవాలి. మూడు కప్పుల నీళ్లు, ఉల్లికాడల తరుగూ వేసి మూడు కూతలు వచ్చే వరకు కుక్కర్‌లో ఉడికించుకుంటే వేడివేడి సూప్ తయారైనట్లే.

మటన్‌తో



కావలసిన పదార్థాలు : మటన్ మూలుగ ఎముకలు: కిలో, బోన్‌లెస్ మటన్: 200గ్రాములు, పలావు ఆకులు: రెండు, ఉల్లిపాయలు: రెండు(పెద్దవి, ఒకటి నాలుగు ముక్కలుగా కోయాలి, ఇంకొకటి సన్నని ముక్కలుగా కోయాలి), అల్లంవెల్లుల్లి: టీస్పూను, నెయ్యి: మూడు టేబుల్‌స్పూన్లు, మిరియాలు: టీస్పూను, గరంమసాలా: టీస్పూను, ఉప్పు: రుచికి సరిపడా, కొత్తిమీర: కట్ట, పుదీనా: కట్ట.

తయారుచేసే విధానం: మటన్ ఎముకల్ని మంచినీళ్లతో శుభ్రంగా కడగాలి. వెడల్పాటి పాన్‌లో మటన్ ముక్కలు, ఎముకల ముక్కలు, ఉప్పు, పలావు ఆకు, పెద్ద ఉల్లిముక్కలు వేసి నాలుగు లీటర్ల నీళ్లుపోసి అవి సగం అయ్యేవరకూ మరిగించాలి. వడగట్టిన ముక్కల్ని బయటకు తీసి చిన్న ముక్కలుగా కోసి సూప్‌లో వేయాలి. గరంమసాలా, ఉప్పువేసి కలపాలి. కొత్తిమీర, పుదీనా తురుము వేసి పది నిమిషాలు మరిగించాలి. పాన్‌లో నెయ్యి వేసి ఉల్లిముక్కలు, వెల్లుల్లి వేసి వేయించి సూప్‌లో కలిపి మళ్లీ ఐదు నిమిషాలు మరిగించాలి. చివరగా కొత్తిమీరతో అలంకరించాలి.

శక్తిని ఇస్తాయి

దగ్గు, జలుబు ఉన్నప్పుడు వేడివేడి సూప్స్ తీసుకుంటే ఉపశమనం కలుగుతుంది. దగ్గు వల్ల వచ్చే వాపు(గొంతులో, ముక్కులో) తగ్గుతుంది. జ్వరం వచ్చినప్పుడు సూప్స్ తాగితే వెంటనే చెమట పట్టి, టెంపరేచర్ కంట్రోల్ అవుతుంది. నాన్‌వెజ్ సూప్స్‌లో మంచి పోషకాలు ఉండటమే కాక, విటమిన్-బి పుష్కలంగా ఉంటుంది. జబ్బుచేసి కోలుకుంటున్న వారికి ఇవి గొప్ప శక్తిని ఇస్తాయి.



జానకి బడుగు,
పోషకాహారనిపుణులు.

ఎగ్ డ్రాప్‌తో



కావల్సిన పదార్థాలు: వెజిటబుల్ స్టాక్– మూడు కప్పులు, కోడిగుడ్లు – రెండు, పచ్చిబఠానీలు – పావుకప్పు, పుట్టగొడుగులు – కొన్నిముక్కలు, ఉప్పు – అరచెంచా, సోయాసాస్– చెంచా.

తయారుచేసే విధానం: వెజిటబుల్ స్టాక్‌ను వేడిచేసి అందులో పుట్టగొడుగుల ముక్కలు, బఠానీలు వేయాలి. ముక్కలు మెత్తబడిన తర్వాత సోయాసాస్, ఉప్పు వేయాలి. కొంచెం మరుగుతుండగా గిలకొట్టిన కోడిగుడ్డును కొద్దికొద్దిగా వేస్తూ బాగా కలపాలి. తక్కువ మంట మీద పావుగంట సేపు ఉడికించాలి.

రొయ్యలతో



కావలసిన పదార్థాలు: నువ్వుల నూనె – ఐదు టీ స్పూన్లు, ఉల్లి ముక్కలు –కప్పు, రెడ్ పెప్పర్ – రెండు (విత్తనాలు తీసి సన్నగా తరగాలి), వెల్లుల్లి తరుగు – టీ స్పూను, ఆవాలు – చిటికెడు, మిరియాల పొడి – టీ స్పూను, కారం – మూడు టీ స్పూన్లు, మైదా – నాలుగు టీ స్పూన్లు, ఫిష్ స్టాక్ – 400 మి.లీ, బిర్యానీ ఆకులు – రెండు, రొయ్యలు – 400 గ్రాములు, ఉప్పు – తగినంత.

తయారుచేసే విధానం: పాన్‌లో నూనె వేడిచేసి ఉల్లి ముక్కలు, వెల్లుల్లి, రెడ్ పెప్పర్ వేసి వేయించాలి. ఆవాలు, కారంవేసి కలపాలి. చిన్న మంట మీద మూడు నిమిషాలపాటు కలుపుతూ ఉడికించాలి. ఫిష్ స్టాక్ పోస్తూ, బాగా కలిసేలా తిప్పాలి. బిర్యానీ ఆకు వేసి మరిగించాలి. ఐదు నిమిషాలపాటు చిన్న మంట మీద ఉంచి సూప్ చిక్కబడేవరకూ కలపాలి. రొయ్యలు వేసి అవి ముడుచుకునే వరకూ ఐదు నిమిషాలపాటు ఉడికించాలి. చివర్లో ఉప్పు, మిరియాల పొడి వేసి కలిపి దింపేయాలి.


పాయా సూప్

కావాల్సిన పదార్థాలు: మేక కాళ్లు – నాలుగు (నాలుగేసి ముక్కలుగా కట్ చేయాలి), టమాటో ప్యూరీ – కప్పు, ఉల్లితరుగు – రెండు కప్పులు, గరంమసాలా – టీ స్పూను, అల్లంవెల్లుల్లి పేస్ట్ – రెండు టీ స్పూన్లు, ధనియాలపొడి – టేబుల్ స్పూను, పచ్చిమిర్చి – ఐదు, కొబ్బరితురుము – రెండు టేబుల్ స్పూన్లు, కారం – రెండు టీ స్పూన్లు, మిరియాల పొడి – టీ స్పూను (పొడి మరీ మెత్తగా ఉండకూడదు), పసుపు – కొద్దిగా, కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను, నూనె – మూడు టేబుల్ స్పూన్లు, లవంగాలు – ఆరు, ఏలకులు – నాలుగు, దాల్చినచెక్క – చిన్న ముక్క, బిరియానీ ఆకు – ఒకటి, ఉప్పు – తగినంత.



తయారుచేసే విధానం: కప్పు ఉల్లితరుగు, కొత్తిమీర, పచ్చిమిర్చి, కొబ్బరితురుము వేసి మెత్తగా పేస్ట్ చేసి, పక్కన ఉంచాలి. కాళ్ల (ముక్కలు)ను శుభ్రంగా కడగాలి. దీనిలో లీటరు నీరు, పసుపు, ఉప్పు జత చేసి కుక్కర్‌లో ఉంచి ఆరు విజిల్స్ రానివ్వాలి. పాన్‌లో నూనెకాగాక, లవంగాలు, యాలకులు, దాల్చినచెక్క, బిర్యానీ ఆకు వేసి బాగా కలిపి, అల్లంవెల్లుల్లి పేస్ట్ జత చేయాలి. ఉల్లితరుగు వేసి రెండు నిముషాలు వేయించాలి. ధనియాలపొడి, కారం, గరంమసాలా, మిరియాలపొడి వేసి నిముషం పాటు వేయించాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని, కుక్కర్‌లో ఉడికించి ఉంచుకున్న కాళ్ల ముక్కలను వేసి, తరువాత టమాటో ప్యూరీ జత చేసి సుమారు రెండు నిముషాలు సన్నని మంట మీద ఉడికించాలి. తయారుచేసి ఉంచుకున్న కొబ్బరి మసాలా, అర లీటరు నీరు జతచేసి, మంట పెద్దది చేసి ఆరు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి.

కాలుష్యం నుంచి
చర్మ రక్షణ ఇలా..



మన చుట్టూ వాతావరణంలో ఉన్న గాలి, నీటి కాలుష్యం చర్మ ఆరోగ్యానికి చాలా వరకూ నష్టం కలిగిస్తాయి. కొన్ని చిట్కాలు పాటిస్తే ఆ నష్టాన్నుంచి బయట పడొచ్చు. •ఎండలోకి వెళ్ళే 20 నిమిషాల ముందు సన్ స్క్రీన్ లోషన్ రాసుకోవటం వలన చర్మం పొడిగా మారదు. బయటకి వెళ్ళే 10 నిమిషాల ముందు మీ చర్మానికి తేమనింపే లోషన్లను రాయాలి. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్యలో బయటకి వెళ్ళకూడదు. ఈ సమయంలో సూర్యరశ్మి ఎక్కువగా ఉంటుంది. •కాలుష్యం వలన మీ చర్మంపై నిండిఉన్న దుమ్ము, ధూళి వంటి వాటిని తొలగించుటకు రోజు ముఖాన్ని కడగండి. ఎల్లప్పుడూ మీతో కాటన్ బాల్స్, క్లీనర్లను బ్యాగ్‌లో ఉంచుకొని వెళ్ళండి. మీరు పడుకోటానికి ముందు చర్మాన్ని శుభ్రపరచి పడుకోండి. •వారంలో కనీసం ఒకసారైన ముఖాన్ని స్క్రబ్ చేయటం అవసరం. ఇలా చేయటం వలన చర్మంలోని నిర్జీవ కణాలతో పాటూ, దుమ్ము, ధూళీ కణాలు తొలగిపోతాయి. సాధారణ స్క్రబ్‌కు బదులుగా సన్ స్క్రీన్ స్క్రబ్‌ను వాడడం అవసరం. •ఆరోగ్యకరమైన మెరిసే చర్మం కోసం, నట్స్, ఫ్రూట్ జ్యూస్, ఫిష్, పచ్చని ఆకుకూరలను ఆహార ప్రణాళికలో ఒక భాగం చేసుకోవాలి.

మీ కోసం

కళ్లకింది భాగంలో ముడతలు పోవాలంటే నిమ్మరసాన్ని మృదువుగా రాసి, ఆ తర్వాత కడిగేయాలి.



జీవన సౌరభం

ఒక మంచి కారణం కోసం ఓడిపోవడం అన్నది గెలుపుకు మరింత చేరువలో ఉండడమే.

సెన్సెక్స్ ▼ 362
31,388

నిఫ్టీ ▼ 117
9,796

రూపాయి ▼ 10 పైసలు
ఒక అమెరికా డాలరుకు రూ. 64.02



మార్కెట్లకు భారీ నష్టాలు

- సెన్సెక్స్ 362 పాయింట్ల పతనం
- నాలుగు రోజుల లాభాలకు తెర

ముంబయి : వివిధ అంతర్జాతీయ, జాతీయ పరిణామాల మధ్య మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలు చవి చూశాయి. జపాన్ ఉపరితలం మీదుగా ఉత్తర కొరియా క్షిపణి పరీక్షించిందన్న వార్తలు ప్రపంచ మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురి చేశాయి. దీనికి తోడు ఎఫ్అండ్ఒ కాంట్రాక్టుల ముగింపు నేపథ్యంలో సెన్సెక్స్ ఓ దశలో 400 పాయింట్ల మేర కోల్పోయింది. అదే విధంగా ఎన్‌టిపిసిలో 5 శాతం వాటా డిజిన్వెస్ట్‌మెంట్ ప్రక్రియ వల్ల ఆ కంపెనీ సూచీ 3 శాతం నష్టపోయింది. ఈ పరిణామాల మధ్య బిఎస్ఇ సెన్సెక్స్ 362.43 పాయింట్లు నష్టపోయి 31,388.39కు దిగజారింది. ఉదయం 31,724 వద్ద ప్రారంభమైన సూచీ ఓ దశలో 31,739.80 గరిష్ట స్థాయిని తాకింది. అనంతరం అమ్మకాల ఒత్తిడితో ఓ దశలో ఏకంగా 31,360.81 పాయింట్ల కనిష్ట స్థాయిని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 116.75 పాయింటు క్షీణించి 9,796.05 వద్ద ముగిసింది.బిఎస్ఇలో అన్ని రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. మౌలిక వసతుల సూచీ 1.86శాతం, విద్యుత్ 1.56శాతం, కన్స్యూమర్ డురెబుల్స్ 1.47శాతం, పిఎస్‌యు 1.24శాతం చొప్పున పడిపోయాయి. మరోవైపు ఎన్‌టిపిసి 2.8శాతం, సన్‌ఫార్మా 2.35శాతం, హెచ్‌డిఎఫ్‌సి 2.2శాతం, రిలయన్స్ 2.17శాతం, కోల్ ఇండియా 2.1శాతం చొప్పున అత్యధిక నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. ఎంఅండ్ఎం 0.25శాతం, విప్రో 0.02శాతం చొప్పున లాభాలు పొందిన వాటిలో ముందున్నాయి.

రెండేళ్లలో 100 స్టోర్లకు విస్తరిస్తాం

మేకర్స్ ఆఫ్ మిల్క్‌షేక్స్ సిఇఒ

హైదరాబాద్ : వచ్చే రెండేళ్లలో 'మేకర్స్ ఆఫ్ మిల్క్ షేక్స్' స్టోర్లను 100కు విస్తరించాలని నిర్దేశించుకుందని ఆ సంస్థ సిఇఒ రాహుల్ తిరుమల ప్రగడ తెలిపారు. ప్రస్తుతం తాము దేశవ్యాప్తంగా 40కి పైగా ఔట్‌లెట్లను కలిగి ఉన్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో హైదరాబాద్‌లో 30 ఔట్‌లెట్స్ ఉన్నాయన్నారు. మిగతా పది ముంబయి, బెంగుళూర్, పూణె, వైజాగ్, విజయవాడ, అన్నవరంలలో విస్తరించి ఉన్నామన్నారు. వీటిలో 5 సొంతవని, మిగితా 35 ఫ్రాంచైజీల ద్వారా నడుస్తున్నాయన్నారు. మేకర్స్ ఆఫ్ మిల్క్‌షేక్స్ ఈ సంవత్సరం తమ స్టోర్ల సంఖ్యను 60కి పెంచుకోనున్నదన్నారు. అదేవిధంగా వచ్చే సంవత్సరం చివరినాటికి మొత్తం స్టోర్ల సంఖ్య 100కు చేర్చనున్నామన్నారు. రాజమండ్రిలో కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. వచ్చే ఏడాది ఇతర మెట్రో నగరాలు, ద్వితీయశ్రేణి నగరాలపై దృష్టి కేంద్రీకరిస్తామన్నారు.

హచిసన్‌కు 32,000 కోట్ల జరిమాన

వొడాఫోన్ ఒప్పందంపై ఐటి దెబ్బ

న్యూఢిల్లీ : హచిసన్ తన భారత వ్యాపారాలను వొడాఫోన్‌కు విక్రయించిన సమయంలో భారీ మొత్తంలో పన్ను ఎగవేసిన విషయం తెలిసిందే. ఈ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. ఈ విషయంలో బిలీనియర్ లీ కా సింగ్‌కు చెందిన హచిసన్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు ఆదాయపు పన్ను శాఖ వడ్డీ, డిమాండ్ పన్ను, జరిమాన తదితర కలుపుకుని రూ.32,320 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేసింది. 2007లో బ్రిటన్‌కు చెందిన వొడాఫోన్‌కు హచిసన్ తన భారత మొబైల్ వ్యాపారాన్ని 11 బిలియన్ డాలర్లకు విక్రయించింది. ఈ ఒప్పందంలో హచిసన్ అనుచిత లబ్ధి పొందిందని, ఇందుకోసం



రూ.7,900 కోట్లు పన్ను చెల్లించాలని ఆ సమయంలో ఐటి శాఖ నోటీసులు ఇచ్చింది. 10 సంవత్సరాలు గడిచిన ఇప్పటికీ హచిసన్ స్పందించ కపోవడంతో దీనిపై తాజాగా రూ.16,430 కోట్ల వడ్డీ, మరో రూ.7,900 కోట్ల జరిమాన విధించింది. మొత్తంగా రూ.30,230 కోట్లు చెల్లించాలని భారత ఐటి శాఖ తమకు నోటీసులు జారీ చేసిందని హచిసన్ తన హాంకాంగ్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో పేర్కొంది.

రూ.550 పెరిగిన బంగారం

న్యూఢిల్లీ : జపాన్ మీదుగా ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణి ప్రయోగం చేసిందన్న వార్తలు ప్రపంచ మార్కెట్లో పసిడికి డిమాండ్‌ను పెంచాయి. ఈ పరిణామం వల్ల ధరలు మరింత పెరుగుతాయన్న అంచనాల్లో స్థానిక, రిటైల్ వర్తకులు, నాణేల తయారీదార్లు పసిడి కొనుగోళ్లకు డిమాండ్ చూపడం ధరల పెరుగుదలకు కారణమయ్యాయి.ఈ పరిణామాల మధ్య మంగళవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.550 ఎగిసి వరుసగా రూ.30,450, రూ.30,300గా పలికింది. ఇంతక్రితం సెషన్‌లో రూ.50 తగ్గింది. కాగా గ్లోబల్ మార్కెట్ సింగపూర్‌లో ఒక్క ఔన్స్ పసిడిపై ధర 0.90 శాతం




పెరిగి 1,322.41 డాలర్లకు చేరింది. గతేడాది నవం బర్ 9 తర్వాత ఒకే రోజు ఈ స్థాయిలో ధర పెరగడం ఇదే తొలిసారి. కిలో వెండిపై రూ. 900 భారమై రూ. 41,000కు చేరింది. 100 వెండి నాణేలపై కూడా రూ.1,000 ప్రియమై రూ.74,000గా నమోదయ్యింది.

రోజుకు రూ.100 పెనాల్టీ!

- రిటర్న్‌ల జాప్యాన్ని తగ్గించేందుకే చర్య
- లక్ష్యాన్ని మించిన జీఎస్టీ వసూళ్లు
- ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడి

న్యూఢిల్లీ : వస్తుసేవల పన్ను (జీఎస్టీ) ఫైలింగ్‌లో జాప్యాన్ని నివారించేందుకు గాను ఇకపై కఠినంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆలస్యంగా రిటర్నులను దాఖలు చేస్తున్న వారిపై రోజుకు రూ.100 చొప్పున అపరాధ రుసుమును వసూలు చేయనుంది. ఈ విషయాన్ని స్వయంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మంగళవారం వెల్లడించారు. సెంట్రల్ జీఎస్టీ, స్టేట్ జీఎస్టీలకు సంబంధించిన రిటర్న్‌లకు ఈ పెనాల్టీ వర్తిస్తుందని జైట్లీ తెలిపారు. కొత్త పన్ను విధానంలో మొదటి నెల జీఎస్టీ రిటర్నుల దాఖలునకు ఆఖరి తేది ఆగస్టు 25తో ముగిసింది. జీఎస్టీ తొలి వసూళ్ల లక్ష్యాలను మించి నమోదైయినట్టుగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. జులై నెలలో జీఎస్టీ వసూళ్ల లక్ష్యాన్ని దాటేసి రూ.92,283 కోట్లకు చేరువైనట్టుగా మంత్రి వెల్లడించారు. మొత్తం వసూళ్లలో సెంట్రల్ జీఎస్టీ నుంచి రూ.14,894 కోట్లు, స్టేట్



జీఎస్టీ నుంచి రూ.22,722 కోట్లు, సమీకృత జీఎస్‌టీ నుంచి రూ.47,469 కోట్ల పన్ను వసూళ్లు జరిగినట్టుగా జైట్లీ వివరించారు. మొత్తంగా చూస్తే పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరిగినట్టుగా మంత్రి తెలిపారు. వార్షిక బడ్జెట్‌లో నిర్దేశించుకున్న ప్రకారం జులై నెలలో కేంద్ర ప్రభుత్వానికి రూ.48,000 కోట్లు, రాష్ట్రాలకు రూ.43,000 కోట్ల మేర పన్నుల వసూళ్లు జరగాల్సి ఉందని ఆయన వివరించారు. మొత్తంగా చూస్తే నిర్దేశించుకున్న లక్ష్యాలతో పోలిస్తే వసూళ్లు ఎక్కువగా ఉన్నట్టు ఆయన విశ్లేషించారు. జీఎస్‌టీ నెట్‌వర్క్‌లోకి 59.57 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు నమోదయ్యారని.. వీరిలో దాదాపు 38.3 లక్షల మంది జీఎస్టీ రిటర్నులను ఫైల్ చేసినట్టుగా జైట్లీ తెలిపారు. కొత్త పన్ను విధానలంలోకి దాదాపు 72.33 లక్షల వ్యాపార సంస్థల వారు మారారని జైట్లీ తెలిపారు. అయితే కేవలం 58.53 లక్షల మంది మాత్రమే గుర్తింపును జారీ చేసేందుకు అవసరమైన నిబంధనలను పూర్తి చేసినట్టుగా జైట్లీ వివరించారు.



ఎన్.పి.ఎ ల రెండో జాబితా ఆర్‌బిఐ కసరత్తు..!

న్యూఢిల్లీ : బ్యాంకులకు భారీ మొత్తంలో రుణాలు ఎగ్గొట్టిన మొండి బకాయిదార్లకు సంబంధించిన రెండో జాబితాను రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) సిద్ధం చేస్తోందని సమాచారం. కార్పొరేట్లనుంచి మొండిబకాయిలను రాబట్టుకునే ప్రక్రియలో భాగంగా దాదాపు 30-40 కంపెనీలతో కూడిన జాబితాను త్వరలోనే విడుదల చేయనుందని ఎకనామిక్స్ టైమ్స్ ఒక కథనంలో పేర్కొంది. ఇందుకోసం నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)లో ఆర్‌బిఐ కేసు దాఖలు చేయనుంది. వచ్చే మాసం సెప్టెంబర్‌లో ఈ జాబితాను బహిర్గతం చేయనుందని తెలుస్తోంది. వీటిలో ముఖ్యంగా మౌలిక వసతుల కంపెనీలు, విద్యుత్ రంగ కంపెనీలు ఉండనున్నాయని సమాచారం. బ్యాంకులకు భారీగా రుణాలు చెల్లించాల్సిన ఉత్తమ్ గాల్వా, వీడియోకాన్, విసా స్టీల్, కాస్టెక్స్ టెక్నాలజీస్ , జెఎస్‌పిఎల్ తదితర కంపెనీలు ఉండనున్నాయి. ఈ జాబితాలో రూ.3000 కోట్ల నుంచి రూ.50,000 కోట్ల మేర మొండి బాకీలున్న కంపెనీల పేర్లుంటాయని తెలుస్తోంది. ఈ మొత్తం కంపెనీల మొండి బాకీల విలువ రూ.1,75,000 కోట్లుగా అంచనా వేస్తున్నారు. భారత బ్యాంకులు రూ.9 లక్షల కోట్ల పైగా మొండి బాకీలతో విలవిలలాడుతోన్నాయి.

మూడేళ్లలో 10% మార్కెట్ వాటా లక్ష్యం

నీటి శుద్ధి యంత్రాల వ్యాపారంపై బ్లూ స్టార్

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

ప్రముఖ ఎయిర్ కండీషనర్ల తయారీ సంస్థ బ్లూ స్టార్ వచ్చే మూడేళ్లలో నీటి శుద్ధి యంత్రాల వ్యాపారంలో 10 శాతం మార్కెట్ వాటా సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కంపెనీ మంగళవారం మార్కెట్లోకి నూతన టెక్నలాజీతో కూడిన వాటర్ ప్యూరిఫైయర్‌లను విడుదల చేసింది. ఈ సందర్భంగా బ్లూ స్టార్ సేల్స్ అండ్ మార్కెటింగ్ ప్రొడక్టు బిజినెస్ ప్రెసిడెంట్ సిపి ముకుందన్ మీనన్ మాట్లాడుతూ వాటర్ ప్యూరిఫైయర్‌లలో ఇప్పటికే మొత్తం 21 మోడళ్లను ఆవిష్కరించమన్నారు. వీటి ధరల శ్రేణి రూ.7,900 నుంచి రూ.44,900 వరకు ఉందన్నారు. ఈ రంగం ప్రతి ఏడాది 22 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. మార్కెట్ విలువ రూ.4000 కోట్లుగా ఉందన్నారు. ఇందులో ఎలక్ట్రిక్ ప్యూరిఫైయర్ల వాటా 80శాతమని పేర్కొన్నారు. తాము ప్రస్తుత ఏడాదిలో రూ.60 కోట్లు, వచ్చే ఏడాది రూ.120 కోట్లు, 2021 నాటికి రూ.500 కోట్ల టర్నోవర్ అంచనా వేస్తున్నామన్నారు. గతేడాది అక్టోబర్‌లో బ్లూ స్టార్ ఈ రంగంలోకి ప్రవేశించిందన్నారు. ఈ కాలంలో దాదాపుగా 10వేల యూనిట్లను విక్రయించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లో 10,000 యూనిట్లు విక్రయిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.

గ్రూప్స్, ఇతర పోటీపరీక్షల ప్రత్యేకం

ఉపాధి



ఎస్.పి. మనోహర్ కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

'పవర్‌హౌస్ ఆఫ్ ది సెల్' అని దేనికి పేరు ?

(జనరల్ సైన్స్) కణ శాస్త్రం

కణాల గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని **'కణశాస్త్రం'** (సైటాలజీ) అంటారు. కణం నుంచి ఏర్పడిన కణజాలాన్ని అధ్యయనం చేసే శాస్త్రాన్ని **కణజాలశాస్త్రం (హిస్టాలజీ)** అంటారు. కణజాలాల అమరిక, వాటి అంతర్నిర్మాణాలను అధ్యయనంచేసే శాస్త్రాన్ని **'అనాటమీ'** అంటారు. కణం నుంచి కణజాలం, కణజాలం నుంచి అవయవాలు, అవయవాల నుంచి అవయవ వ్యవస్థ, అవయవ వ్యవస్థలన్నీ కలిపి జీవిగా ఏర్పడతాయి. అంటే జీవి ఏర్పాటు జరగాలన్నా, జీవిలో ఏపని జరగాలన్నా కణం అవసరం. అందుకే కణాన్ని జీవి యొక్క **'నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం'** అని అంటారు.


✧ **కణ సిద్ధాంతం :** దీనిని మథియాస్ ష్లైడన్, థియోడార్ ష్వాన్, రుడాల్ఫ్ విర్కోవ్ అనే జర్మనీకి చెందిన శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. దీని ప్రకారం ప్రతిజీవీ కణాలతో నిర్మితమవుతుంది.

✧ **కణ సంక్రమణ సిద్ధాంతం :** దీనిని రుడాల్ఫ్ విర్కోవ్ అనే శాస్త్రవేత్త ప్రతిపాదించారు. దీనిని అనుసరించి ప్రతికణం తన ముందున్న కణం నుంచి ఏర్పడుతుంది.

జీవ సామ్రాజ్యంలో అతిపెద్ద కణం **'ఆస్ట్రిచ్ అండం'**, అతిచిన్న కణం **'మైకోప్లాస్మా'** వృక్షరాజ్యంలో పెద్దకణం **'అసిటాబ్యులేరియా'** ఇది ఒక శైవలం. జంతురాజ్యంలో అతిచిన్న కణం **'శుక్రకణం'.** మొట్టమొదట సజీవ కణాన్ని కనుగొన్నది **'ఎంటనీవాన్ లీవెన్‌హక్'**

✧ **కణాల రకాలు :** రెండు రకాల కణాలు కలవు

1.కేంద్రక పూర్వకణాలు



2. నిజకేంద్రక కణాలు

✧ **కేంద్రక పూర్వకణాలు :** ఇవి మొనిరా అనే సమూహానికి చెందినవి. వీటి కేంద్రకం చుట్టూ కేంద్రకత్వచం ఉండదు. అంటే డిఎన్ఎ లేదా క్రోమోజోములు నగ్నంగా ఉంటాయి. వీటిని న్యూక్లియాయిడ్‌లు అంటారు. వీటిలో 70 ఎస్ రకానికి చెందిన రైబోజోములు ఉంటాయి. వీటిలో ముఖ్య కణాంగాలైన మైటోకాండ్రియా, హరితరేణువు, గాల్జీ సంక్లిష్టము, అంతర్జీవ ద్రవ్యజాలము ఉండవు.

✧ **నిజకేంద్రక కణాలు :** కేంద్రకాన్ని ఆవరించి నిర్ధిష్టమైన కేంద్రక త్వచాలు ఉంటాయి.

ఉదా : శైవలాలు, శిలీంధ్రాలు, జంతువులు, మొక్కలు.

✧ **కణ కవచం :** ఇది మొక్కల కణాలను మాత్రమే ఆవరించి ఉంటుంది. జంతువుల్లో ఉండదు. సెల్యులోజ్ అనే కార్బోహైడ్రేట్‌తో నిర్మితమవుతుంది. సెల్యులోజ్ మొక్కల్లో అత్యధికంగా ఉండే సహజ పాలిమర్. ఇది క్యాల్షియం, మెగ్నీషియం పెక్టేట్‌లతో నిర్మితమవడం వల్ల కణానికి రక్షణ, ఆకారాన్ని ఇస్తుంది.

✧ **జీవ పదార్థం :** కణకవచం లోపల ఉండే ద్రవరూప పదార్థం. దీనిలో 80% నీరు ఉంటుంది. దీనిని ఆవరించి ఉండే పొరను **'ప్లాస్మా లేక కణత్వచం'** అంటారు. ప్లాస్మా **'లిపో ప్రోటీన్'**తో నిర్మితమవుతుంది. దీనిలో ఉండే సూక్ష్మ నిర్మాణాలను 'కణాంగాలు' అంటారు. మైటోకాండ్రియా, హరిత రేణువు, రైబోజోములు, అంతర్జీవ ద్రవ్యజాలం, గాల్జీ సంక్లిష్టం, లైసోజోములు, రిక్తిక, కేంద్రకం, కేంద్రకంలో క్రోమోజోములు ఉంటాయి.

✧ **మైటోకాండ్రియా :** ఇవి పెరుగుదలను చూపే భాగాల్లో ఉంటాయి. శ్వాసక్రియలో పాల్గొని, శక్తిని ఎటిపి రూపంలో ఉత్పత్తి చేసి నిల్వచేస్తాయి. అందువల్ల దీనిని **'పవర్‌హౌస్ ఆఫ్ ది సెల్'** (కణశక్తి భాండాగారం) అని అంటారు.

✧ **హరిత రేణువు :** ఇవి జంతువులు, శిలీంధ్రాల్లో ఉండవు. వీటిలో క్లోరోఫిల్ ఉండటం వల్ల ఇవి కిరణజన్య సంయోగక్రియలో పాల్గొని పిండిపదార్థాన్ని ఏర్పడేట్లు చేస్తాయి. అందువల్ల దీనిని **'కిచెన్‌హౌస్ ఆఫ్ ది సెల్'** అని అంటారు.


✧ **రైబోజోములు :** ఇవి ప్రోటీన్ల తయారీలో పాల్గొంటాయి. కాబట్టి వీటిని **'ప్రోటీన్ ఫ్యాక్టరీలు'** అని అంటారు.


✧ **అంతర్జీవ ద్రవ్యజాలం :** ఇవి కేంద్రకం నుంచి ఏర్పడి కణం లోపల వలలాగ విస్తరించిన నిర్మాణం. ఇందులో నునుపు అంతర్జీవ ద్రవ్యజాలం, గరుకు ద్రవ్యజాలం అని రెండు రకాలుంటాయి. నునుపు అంతర్జీవ ద్రవ్యజాలంలో రైబోజోములు ఉండవు. ఇది లిపిడ్స్, కొవ్వులను తయారుచేస్తుంది. గరుకు అంతర్జీవ ద్రవ్యజాలంలో రైబోజోములు ఉంటాయి. ఇది ప్రోటీన్లను తయారుచేస్తుంది.

✧ **గాల్జీసంక్లిష్టము :** ప్రోటీన్‌లను స్రవించే కణాంగం. ఇవి గ్రంథులలో అధికంగా ఉంటాయి.

✧ **లైసోజోమ్స్ :** వీటికి కణం యొక్క ఆత్మాహుతి సంచులు **(సూసైడ్ బ్యాగ్‌లు)** అంటారు. కణంపైకి ఏవైనా వ్యాధికారక సూక్ష్మజీవులు దాడిచేస్తే, కణానికి ఆహారం దొరకని పరిస్థితుల్లో వివిధరకాలు జలవిశ్లేషక ఎంజైమ్స్‌ను విడుదలచేసి, కణ విచ్ఛిత్తిలో అనగా కణాంతర జీర్ణక్రియలో పాల్గొంటాయి.

✧ **రిక్తిక :** ఇవి కణం యొక్క విసర్జక పదార్థాల నిల్వ కేంద్రం. **'సెల్ రిజర్వాయర్ ఆఫ్ వేస్ట్ ప్రొడక్ట్'** అని అంటారు. లేత కణాల్లో ఇవి ఎక్కువగా ఉంటాయి. దీనిచుట్టూ **'టోనోప్లాస్ట్'** అనే పొర ఉంటుంది. దీనిలో **'ఆంథోసయనిన్'** అనే వర్ణకం ఉంటుంది.





✧ **కేంద్రకం :** కణంలోని కేంద్రకాన్ని కనగొన్నది **'రాబర్ట్ బ్రౌన్'.** కేంద్రకం కణంలోని అన్ని కణాంగాలనూ తన ఆధీనంలో ఉంచుకొంటుంది. అందువల్ల దీనిని **'డైనమిక్ సెంటర్ ఆఫ్ సెల్'** అని అంటారు. దీనిని ఆవరించి రెండు కేంద్రక త్వచాలుంటాయి. కేంద్రకంలో కేంద్రక ద్రవ్యం, కేంద్రకాంశం, క్రోమోజోములు ఉంటాయి.

✧ **క్రోమోజోములు :** వీటిని కనుగొన్నది **'హాఫ్‌మిస్టర్'** అనే శాస్త్రవేత్త. వీటికి క్రోమోజోములు అని పేరును ప్రతిపాదించినది **'వాల్డేయర్'.** ఇవి కేంద్రకంలో ఉండే దండాకార నిర్మాణాలు. ఇవి డిఎన్ఎ, హిస్టోన్స్ అనే ప్రోటీన్లతో ఏర్పడుతుంది. వీటిద్వారా తల్లిదండ్రుల లక్షణాలు పిల్లలకు వ్యాప్తి చెందుతాయి. అంటే ఒక జాతి లక్షణాలను తరువాత తరానికి అందించే ముఖ్య నిర్మాణాలుగా క్రోమోజోములను పేర్కొనవచ్చు. వీటి నిర్మాణంలో రెండు క్రొమాటిడ్స్, మధ్యలో గుండ్రని సెంట్రోమియర్ ఉంటుంది. ఇది ఒక సన్నని వలవలే ఉంటుంది. క్రోమోజోమ్ సంఖ్యను తెలిపే విధానాన్ని **'క్రోమోజోమ్ స్థితి'** అంటారు. మానవునిలో క్రోమోజోముల సంఖ్య 23 జతలు (46). అత్యధిక క్రోమోజోములు గల జీవి 'రేడియోలేరియన్ అల్లోకాంత' దీనిలో 1600 క్రోమోజోములు ఉంటాయి. అతి తక్కువ క్రోమోజోములు ఉండే జీవి రౌండ్ వార్మ్. దీనిలో రెండు క్రోమోజోములుంటాయి. అతి ఎక్కువ క్రోమోజోములు గల మొక్క **'ఒఫియోగ్లాజం'** ఇందులో 1260 క్రోమోజోములుంటాయి. ఇది ఒక టెరిడోఫైట్. అతి తక్కువ క్రోమోజోములు గల మొక్క **'హాప్లాపాపస్'**. ఇందులో నాలుగు క్రోమోజోములుంటాయి.

క్రోమోజోముల స్థితి లేదా జీనోమ్...

✧ **ఏకస్థితి :** ఒకేఒక క్రోమోజోమ్ గల జట్టును ఏకస్థితిక అంటారు. జంతువులలో అండం, శుక్రకణం. మొక్కలలో పరాగరేణువు, పిండకోశం.

✧ **ద్వయస్థితిక :** ఒక జట్టులో రెండు క్రోమోజోములుంటాయి.

ఉదా : మానవుడు, వేరు, కాండం.

✧ **త్రయస్థితిక :** ఒక జట్టులో మూడు క్రోమోజోములుంటాయి.

ఉదా : కొబ్బరిలో అంకురచ్ఛదం.

✧ **బహుస్థితిక :** ఒక జట్టులో అనేక క్రోమోజోములుంటాయి.

ఉదా : పంట మొక్కలు ★

ఉద్యోగాలు

ఐఐటీ మద్రాస్‌లో 32 పోస్టులు

తమిళనాడులోని చెన్నయ్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటీఎం)లో 32 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

పోస్టుల పేరు-ఖాళీలు : రిజిస్ట్రార్-1, సిస్టమ్స్ ఇంజనీర్-1, సెక్యూరిటీ ఆఫీసర్-1, జూనియర్ ఇంజనీర్-3, స్టాఫ్ నర్స్-4, జూనియర్ టెక్నీషియన్-12, జూనియర్ అసిస్టెంట్-10

వేతనం : రిజిస్ట్రార్‌కు-రూ.37,400-రూ.67,000+జీపీ రూ.10,000, సిస్టమ్స్ ఇంజనీర్, సెక్యూరిటీ ఆఫీసర్‌లకు రూ.15,600-రూ.39,100, జూనియర్ ఇంజనీర్, స్టాఫ్‌నర్స్‌కు రూ.9,300-రూ.34,800, జూనియర్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్‌కు రూ.5,200-రూ.20,200

అర్హతలు : సంబంధిత పోస్టులను అనుసరించి ఐటీఐ/ డిగ్రీ/ డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్/ బీఎస్సీ (నర్సింగ్)/ ఎంఈ/ ఎంటెక్/ పీజీ. దీంతోపాటు నిబంధనల మేర మార్కుల శాతం, ఉద్యోగానుభవం ఉండాలి.

వయోపరిమితి : రిజిస్ట్రార్, సిస్టమ్ ఇంజనీర్ పోస్టులకు 50 ఏళ్లు, సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులకు 45 ఏళ్లు, జూనియర్ ఇంజనీర్, స్టాఫ్‌నర్స్‌లకు-32 ఏళ్లు, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ టెక్నీషియన్ పోస్టులకు 27 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు : రూ.100, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులకు/ఎక్స్-సర్వీస్‌మెన్ కేటగిరీ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దానిని ప్రింటవుట్ తీసుకుని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫీజు రిసీట్ తదితర వాటిని జతచేసి, కవరులో ఉంచి 'ది అసిస్టెంట్ రిజిస్ట్రార్, రిక్రూట్‌మెంట్ సెక్షన్, అడ్మిన్ బిల్డింగ్ (ఫస్ట్ ఫ్లోర్), ఐఐటీ మద్రాస్, చెన్నయ్-600036' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ : సెప్టెంబర్ 8, 2017

దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ : సెప్టెంబర్ 15, 2017

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.iitm.ac.in

కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఆందోళన

ప్రజాశక్తి- అనకాపల్లిటౌన్ (విశాఖ)

విశాఖ జిల్లా అనకాపల్లి మండలం వెంకుపాలెంలో ఉన్న జిడిఎస్ కెమికల్ కంపెనీలో కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆ కంపెనీ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎ.బాలకృష్ణ, బుద్ద శ్రీనివాసరావు మాట్లాడారు. కంపెనీ ఏర్పాటుకు భూములు సేకరించిన సమయంలో ఉద్యోగ భద్రత, కార్మిక చట్టాలు అమలు చేస్తామని నమ్మబలికి అకారణంగా ఎనిమిది మంది కార్మికులను తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. జిడిఎస్ కంపెనీలో ఎటువంటి కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. కార్మికులకు రక్షణ పరికరాలు ఇవ్వక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిఎఫ్ ఆన్‌లైన్ చేయించక పోవడం అన్యాయమన్నారు. కంపెనీ విడుదల చేసే కాలుష్యంతో చుట్టు పక్కల పంట పొలాలు తీవ్రంగా దెబ్బ తింటున్నాయని తెలిపారు. కార్మికులను తీసుకునే వరకు ఏ ఒక్క ఉద్యోగిని లోపలకు వెళ్లనీయ బోమని హెచ్చరించారు.

'పోర్టు' రిష్టై కంపెనీ వద్ద సిఐటియు ధర్నా

ప్రజాశక్తి- విశాఖపట్నం

సమస్యలు పరిష్కరించాలని విశాఖ పోర్టు పరిధిలో గల రిష్టై కంపెనీ వద్ద విశాఖ పోర్టు స్టెవ్‌డోర్, మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు బి.జగన్, ప్రధానకార్యదర్శి డి.అప్పలరాజు మాట్లాడారు. ఆరేళ్లుగా పోర్టు పరిధిలో రిష్టై కంపెనీలో సుమారు 100 మంది డ్రైవర్లు, క్లీనర్, ఆపరేటర్స్, ఆఫీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, వారికి కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. చట్టప్రకారం పనిగంటలు, భద్రత, సెలవులు అమలు చేయటం లేదని తెలిపారు. అతి తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా కార్మికుల జీత, భత్యాలు పెంచాలని డిమాండ్ చేశారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్, విశాఖ

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) జిల్లా శాఖ ఆధ్వర్యాన మంగళవారం విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కెఎస్.సన్యాసిరావు మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న పెన్షన్, కుటుంబ పెన్షన్, పిఎఫ్ సౌకర్యం రాష్ట్ర ప్రభుత్వం ఒక్క వేటుతో రద్దుచేసిందని విమర్శించారు. సామాజిక బాధ్యతగా పెన్షన్ చెల్లించాల్సిన ప్రభుత్వాలు తమ బాధ్యత నుంచి తప్పుకుని ఉద్యోగులు చెల్లించే సొమ్ము సైతం కార్పొరేట్ వర్గాల వ్యాపార ప్రయోజనాల కోసం షేర్ మార్కెట్‌లో పెట్టి ఉపాధ్యాయ, ఉద్యోగుల జీవితాలను బలిగొంటున్నాయని విమర్శించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎజె స్టాలిన్ ధర్నా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు కె.శ్యామ్యూల్, ప్రధానకార్యదర్శి డి.పైడిరాజు, శివాజీ, హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాపు తొలగించాలని మహిళల ఆందోళన

ప్రజాశక్తి-సీతమ్మధార, విశాఖ

విశాఖలోని నరసింహనగర్ రైతుబజార్ వద్ద ఉన్న గణేష్ వైన్‌షాపును తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మహిళలు వైన్‌షాపు వద్ద మంగళవారం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు మాట్లాడుతూ జనవాసాల మధ్య ఉన్న మద్యం దుకాణం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారుజామున బార్ తెరిచి అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. రైతుబజార్‌కు వచ్చే వారితో దురుసుగా ప్రవర్తిస్తుండడంతో తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామన్నారు. తక్షణమే బార్ తొలగించాలని డిమాండ్ చేశారు.

'ఫైర్ ఇండియా' అంతర్జాతీయ సదస్సుకు డిజి సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వచ్చే నెల ముంబయిలో జరిగే ఫైర్ ఇండియా-2017 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ అండ్ ఎగ్జిబిషన్‌కు రాష్ట్ర అగ్నిమాపక శాఖ డిజి కె సత్యనారాయణ వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 7 నుంచి 9 వరకు గుర్‌గావ్‌లో మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొంటారు. సత్యనారాయణ ముంబయి పర్యటనలో ఉన్న సమయంలో ఆ శాఖ డైరెక్టర్ కె జయరాం నాయక్ డిజిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రజ్ఞ

జవాబులు

1. ధ్యాన్‌చంద్
2. జస్టిస్ దీపక్ మిశ్రా
3. ముంబయి, 4. 8
5. దక్షిణ కొరియా

మా భూముల్ని తాకట్టు పెడతారా?

రాజధానిలో పనుల కోసం ప్రపంచ బ్యాంకును రుణం కోరిన ప్రభుత్వం

సిఆర్‌డిఎ అధికారులను నిలదీసిన రైతులు



లంక భూములపై అధికారులను ప్రశ్నిస్తున్న రైతు

ప్రజాశక్తి-తుళ్ళూరు

ప్రపంచ బ్యాంకు రుణం పొందడానికి మా భూముల్ని తాకట్టు పెడతారా? అని సిఆర్‌డిఎ అధికారులను రాజధాని ప్రాంత రైతులు ప్రశ్నించారు. నూతన రాజధాని ప్రాంతంలో ప్రపంచ బ్యాంకు సహకారంతో చేపడుతున్న ప్రాజెక్టులకు సంబంధించి 'పర్యావరణ, సామాజిక నిర్వహణ ముసాయిదా విధాన నమూనా, పునరావాసం, రహదారులు, వరద నివారణ తదితర అంశాలపై సామాజిక ప్రభావ మదింపు, పునరావాస కార్యాచరణ ప్రణాళికతోపాటు పలు విషయాలపై మంగళవారం గుంటూరు జిల్లా తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయంలో కన్సల్టేషన్ వర్కుషాపు నిర్వహించారు. దీనిలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా సిఆర్‌డిఎ డైరెక్టర్ ఆఫ్ స్ట్రేటజీ శాస్త్రి మాట్లాడుతూ.. రాజధాని ప్రాంతంలో రహదారుల నిర్మాణంతోపాటు ల్యాండ్ పూలింగ్ స్కీం లేఅవుట్ల అభివృద్ధి పనులను కూడా ప్రపంచ బ్యాంకు రుణంతో అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. తొలి విడతగా రూ.3,200 కోట్లు రుణంగా ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చిందని తెలిపారు. రాజధాని ప్రాజెక్టు, రహదారుల నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే 201 కుటుంబాలు, వ్యక్తులతో ఇప్పటికే పలుమార్లు సమావేశాలు జరిగాయని పేర్కొన్నారు. మరోసారి అభిప్రాయాలు, సూచనలు తీసుకునేందుకు కార్యక్రమం ఏర్పాటు చేశామని వివరించారు. ఈ సందర్భంగా రైతు మల్లెల హరింద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ.. రాజధాని రైతులకు ప్రాధాన్యత కల్పించేలా కమిటీని నియమించాలని డిమాండు చేశారు. సిటిజన్ కమిటీలలో రైతు ప్రతినిధులు ఉంటారా? అని ప్రశ్నించారు.

లింగాయపాలెంకు చెందిన మరో రైతు మేకా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 'ల్యాండ్ పూలింగ్‌లో భూమి ఇవ్వకపోయినా అధికారులు పొలంలో రాళ్లు పాతారు. కరెంటు నిలిపివేశారు. మూడేళ్ళుగా పంటవేయలేదు. నష్ట పరిహారం ఎవరిస్తారు, కోర్టులో స్టే ఉన్నా కరెంటు తీసేస్తారా' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలా వుంటే మీరు రుణం ఎలా ఇస్తారంటూ ప్రపంచ బ్యాంకు ప్రతినిధులనుద్దేశించి అన్నారు. మల్లెల శేషగిరిరావు అనే రైతు మాట్లాడుతూ.. రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధికయ్యే ఖర్చును రైతులే భరించాలని సిఆర్‌డిఎ చట్టంలో ఉందని, దానిని తొలగించాలని కోరారు. దీనిపై ఉన్నతాధికారులతో చర్చిస్తామని డైరెక్టర్ ఆఫ్ స్ట్రాటజీ శాస్త్రి వివరణ ఇచ్చారు.

పచ్చని పొలాల ధ్వంసాన్ని తీవ్రంగా పరిగణించిన హైకోర్టు!

'వంశధార'పై హైకోర్టులో పిల్ దాఖలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార నిర్వాసితులకు చెందిన పచ్చని పొలాలను ధ్వంసం చేయటంపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించినట్లు తెలిసింది. భూముల స్వాధీనానికి శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలం దుగ్గుపురం, పాడలి, తులగాం, చిన్నకొల్లివలస తదితర నిర్వాసిత గ్రామాల రైతుల పంట పొలాలను ట్రాక్టర్లు, జెసిబిలతో ప్రభుత్వం చదును చేసిన విషయం విదితమే. దీనిపై శ్రీకాకుళం నగరానికి చెందిన మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల ఉపాధ్యక్షులు కె.వి.జగన్నాథరావు సోమవారం హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని (పిల్ నంబర్ 222/17) దాఖలు చేశారు. వంశధార నిర్వాసితులకు చెందిన 400 ఎకరాలను ప్రభుత్వం నాశనం చేయించిందని తన పిటిషన్‌లో పొందుపర్చారు. 2014 జనవరి ఒకటికి ఐదు సంవత్సరాల ముందు భూసేకరణ చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించినా, భూమి రైతుల ఆధీనంలోనే ఉన్నట్టయితే వారే యజమానులవుతారని 2013 భూ సేకరణ చట్టం చెప్తోందని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా వంశధార నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం వర్తిస్తుందని తన పిటిషన్‌లో పొందు పరిచారు. రాష్ట్ర భూసేకరణ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు ఆరు శాఖల అధికారులను ప్రతివాదులుగా చేర్చారు. దీనిపై మంగళవారం హైకోర్టులో హియరింగ్‌కు వచ్చింది. పచ్చని పంట పొలాలను ధ్వంసం చేయడమేమిటని ప్రభుత్వ న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించినట్లు జగన్నాథరావు తెలిపారు. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు వారం రోజులు గడువును ప్రభుత్వ న్యాయవాది కోరినట్లు చెప్పారు.

మిలియన్ మార్చ్‌కు ఫ్యాప్టో సంపూర్ణ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్)రద్దు కోసం వచ్చేనెల 1న వేలాదిమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులతో జరిగే మిలియన్ మార్చ్‌కు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని ఫ్యాప్టో చైర్మన్ పి బాబురెడ్డి, సెక్రటరీ జనరల్ జి హృదయరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో సభ్య సంఘాలైన యుటిఎఫ్, ఎపిటిఎఫ్-1938, ఎస్టీయు, ఎపిటిఎఫ్-257, డిటిఎఫ్, హెచ్‌ంఎ, ఆర్‌యుపిపి, ఎస్‌ఎఎస్, ఎపిపిఈటిఎఎస్ అండ్ ఎస్ఎ(పిఈ), బిటిఎ, ఎపిపిటిఎ, ఎస్సీ,ఎస్టీ, యుఎస్ దీనికి సంపూర్ణ మద్దతు నిస్తున్నాయని తెలిపారు. ఐక్యంగా పోరాడి సిపిఎస్ రద్దును సాధిస్తామన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల భద్రతను కాలరాసే కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని(సిపిఎస్) 2004 సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రంలో అమలు చేస్తున్నారని వారు పేర్కొన్నారు.

ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలి : పిన్నమనేని



ప్రజాశక్తి-గుడివాడ

ప్రపంచం మెచ్చిన హాకీ క్రీడాకారుడు ద్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని క్రీడాకారులు ముందుకుసాగాలని ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు పిన్నమనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కృష్ణాజిల్లా గుడివాడలోని ఎన్‌టిఆర్ ఇండోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న స్టేడియం క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ.. 1936లో జర్మనీలో జరిగిన ఒలంపిక్స్‌లో అద్భుత క్రీడా నైపుణ్యం చూపిన ధ్యాన్‌చంద్‌కు ప్రభుత్వం పద్మవిభూషణ్ బిరుదుతో ఘనంగా సత్కరించిందన్నారు. మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని, స్టేడియంలోని సదుపాయాలను సద్వినియోగం చేసుకొని మంచిపేరు తీసుకురావాలని కోరారు. అనంతరం జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలను సాధించిన క్రీడాకారులు పి.విల్సన్ బాబు, గోవాడ స్వాతి, జుజ్జవరపు నిఖిత, కె.శిరోమణి, జి.పాల్ ప్రశాంత్, పి.ఫణికుమార్, బి.వినయ్‌కుమార్, జి.సత్యనారాయణ, ఎం.డి.నిశాద్, ఎం.చైతన్య, ఎం.వెంకట్‌లను ఘనంగా సత్కరించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

19 ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లకు అనుమతులు

సిఎస్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రూ.263 కోట్ల విలువైన 19 ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లకు అనుమతులు మంజూరు చేసినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ వెల్లడించారు. వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో స్టేట్ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత నిస్తోందన్నారు. పారిశ్రామిక అభివృద్ధితోనే ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుందన్నారు. ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో 1,968 ఉద్యోగాలొస్తాయన్నారు. ప్రభుత్వ భూముల్ని తీసుకుని, సబ్సిడీలు వాడుకుని, ఉత్పత్తి ప్రారంభించని సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయదలచిన ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్ల వివరాలను ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సిఎస్‌కు వివరించారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ ప్రత్యేక సిఎస్ జెఎస్వీ ప్రసాద్, హార్టీకల్చర్ కమిషనర్ చిరంజీవి చౌదరి, ఎంపవర్ కమిటీ కార్యదర్శి ప్రసాద్, ఆర్థిక శాఖాధికారులు పాల్గొన్నారు.

5, 6, 7 తేదీల్లో ఆశా వర్కర్ల టోకెన్ సమ్మె

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

ఆశా వర్కర్లకు నెలకు రూ.6 వేలు వేతనం పెంచాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. పలు డిమాండ్లపై సెప్టెంబర్ 5, 6, 7 తేదీలలో టోకెన్ సమ్మెకు యూనియన్ పిలుపు నిచ్చిందన్నారు. మంగళవారం నెల్లూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేరళ, కర్ణాటక, బెంగాల్, హర్యానా, రాజస్తాన్, త్రిపుర రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం చెల్లిస్తున్న పారితోషకంతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పారితోషకాలు, గౌరవ వేతనాలు చెల్లిస్తున్నాయన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లు చేస్తున్న పనులకు తగిన వేతనం చెల్లించడంలేదని అన్నారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.6 వేలు జీతం, ఇపిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా చెల్లించాలని డిమాండ్ చేశారు. గౌరవ వేతనాలు వెంటనే ఇవ్వాలని, ఐదేళ్ల నుంచి రావాల్సిన యూనిఫాం, అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. అర్హులైన వారికి ఎఎన్‌ఎంలుగా శిక్షణివ్వాలన్నారు. శిక్షణ పొందిన వారికి రెండో ఎఎన్‌ఎంగా విధుల్లోకి తీసుకోవాలన్నారు.

అమాయకులే 'అగ్రి' బాధితులు

- ప్రజా ప్రయోజనాలను పట్టించుకోని ప్రభుత్వం
- అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్రలో వక్తలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

అగ్రిగోల్డ్‌లో ప్రజలు పెడుతున్న పెట్టుబడులపై ఆనాటి కాంగ్రెస్, ప్రస్తుత టిడిపి ప్రభుత్వాల పరిశీలన సరిగా లేకపోవడంతోనే అమాయకులైన పేదలు వేలకోట్ల రూపాయలు చెల్లించి బాధితులుగా మిగిలారని మాజీ ఎమ్మెల్సీ పిజె.చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 17వ తేదీన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమైన అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య బస్సు యాత్ర మంగళవారం గుంటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా గుంటూరు మహిమా గార్డెన్స్‌లో సినీ సంగీత దర్శకులు ఖుద్దూస్ అధ్యక్షతన నిర్వహించిన సభలో చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రూ.20 వేల లోపు డిపాజిట్లను తిరిగి ఇవ్వాలని కోరితే సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళిక సంఘం చైర్మన్ హామీ ఇచ్చారని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల్లో చిట్‌ఫండ్, ఫైనాన్స్ కుంభకోణాలు ఎక్కువని, బాధితులు కూడా లక్షల సంఖ్యలో ఉన్నారని చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పేర్కొన్నారు. సినీ దర్శకులు మాదాల రవి మాట్లాడుతూ.. 20 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు సంస్థ ఆస్తులను వేలం వేసి డిపాజిట్లను తిరిగి చెల్లించాలంటే ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. వామపక్షాలు ఓట్లు, సీట్ల కోసం పోరాటం నిర్వహించడం లేదని, ఆనాటి నుంచి నేటి వరకు ప్రజల సమస్యల కోసం ఉద్యమిస్తున్నాయని తెలిపారు. ప్రజల ఆస్తులను ప్రభుత్వ పెద్దలకు చెందేలా ప్రభుత్వం వ్యవహరిస్తే బాధితుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. లోక్‌సత్తా, వామపక్ష పార్టీలు తప్ప ఇతర రాజకీయ నాయకుల హస్తం ఉండడం వల్లే ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదన్నారు. ప్రత్యేకహోదా ఉద్యమం మాదిరి అగ్రిగోల్డ్ ఉద్యమాన్ని ప్రభుత్వం తొక్కిపెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. పలు రాష్ట్రాల్లో బాధితులకు డిపాజిట్లను తిరిగిచ్చేందుకు ఢిల్లీకి అఖిలపక్ష పార్టీలను తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. సభలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, సినీ దర్శకులు మద్దినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్షలను రద్దు చేయాలి

రేపు నిరుద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

జులై 15, 16 తేదీల్లో ఎపిపిఎస్‌సి నిర్వహించిన గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలో అవకతవకలు జరిగిన దృష్ట్యా ఆ పరీక్షలను రద్దు చేయాలని నిరుద్యోగ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాజీ శాసన మండలి సభ్యులు కెఎస్.లక్ష్మణరావు మాట్లాడారు. గ్రూపు-2 మెయిన్స్ పరీక్షల్లో విశాఖపట్నం, హైదరాబాద్, చీరాల తదితర కేంద్రాల్లో మాల్‌ప్రాక్టీస్ జరిగిందన్నారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి పరీక్షలను రద్దు చేయాలని కోరారు. ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలు కూడా సిలబస్‌కు అనుగుణంగా లేవని తెలిపారు. ప్రశ్నాపత్రంలో సమతుల్యత లోపించిందని అన్నారు. ఐదేళ్లుగా ఈ పరీక్ష కోసం నిరుద్యోగులు ఎదురుచూశారని, పరీక్ష నిర్వహణలో ఎపిపిఎస్‌సి పూర్తిగా విఫలమైందని చెప్పారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈ పరీక్షను రద్దు చేసి ఆఫ్‌లైన్‌లో పరీక్షను తిరిగి నిర్వహించాలని కోరారు. ఈ డిమాండ్లపై నిరుద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 31వ తేదీ ఉదయం 10 గంటలకు విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం.సూర్యారావు, నిరుద్యోగ ఐక్యవేదిక నాయకులు పరిమి కిరణ్‌కుమార్, కె.వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బీహార్ వరద బాధితులకు సహాయం

ముస్లిం సంక్షేమ సంఘాల సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం (విజయవాడ)

బీహార్‌లో సంభవించిన వరద తాకిడికి ఎంతో మంది నిరాశ్రయులయ్యారని ఆంధ్రప్రదేశ్ ఉల్ మాయే ఆహలేసున్నత్ మత గురువు అల్తాఫ్ రాజా బాబా అన్నారు. కృష్ణాజిల్లా కొండపల్లిలోని షాబుఖారి మసీదు ఆవరణలో మంగళవారం రాష్ట్రస్థాయి రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం నలుమూలల నుంచి ఈ సమావేశానికి హాజరైన మత గురువులందరూ తమ జీతాల్లోంచి శక్తి మేరకు సహాయానిధిని ప్రకటించారని తెలిపారు. బీహార్‌లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి తాము ఎంతగానో బాధపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను ఆదుకోవడం కోసం ప్రతీ మసీదులో విరాళాలు సేకరించాలని తీర్మానించామని చెప్పారు. బక్రీద్ పండుగ నమాజ్ సమయాల్లో కూడా దాతల నుంచి బియ్యం, బట్టలను సేకరించి బీహార్‌కు పంపాలని నిర్ణయించామని తెలిపారు.

కేసుల కొట్టివేత జీవోలపై హైకోర్టు ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం..

వైసిపి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని చట్టాలను కాలరాస్తున్నారని వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చట్టాలను లెక్కచేయడం లేదని, కోర్టులను గౌరవించడం లేదని ధ్వజమెత్తారు. కేసుల కొట్టివేతపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రజల తరుపున స్వాగతిస్తున్నామన్నారు. హత్యలు, అత్యాచారాలు వంటి తీవ్రమైన నేరాల్లో నిందితులుగా ఉన్న వారిపై కేసులు ఎత్తివేస్తే బాధిత కుటుంబాలు ఏమవ్వాలని ప్రశ్నించారు. నేరాల్లో ప్రత్యక్షంగా సంబంధం ఉందని గుర్తించిన పోలీసులు కేసులు పెట్టి న్యాయస్థానాల వరకు తీసుకెళితే, ప్రభుత్వం ఆ కేసులను కొట్టేస్తూ జీవోలు విడుదల చేసిందన్నారు.

స్పీకర్‌పై ఆరోపణలు

అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాలను స్పీకర్ కోడెల శివప్రసాదరావు ముఖ్యమంత్రి చంద్రబాబు ఒత్తిడి మేరకు నిబంధనలు ఉల్లంఘించి అడ్వాన్స్‌డ్ టెలీ కమ్యూనికేషన్స్‌కు కట్టబెట్టారని రామకృష్ణారెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాలపై ఆర్టీఎ చట్టాన్ని ఆశ్రయించగా, స్పీకర్ తన పరిమితిని మించి ఇచ్చినట్లుగా స్పష్టమవుతోందని తెలిపారు. ఆంధ్రజ్యోతి ఎండి వేమూరి రాధాకష్ణ తనయుడు వేమూరి ఆదిత్యకు సంబంధించిన అడ్వాన్స్‌డ్ టెలీ కమ్యూనికేషన్స్‌కు అప్పగించడం ద్వారా క్విడ్‌ప్రోకోకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రివిలేజ్ కిందకు ప్రత్యక్ష ప్రసారాలు రావని, టెండర్లు పిలిచి ఖరారు చేయాలని చట్టాలు స్పష్టంగా చెబుతున్నాయన్నారు. రాధాకృష్ణ కంపెనీ ప్రమేయానికి సంబంధించి అన్ని సాక్ష్యాధారాలను న్యాయస్థానికి అందజేశామని తెలిపారు. కేవలం ప్రతిపక్షం గొంతు నొక్కేయడానికే అసెంబ్లీ ప్రసారాలను అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌కు అప్పగించారని ఆరోపించారు. న్యాయస్థానాలపై అపార గౌరవం ఉందని, అందుకే న్యాయపరంగానే పోరాటం చేస్తున్నామన్నారు.

టిడిపి గ్రాఫ్ పడిపోయింది..

నంద్యాలలో గెలుపు అధికార, ధనబలంతోనే

వైసిపి ఎమ్మెల్యే కొడాలి నాని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురించి నోటికొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్యమంత్రి, మంత్రులను హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ గ్రాఫ్ ఇప్పటికే తగ్గిపోయిందన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో డబ్బు, అధికారం, ప్రలోభాలతోనే గెలిచారని విమర్శించారు. వైఎస్సార్సీపీకి 40 శాతం ఓట్లు వస్తే, 56 శాతం టిడిపికి వచ్చాయన్నారు. అధికారం, డబ్బు, సానుభూతి అన్నీ కలిపితే 56 శాతం వచ్చిందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. నంద్యాల వైసిపి సీటు కాబట్టే పోటీ చేశామన్నారు. ధన, అంగబలం ఉపయోగిస్తారని తెలిసి కూడా పోటీ చేసి పోరాటం చేసిన యోధుడు జగన్ అభివర్ణించారు.

డేరా బాబాకు పట్టిన గతే చంద్రబాబుకు పడుతుందన్నారు. పులివెందులలో జగన్‌ను ఓడిస్తానని ప్రగల్బాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు చెప్పేవన్నీ పచ్చి అబద్దాలన్నారు. మాట్లాడితే హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో పెట్టానని చెప్పే చంద్రబాబు, ఓటు నోటు కేసులో దొరికిపోతే, కెసిఆరే హైదరాబాద్ నుంచి తట్టా బుట్టా సర్దించి విజయవాడ పటంలో పెట్టిన విషయం చంద్రబాబు ఆలోచించుకోవాలన్నారు. చంద్రబాబుకు దమ్ము ధైర్యం ఉంటే వైసిపి నుంచి తీసుకెళ్లిన 20 ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి గెలిపించుకోవాలని సవాల్ విసిరారు.

అగ్ని ప్రమాదాలు తగ్గాయి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్నిమాపక శాఖ చేపట్టిన అవగాహన కార్యక్రమాలతో గత ఎనిమిది నెలల కాలంలో అగ్నిప్రమాదాలు తగ్గాయని రీజినల్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. విజయవాడలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఇంతవరకు విజయవాడలోనే సుమారు 100 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈస్టర్న్ రీజియన్ పరిధిలోని కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోనూ త్వరలోనే ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రమాదాల సమయంలో త్వరితగతిన స్పందించేందుకు విజయవాడలో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీమ్ సత్ఫలితాలను ఇచ్చిందన్నారు. ఇదే తరహాలో త్వరలోనే జిల్లాల వారీగా 15 మందితో టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను తయారు చేస్తున్నట్లు చెప్పారు. టాస్క్‌ఫోర్స్‌తో పాటు ప్రతి జిల్లాలో 20 మంది శాఖ సిబ్బందికి మల్టీ పర్సస్ శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయడానికి, బాధితులను ఆస్పత్రులకు తరలించడానికి అవసరమైన అన్ని సహాయాలు చేయడానికి వీరిని వినియోగించనున్నట్లు తెలిపారు.

బీమా పేరుతో కేంద్రం మోసం : కిసాన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బీమా పేరుతో రైతుల్ని కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందని కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురునాధరావు ఒక ప్రకటనలో విమర్శించారు. 2016 ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభించిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద రైతులకు ఇంత వరకు బీమా అందలేదన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంట వేయకపోతే రైతులకు 25 శాతాన్ని చెల్లిస్తారని కూడా నమ్మించి ప్రీమియం కట్టించారన్నారు. కనీసం దానిని కూడా అందించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేసే ఉద్దేశం కూడా ప్రభుత్వానికి లేదని ఆయన పేర్కొన్నారు.



‘డేరా’ హింసపై కేంద్రానికి నివేదిక పంపిన హర్యానా

ప్రభుత్వ వైఫల్యం లేదని వెల్లడి

న్యూఢిల్లీ/సిర్సా : డేరా సచ్చా సౌథా అధినేత గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌ను అత్యాచారం కేసులో శుక్రవారం కోర్టు దోషిగా ప్రకటించిన తరువాత రాష్ట్రంలో జరిగిన హింసాకాండపై హర్యానా ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపింది. రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోవడంలో ప్రభుత్వం వైఫల్యమేమీ లేదని నివేదికలో పేర్కొంది. హర్యానాలోని వివిధ ప్రాంతాల్లో చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనల్లో ఎంతమంది మరణించారు, ఎంతమందికి గాయాలయ్యాయన్న వివరాలతో పాటు, ఆస్తుల విధ్వంసం ఏ మేర జరిగిందన్న విషయంపై బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదిక పంపినట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పంపిన 20 వేల మంది పారామిలటరీ సిబ్బందిని తగిన విధంగా మోహరించంలో విఫలమైన అంశాన్ని ఈ నివేదికలో ప్రస్తావించలేదు. ఈ సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో పంచకులలో 32 మంది, సిర్సాలో ఆరుగురు మృత్యువాత పడ్డారు. దాదాపు 260 మందికి పైగా గాయాలయ్యాయి. హర్యానాతో పాటు పొరుగు రాష్ట్రాలలో పెద్దఎత్తున ఆస్తులు విధ్వంసానికి గురయ్యాయి.

సిర్సాలో కర్ఫ్యూ సడలింపు

హర్యానాలోని సిర్సా జిల్లాలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు కర్ఫ్యూ సడలించారు. గుర్మీత్ సింగ్‌ను జైలుకు తరలించిన నాటి నుంచి పరిస్థితి అదుపులోకి వచ్చిన నేపథ్యంలో మంగళవారం కర్ఫ్యూ సడలించాలని ఉన్నత స్థాయి సమావేశంలో జిల్లా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. సిర్సాలో డేరా ప్రధాన కార్యాలయం ఉంది. గుర్మీత్‌ను దోషిగా ప్రకటించడానికి ముందే ఆయన అనుచరులు పెద్ద ఎత్తున ఇక్కడకు చేరుకున్నారు. కర్ఫ్యూ సడలించిన సమయంలో ప్రజలు నిత్యావసరాలను కొనుగోలు చేసుకున్నారు. పాఠశాలలు, విద్యా సంస్థలు తెరుచుకున్నాయని సిర్సా ప్రత్యేక కమిషనర్ (సివిల్) వి.యు. ఉమాశంకర్ తెలిపారు.

నిషేధంపై నిరసన

‘ఆదివాసి విల్ నాట్ డాన్స్’ రచయితకు మద్దతు ప్రకటించిన మేధావులు, సామాజిక కార్యకర్తలు

రాంచీ : ప్రముఖ రచయిత హన్సదా సోవేంద్ర శేఖర్ రచించిన “ఆదివాసి విల్ నాట్ డాన్స్” అనే కథా సంకలనాన్ని జార్ఖండ్ ప్రభుత్వం నిషేధించడాన్ని రచయితలు, సామాజిక కార్యకర్తలు, విద్యావేత్తలు తీవ్రంగా ఖండించారు. సోవేంద్ర శేఖర్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఆదివాసి విల్‌నాట్ డాన్స్ కథలో ‘సంథాల్’ ప్రజలను ప్రత్యేకించి మహిళలను కించపరిచారని పేర్కొంటూ జార్ఖండ్ ప్రభుత్వం ఆ పుస్తకాన్ని నిషేధించింది. ఈ పుస్తకంపై పలువురు నిరసన వ్యక్తం చేశారు. రచయిత సోవేంద్ర శేఖర్ పనిచేస్తున్న పాకూర్ పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించడంతో పాటు కథా సంకలనాన్ని, ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. కథా సంకలనాన్ని నిరసిస్తున్న వారు ఆన్‌లైన్‌లో తనను వేధిస్తున్నారని రచయిత వెల్లడించారు. ఈ కథా సంకలనాన్ని జార్ఖండ్ ప్రభుత్వం నిషేధించడం అసంబద్ధమని, ఇది ఒక ప్రమాదకరమైన అనవాయితీకి దారితీస్తుందని పేర్కొంటూ దాదాపు 90 మంది రచయితలు, సామాజిక కార్యకర్తలు, మేధావులు రచయితకు మద్దతు పలికారు. ఇందులోని కథలో లైంగిక సంబంధమైన అంశాలను ప్రస్తావించడం జరిగిందని, వాటిని అమర్యాదకరమైనవిగా పేర్కొంటూ నిషేధించడం సబబు కాదని తెలిపారు. ప్రేమకు, కామసూత్రకు సంబంధించిన పుస్తకాలను నిషేధించాల్సి వస్తే, అలా నిషేధించాల్సిన నవలలు వందల, వేల సంఖ్యలో ఉన్నాయని రచయితలు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం పేర్కొన్నట్లు సంథాల్ మహిళలను అమర్యాదగా చిత్రీకరించలేదని, వాస్తవ జీవితంలోని ఒక సంఘటనను స్ఫూర్తిగా తీసుకుని రచించిన కథని పేర్కొన్నారు. సహేతుకమైన కారణం లేకుండా కథా సంకలనాన్ని నిషేధించడం సరైనది కాదని వారు పేర్కొన్నారు. సినిమాలను, సంఘటనలను, ప్రకటనలను, ట్విట్టర్‌లను, ఆహారాన్ని, సంబంధ బాంధవ్యాలను నిషేధించే విధానం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సహేతుకతలపై దాడి చేయడమేనని వారు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రకటనపై సంతకాలు చేసిన వారిలో అరుంధతి రాయ్, కవితా కృష్ణ, కవితా శ్రీవాత్సవ, కార్తిక పాండే, అజితా జార్జ్, అంకితా అగర్వాల్ ప్రముఖులు ఉన్నారు.

బిఆర్‌డిలో మళ్లీ ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

కూడా ఆక్సిజన్ కొరతే కారణమని చెబుతున్నారు. మెదడువాపు వ్యాధితో ఏడుగురు, నవజాత శిశువుల వార్డులో 15 మంది, 14 మంది చిన్నారులు వేర్వేరు వ్యాధులతో మరణించినట్లు సీనియర్ వైద్యులు తెలిపారు. తాజా విషాదం ఆసుపత్రిలోని చిన్నారుల సంక్షేమంపై యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో డొల్లతనాన్ని బయటపెట్టిందని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి తూతూమంత్రపు చర్యలు గాకుండా దీర్ఘకాలిక ఫలితాలు సాధించే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయాలని సూచించారు. ఇదే నెల మధ్యలో ఈ ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 60 మందికి పైగా చిన్నారులు మృతి చెందిన సంఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.

సస్పెన్షన్‌వేటుకు గురైన ప్రిన్సిపాల్, ఆయన భార్య అరెస్టు

ఆక్సిజన్ కొరతతో చిన్నారులు మృతి చెందిన ఘటన నేపథ్యంలో సస్పెన్షన్ వేటుకు గురైన బిఆర్‌డి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజీవ్ మిశ్రా, ఆయన భార్య పూర్ణిమ శుక్లాలు మంగళవారం అరెస్టయ్యారు. వీరిపై ఆగస్టు 12న యుపి ప్రభుత్వం కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచీ అజ్ఞాతంలోవున్న వీరిద్దరినీ కాన్పూర్‌లో గురువారం అరెస్టు చేసినట్లు ఐజి విజయ్ సింగ్ మీనా తెలిపారు. విచారణ నిమిత్తం వారిని గోరఖ్‌పూర్ తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

చైనాకు మోడీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రయాణమౌతారు. ప్రధానిగా ఎన్నికైన తరువాత ప్రధాని నరేంద్ర మోడీ తొలిసారిగా మయన్మార్‌లో పర్యటిస్తున్నారు. బ్రిక్స్ సదస్సులో డోక్లామ్ వివాదం చర్చకు వస్తుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య సమన్వయం కొరవడుతోందని ప్రపంచ దేశాలు విమర్శిస్తున్న నేపథ్యంలో రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలు డోక్లామ్ వివాదాన్ని కీలక అంశంగా పరిగణించనున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో సభ్య దేశాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం, సమన్వయం సాధించేందుకు తొమ్మిదవ బ్రిక్స్ సదస్సు కీలకంగా మారనుంది.

‘ఉదయ్’ వైఫల్యంతో
పడిపోతున్న విద్యుత్ డిమాండ్

- ఎన్డీయే హయాంలో విఫలమవుతున్న విద్యుత్ సంస్కరణలు
- దిక్కుతోచని ఆర్థిక సంస్థలు



న్యూఢిల్లీ: రెండేళ్ల క్రితం ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉదయ్ (ఉజ్వల్ డిస్కమ్ అష్యూరెన్స్ యోజన) పథకం విఫలం కావటంతో దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌కు డిమాండ్ క్రమంగా తగ్గిపోతోందని పరిశీలకులు చెబుతున్నారు. విద్యుత్ పంపిణీ రంగంలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారంగా చెబుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సంస్కరణ విద్యుత్ పరిశ్రమకు మరింత ఆదాయం తెచ్చిపెడుతుందని భావించినప్పటికీ, వివిధ రాష్ట్రాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం ఈ విధానం కేవలం తాత్కాలిక ఉపశమనమే తప్ప శాశ్వత పరిష్కారం కాదన్న విషయం వెలుగు చూస్తోంది. 2019-20 నాటికి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన పథకం ఇప్పుడు దానికి శిరోభారంగా మారిందన్న వాదన వినిపిస్తోంది. విద్యుత్ ఉత్పాదన కోసం రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు కావటంతో ఇప్పటికే ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థలతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై తిరిగి చర్చలు జరపాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యుత్ కొనుగోలుకు సంబంధించి 25 ఏళ్ల కాల పరిమితితో కుదుర్చుకున్న ఈ ఒప్పందాలను ఇప్పటి వరకూ అత్యంత ఉన్నతమైనవిగా పరిగణించారు. ఈ ఉన్నతిని పరిగణనలోకి తీసుకుని బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఆయా ప్రాజెక్టులకు ఆర్థిక సహాయాన్ని అందచేశాయి. ఇప్పుడు సౌరవిద్యుత్ గణనీయంగా అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వాలు ఈ కొనుగోలు టారిఫ్‌లను తగ్గించాలని భావిస్తున్నాయి. అనూహ్యమైన ఈ తగ్గింపుతో తమ ఆదాయానికి గండిపడుతుండటంతో ప్రాజెక్టు డెవలపర్లు తాము తీసుకున్న రుణాల చెల్లింపులో వెనుకంజ వేస్తున్నారు. దీనితో ఆయా ప్రాజెక్టులకు రుణసహాయం అందించిన ఆర్థిక సంస్థలకు దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది. ప్రస్తుతం పంపిణీ సంస్థలు కూడా పవన విద్యుత్ ఉత్పాదక సంస్థల నుండి కొత్త కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకునే ప్రక్రియకు తెరదించాయి. దీనితో దాదాపు 3 వేల మె.వా విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో నిర్మితమవుతున్న ప్రాజెక్టుల్లో తీవ్ర అనిశ్చితి కొనసాగుతోంది. గతంలో అంగీకరించిన టారిఫ్‌ల ప్రకారం ఒప్పందాలు కుదుర్చుకోవాలని కేంద్రం రాష్ట్రాలకు సూచిస్తున్నప్పటికీ దానిని పట్టించుకునే నాథుడే కన్పించటం లేదు. రాష్ట్రాల చర్యలను ఇన్వెస్టర్లు, రుణదాతలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండటంతో కేంద్రం తలపెట్టిన కాలుష్య రహిత విద్యుత్ ఉత్పాదన ప్రణాళికలు అటకెక్కే ప్రమాదం కన్పిస్తోంది. దీనితో పాటు పారిస్ ఒప్పందం ప్రకారం కాలుష్య ఉద్గారాల తగ్గింపుకు భారత్ చేసిన అంగీకారంపై కూడా ఇది తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపించనున్నది.

తగ్గిన వినియోగ సామర్థ్యం

దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బొగ్గు, లిగ్నైట్ ఆధారిత విద్యుత్ ప్లాంట్లలో ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (వినియోగ సామర్థ్యం - పిఎల్ఎఫ్) అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. ఈ సమస్య ప్రైవేటు రంగ విద్యుత్ ప్రాజెక్టుల్లో తీవ్రంగా వుండటంతో అవి తమ రుణాలు తీర్చుకునేందుకు తగిన ఆదాయాన్ని పొందలేకపోతున్నాయని పరిశీలకులు చెబుతున్నారు. ప్రభుత్వ రంగ విద్యుత్ ప్లాంట్లలో సైతం ఈ పిఎల్ఎఫ్ గణనీయంగా పడిపోయింది. దేశంలో విద్యుత్ కొరత నానాటికీ తగ్గుతుండటంపై కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష్‌గోయెల్ సంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఎన్డీయే ప్రభుత్వ హయాంలో విద్యుత్ డిమాండ్ నానాటికీ తగ్గిపోతున్న విషయాన్ని ప్లాంట్ల వినియోగ సామర్థ్యంలో నమోదవుతున్న తగ్గుదల రుజువు చేస్తోంది. దీనితో ప్రభుత్వం చేపట్టిన ఉదయ్, తదితర విద్యుత్ సంస్కరణల అమలు ప్రశ్నార్థకంగా మారుతోంది.

ఢిల్లీలో ‘తమిళ’ పంచాయితీ

ప్రజాశక్తి - చెన్నయ్ ప్రతినిధి



తమిళనాడు రాజకీయ పంచాయితీ దేశ రాజధాని ఢిల్లీకి చేరింది. రాష్ట్రంలో ఏర్పడిన సంక్షోభాన్ని గట్టెక్కించాలని అన్నాడిఎంకె ఎంపి, పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ తంబిదొరై నేతృత్వంలో అన్నాడిఎంకె రాష్ట్ర మంత్రులు కేంద్ర మంత్రులైన అరుణ్‌జైట్లీ, నిర్మలాసీతారామన్‌ను మంగళవారం కలిశారు. రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ అనిశ్చితిపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే బుధవారం అన్నాడిఎంకె కర్నాటక పార్టీ కార్యదర్శి పూగలేండి (ఎంపి) నేతృత్వంలో దినకరన్ శిబిరంలో ఉన్న ఎమ్మెల్యేలు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిందును కలవనున్నారు. అలాగే కేంద్ర మంత్రులనూ కలిసి పరిస్థితిని వివరించనున్నారు.

తమను సంప్రదించకుండా ఎలాంటి నిర్ణయాలూ తీసుకోరాదని దినకరన్ ఇప్పటికే కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. గత పది రోజులుగా మైనార్టీ ప్రభుత్వమే పాలన కొనసాగిస్తోంది. పాలన గాడి తప్పిన నేపథ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేసేలా లేదని డిఎంకె ఎంపిలు, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల నాయకుల నేతృత్వంలో రాష్ట్రపతిని ఈనెల 31న కలవనున్నారు. ప్రభుత్వం బల నిరూపణ చేసుకోవాలని పదేపదే ప్రధాన ప్రతిపక్ష నేత స్టాలిన్ వత్తిడి తెచ్చినప్పటికీ గవర్నర్ స్పందించడం లేదని ఫిర్యాదు చేయనున్నారు.

సర్దుకుపోండి : మిత్రపక్ష ఎమ్మెల్యేలు

పళనిస్వామి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్నాడిఎంకె ఉప ప్రధాన కార్యదర్శి దినకరన్ అనుచర ఎమ్మెల్యేలు 19 మంది గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. వీరితోపాటు అన్నాడిఎంకె మిత్రపక్ష ఎమ్మెల్యేలైన కరుణాస్, అన్సారీ, తనీ అరసులు గవర్నర్‌ను వేరుగా కలిసి పళనిస్వామికి వ్యతిరేకంగా లేఖలిచ్చారు. మంగళవారం ముగ్గురు ఎమ్మెల్యేలు దినకరన్ శిబిరాకి, పళనిస్వామి చెంతకు వచ్చి ‘వివాదం లేకుండా కలిసిపోండి’ అని రాజీయత్నం చేశారు.

సిక్కింలో గో వధ నిషేధం

న్యూఢిల్లీ: సిక్కిం అసెంబ్లీ సోమవారం గో వధ నిషేధం బిల్లును ఆమోదించింది. దీంతో గో వధను నిషేధించిన తొలి ఈశాన్య రాష్ట్రంగా సిక్కిం నిలిచింది. ఈ బిల్లు ప్రకారం పాలిచ్చే గోవు, వట్టిపోయిన గోవు, దూడను వధించడం నాన్-బెయిలబుల్ నేరంగా పరిగణిస్తారు. రెండు నుంచి, ఐదేళ్ల వరకూ శిక్ష విధిస్తారు. కనీసం 10 వేల రూపాయిల జరిమానా విధిస్తారు. ఇదే నేరం పునరావృతమయితే ఏడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు, 10 వేల రూపాయలకు తగ్గకుండా జరిమానా విధిస్తారు. బిజెపి భాగస్వామిగా వున్న సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎస్‌డిఎఫ్) నేతృత్వంలోని ప్రభుత్వం ఈ బిల్లును తీసుకునివచ్చింది.

గో రక్షణ కోసం గోశాలను కూడా ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిన ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, త్రిపుర, మేఘాలయ, మిజోరం, మణిపూర్, సిక్కింల్లో గోవధపై ఎలాంటి నిషేధం లేదు.

గూర్ఖా ల్యాండ్ ఏర్పాటు మా పరిధిలో లేదు

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



కోల్‌కతా : ప్రత్యేక గూర్ఖాలాండ్ అంశం తమ పరిధిలో లేదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ కొండ ప్రాంతంలో ప్రత్యేక గూర్ఖాలాండ్‌రాష్ట్రాన్ని కోరుతూ జరుగుతున్న నిరవధిక సమ్మె మంగళవారానికి 77వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలోని పలు పార్టీలకు చెందిన నాయకులను ఆమె కలుసుకున్నారు. కోల్‌కతాలో జరిగిన అఖిలపక్షం సమావేశం సందర్భంగా ప్రత్యేక గూర్ఖాలాండ్ రాష్ట్ర ఏర్పాటు అంశంపై చర్చించేందుకు నిరాకరించారు. ఉత్తర బెంగాల్ పర్వత ప్రాంతంలో జరుపుతున్న నిరవధిక సమ్మెను విరమించుకోవాలని ప్రభుత్వం వారిని కోరింది. ప్రత్యేక గూర్ఖాలాండ్‌కు చెందిన చర్చలు ప్రారంభమయ్యాయని, సానుకూలంగానే సాగనున్నాయన్నారు. అయితే గూర్ఖాలాండ్ అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లేదని పేర్కొంటూ,. అన్ని పార్టీలు గూర్ఖాలాండ్ డిమాండ్‌ను లేవనెత్తాయని, అయితే దానితో తాము ఏకీభవించడం లేదన్నారు. ప్రత్యేక గూర్ఖాలాండ్‌ను కోరుతూ ఆందోళన చేయడం వారి ప్రజాస్వామిక హక్కని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని పరిధులున్నాయని ఆమె చెప్పారు.. ఈ సమావేశంలో డార్జిలింగ్ సంక్షోభానికి ఒక పరిష్కారం లభిస్తుందని గూర్ఖా జనముక్తి మోర్చా(జిజెఎం)తో సహా పలు రాజకీయ పార్టీలు ఆశించాయి. జిజెఎం ఛీఫ్ విమల్ గౌరంగ్ ఈ సమావేశానికి గైర్హాజరు కాగా, ఐదుగురు సభ్యుల పార్టీ ప్రతినిధి బృందానికి వినయ్ తమాంగ్ నేతృత్వం వహించారు.

మహారాష్ట్రలో పట్టాలు తప్పిన ‘దురంతో’



ముంబయి: నాగపూర్ నుండి ముంబయి వెళ్తున్న దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం ఉదయం మహారాష్ట్రలోని అసోన్‌గావ్ వద్ద పట్టాలు తప్పింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టమూ జరిగినట్లు సమాచారం అందలేదని రైల్వే అధికారులు చెప్పారు. ప్రమాద స్థలికి కళ్యాణ్ నుండి సహాయక బృందం తరలి వెళ్లిందన్నారు. ‘నాగపూర్ నుండి ముంబయి వెళ్లే దురంతో ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన ఏడు బోగీలు అసన్‌గావ్-వాసింద్ స్టేషన్ల మధ్యా పట్టాలు తప్పాయని, ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టమూ జరగలేద’ని సెంట్రల్ రైల్వే ప్రజాసంబంధాల అధికారి చెప్పారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాసరఘాట్స్ మార్గంలో కొంత మేర దెబ్బతిని వుండటమే ఈ ప్రమాదానికి కారణమని భావిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ ప్రమాదం కారణంగా ఆ మార్గంలో వెళ్లాల్సిన కొన్ని రైళ్లను రద్దు చేసిన అధికారులు, మరికొన్ని రైళ్లను దారి మళ్లించారు.

గత వారం యుపిలోని అవురాయియా వద్ద కొఫియత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిన ఘటనలో 81 మంది గాయపడిన విషయం తెలిసిందే. అందుకు కొద్దిరోజుల ముందు ముజఫర్ నగర్‌లో కళింగ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిన ఘటనలో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదాలకునైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి సురేష్ ప్రభు రాజీనామాకు సిద్ధపడ్డారు.



లాలూ భార్యా, కుమారులను ప్రశ్నించిన ఐటి అధికారులు

పాట్నా : లాలూ యాదవ్ భార్య రబ్రీ దేవి, కుమారుడు తేజస్వి యాదవ్‌లను మంగళవారం ఆదాయపన్ను అధికారులు ప్రశ్నించారు. పాట్నా, ఢిల్లీ, ఇతర నగరాల్లో ఆర్‌జెడి చీఫ్ లాలూ యాదవ్ కుటుంబం పాల్పడిన అవినీతి, భూ కుంభకోణాలపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. బినామీ ఆస్తులు కలిగి వున్నారనే ఆరోపణలపై ఈ ఏడాది జూన్‌లో యాదవ్ కుటుంబంపై పన్ను అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో దోషులుగా తేలితే ఏడేళ్ళు జైలు శిక్షతో పాటుగా భారీ జరిమానా కూడా వుంటుంది. ఉదయం తేజస్విని విచారించగా మధ్యాహ్నం రబ్రీ దేవిని ప్రశ్నించారు. ఇంతకుముందు ఢిల్లీ, పాట్నాల్లోని ఫార్మ్ హౌస్‌లు, ఇతర భవనాలను ఐటి విభాగం స్వాధీనం చేసుకుంది. లాలూ రైల్వే మంత్రిగా వున్న కాలంలో కాంట్రాక్టులు తీసుకున్న సంస్థలు ఈ భవనాలను కొనుగోలు చేసి యాదవ్ కుటుంబానికి బదిలీ చేశాయని దర్యాప్తు అధికారులు తెలిపారు. బినామీ పేర్లతో లాలూ కుటుంబానికి చెందిన ఆరుగురు సభ్యులు ఆస్తులను కొనుగోలు చేసినట్లు అనుమానిస్తున్నారు.



మహారాష్ట్ర సర్కారు ఆరోపణలపై హైకోర్టు ఆగ్రహం

క్షమాపణ చెప్పిన ప్రభుత్వం

ముంబయి: ధ్వని కాలుష్య నిబంధనల విచారణలో న్యాయస్థానం వివక్ష పాటిస్తున్నదన్న మహారాష్ట్ర ప్రభుత్వ ఆరోపణలపై ముంబయి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధాన న్యాయమూర్తిని తప్పుదోవ పట్టించే విధంగా ప్రభుత్వం 155 ఏళ్ల వ్యవస్థను తన చేతుల్లోకి తీసుకుంటున్నదని ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని మందలించింది. ముంబయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మంజులా చెల్లూర్‌కు రాసిన లేఖలో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ కుంభకోని ఈ ఆరోపణలు చేశారు. దీనిపై స్పందించిన మహారాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు క్షమాపణలు చెప్పటంతో పాటు తన ఆరోపణలను ఉపసంహరించుకుంది. అంతకు ముందు ఈ కేసును ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేస్తూ ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆఫ్ వెస్టర్న్ ఇండియా కమిటీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

భారత్-చైనా నిర్ణయ్స నా స్వాగతించిన భూటాన్

న్యూఢిల్లీ : డోక్లామ్ ప్రాంతం నుంచి సైనికులను ఉపహరించుకోవాలని భారత్-చైనాలు అంగీకారానికి రావడాన్ని భూటాన్ స్వాగతించింది. భారత్, చైనాల మధ్య శాంతి సామరస్యాలు కొనసాగడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని థింపులోని విదేశాంగ మంత్రిత్వ శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ‘భారత, చైనాల మధ్య కుదిరిన ఒప్పందం భూటాన్ సరిహద్దుల్లో శాంతిని నెలకొల్పడానికి దోహదం చేస్తుందని ఆశిస్తున్నాం’ అని ప్రకటనలో పేర్కొంది. బ్రిక్స్ సమావేశానికి ఒక వారం ముందు అంటే సోమవారం డోక్లామ్‌లో ఉద్రిక్తతలకు భారత్-చైనాలు ముగింపు పలికిన సంగతి తెలిసందే.

హోస్టన్ వరదలు

అడిక్స్ డామ్‌కు బీటలు

హోస్టన్ : భారీ తుపాన్ కారణంగా హోస్టన్‌కు సమీపంలో వున్న అడిక్స్ డామ్‌కు బీటలు రావడం మొదలయింది. ఇంజనీర్లు దానిని నివారించడానికి ప్రయత్నిస్తున్నారని టెక్సాస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యామ్ కనీసమట్టం వరకూ నీరు వుందని, పరిస్థితి ప్రమాదకరంగా వున్నట్లు అధికారులు వెల్లడించారు. ఊహించని భారీ వర్షాలతో వేలాది మంది నిరాశ్రయులు కాగా, వీరిని సహాయక శిబిరాలకు తరలిస్తున్నారు. టెక్సాస్, లూసియానా ప్రాంతాలు భారీ వరద ప్రభావానికి గురైనట్లు అధికారులు తెలిపారు. వరదల కారణంగా తొమ్మిది మంది మృతి చెందగా, ఇందులో ఆరుగురు ఒకే కుటుంబానికి చెందిన వారని అధికారులు తెలిపారు.

అమెరికాతో చర్చలు రద్దు చేసుకున్న పాక్

కరాచీ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విదేశాంగ విధానం సమీక్ష ప్రసంగం తరువాత ఆ దేశంతో చర్చలను, దౌత్యపర్యటనలను పాకిస్తాన్ రద్దు చేసుకుంది. ట్రంప్ తన ప్రసంగంలో తాలిబన్లకు పాకిస్తాన్ ఆశ్రయం ఇస్తుందని ఆరోపించిన సంగతి తెలిసిందే. అమెరికాతో చర్చలు రద్దు చేసుకుంటున్నట్లు పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఖవజా అసిఫ్ సోమవారం ప్రకటించారు. ట్రంప్ ప్రసంగం తరువాత గతవారంలో తన అమెరికా పర్యటనను అసిఫ్ రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. అలాగే, వైట్‌హౌస్ దక్షిణాసియా వ్యవహారాల పరిశీలకులు లిసా కుర్టిస్, సహాయ కార్యదర్శి అలిస్ వెల్స్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం తమ పర్యటనను వాయిదా వేసుకోవాలని పాక్ అధికారులు కోరారు. ట్రంప్ ప్రసంగం తరువాత అనుసరించాల్సి వ్యూహాలను చర్చించడానికి ఈ వారంలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను నిర్వహించాలని పాకిస్తాన్ భావిస్తోంది

హిమాచల్ కాంగ్రెస్‌లో తీవ్ర విభేదాలు

- ఎన్నికల్లో పోటీకి వీరభద్ర సింగ్ విముఖత
- అధిష్టానానికి నివేదించిన సియల్‌పి

న్యూఢిల్లీ : మరి కొద్ది నెలల వ్యవధిలోనే హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్‌లో కుమ్ములాటలు తెరమీదికొచ్చాయి.హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య విబేధాలు కొత్త మలుపు తీసుకున్నాయి. ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ ఒక వర్గం కాగా, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సుఖ్‌వీందర్ సింగ్ సుఖ్ మరో వర్గంగా ఉన్నారు. ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ తాను రానున్న ఎన్నికల్లో పోటీ చేయడం లేదంటూ కాంగ్రెస్ అధిష్టానానికి తెలిపారు. దీనిపై సుఖ్ శిబిరం స్పందిస్తూ ముఖ్యమంత్రి ఒత్తిడి వ్యూహాలలో మునిగిపోతున్నారని ఆరోపించింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలలో కెప్టెన్ అమరీందర్ సింగ్ కూడా ఇదే తరహా వ్యూహాలను అనుసరించారని, ఈ ఎత్తుగడలు అధిష్టానానికి తెలుసునని పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆరుసార్లు పనిచేసిన వీరభద్ర సింగ్ గత వారం కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సిఎల్‌పి) సమావేశంలో ఎమ్మెల్యేలతో మాట్లాడుతూ తాను ఎన్నికల్లో పోటీ చేయలేనని, పార్టీని ఎన్నికల్లో ముందుకు నడిపించలేనని తన నిర్ణయాన్ని వెల్లడించారు. దీంతో ఈ విషయంలో అధిష్ఠానం జోక్యాన్ని కోరుతూ సిఎల్‌పి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. వీరభద్ర సింగ్ పార్టీని ముందుండి నడిపించక పోయినా, ఎన్నికల్లో పోటీ చేయకపోయినా తాము కూడా ఎన్నికల్లో పోటీ చేసేది లేదంటూ మెజార్టీ ఎమ్మెల్యేలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని తీర్మానం పేర్కొంది. తాను ఎన్నికల్లో పోటీ చేయనంటూ వీరభద్రసింగ్ చేసిన ప్రకటన పార్టీ సభ్యులందరికి దిగ్భ్రాంతిని, విస్మయాన్ని కలిగించిందని తెలిపింది. తన నిర్ణయాన్ని అధిష్ఠానానికి ఇప్పటికే తెలియచేశానని వీరభద్ర సింగ్ చెప్పినట్లు తీర్మానం వెల్లడించింది. అయితే పలువురు సభ్యులు పదేపదే కోరినప్పటికీ తనకు, అధిష్టానానికి మధ్య జరిగిన విషయాలను వెల్లడించేందుకు ఆయన ఇష్ట పడలేదు. ఇటువంటి పరిస్థితుల్లో అధిష్ఠానం తప్పనిసరిగా జోక్యం చేసుకోవాలని సిఎల్‌పి అభిప్రాయపడుతోంది. అత్యధిక మంది ఎమ్మెల్యేలు వీరభద్ర సింగ్ విధేయులు కావడం విశేషం.

స్వచ్ఛంద సంస్థల గొంతు నొక్కే విదేశీ విరాళాల చట్టం

- బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రఫీస్‌పై కేంద్రం నిఘా
- ఏడాది క్రితమే నోట్ సిద్ధం చేసిన హోం శాఖ
- దర్యాప్తు కూడా పూర్తి

Bloomberg Philanthropies

న్యూఢిల్లీ : భారతదేశ పొగాకు వ్యాపారాన్ని లక్ష్యంగా చేసుకుని, ఆ రంగానికి వ్యతిరేకంగా లాబీయింగ్ చేస్తున్నారంటూ స్వచ్ఛంద సంస్థ బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రఫీస్‌పై భారత ఇంటెలిజెన్స్ విభాగం గతేడాది ఒక నోట్‌ను సిద్ధం చేసింది. కోటీశ్వరుడు మైఖేల్ బ్లూమ్‌బెర్గ్ నెలకొల్పిన ఈ స్వచ్ఛంద సంస్థ పొగాకు వ్యతిరేక లాబీయింగ్ చేసే స్థానిక స్వచ్ఛంద సంస్థలకు నిధులు ఎలా సమకూరుస్తున్నదీ భారత ప్రభుత్వం దర్యాప్తు చేపట్టినట్లు ప్రభుత్వ పత్రాలు తెలియచేస్తున్నాయి. ప్రభుత్వ దర్యాప్తు పరిధిలోకి వచ్చిన తాజా విదేశీ స్వచ్ఛంద సంస్థ ఇది. ఈ దర్యాప్తు ఈ ఏడాది ఏప్రిల్ వరకు కొనసాగిందని మరో ప్రభుత్వ పత్రం తెలియచేసింది. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి నరేంద్ర మోడీ ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలపై నిఘాను కట్టుదిట్టం చేసింది. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఈ సంస్థలు పనిచేస్తున్నాయన్నది మోడీ ప్రభుత్వ వాదనగా వుంది. ఇచ్చిన విరాళాలను దుర్వినియోగం చేస్తున్నారంటూ విదేశీ నిధులతో నడిచే వేలాది ఛారిటీ సంస్థల లైసెన్సులను ప్రభుత్వం రద్దు చేసింది. భారతదేశంలో చోటు చేసుకుంటున్న సత్వర ఆర్థికాభివృద్ధి క్రమంలో సామాజిక వ్యయాల పట్ల ఈ స్వచ్ఛంద సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అటువంటి సంస్థల నోరు నొక్కడానికి ఈ విదేశీ విరాళాల చట్టాన్ని ఒక సాధనంగా ప్రభుత్వం ఉపయోగించుకుంటోందని విమర్శకులు పేర్కొంటున్నారు. భారతదేశాన్ని పొగాకు రహితంగా చేయడానికి ఉద్దేశించిన బ్లూమ్‌బెర్గ్ చొరవను, ఆ సంస్థ ఉద్దేశాన్ని, లక్ష్యాన్ని తప్పు పట్టలేమని ప్రభుత్వం సిద్ధం చేసిన మూడు పేజీల నోట్ పేర్కొంది. అయితే, పొగాకు రంగం వల్ల ఏటా సమకూరే ఆదాయాన్ని, ఆ రంగం ప్రాముఖ్యతను కూడా దృష్టిలో వుంచుకోవాలని పేర్కొంది. పొగాకు రంగం వల్ల ప్రభుత్వాలకు ఏటా దాదాపు 500 కోట్ల డాలర్లు ఆదాయం సమకూరుతుంది. లక్షలాది మంది ప్రజలకు జీవనోపాధి దొరుకుతుంది. 2016 జూన్ 3న సిద్ధమైన ఈ నోట్‌ను ‘రహస్యమైనది’గా పేర్కొంటూ, మోడీ కార్యాలయంతో పాటుగా ఉన్నత ప్రభుత్వాధికారులకు మాత్రమే పంపిణీ చేశారు. కాగా ఈ పరిణామాలపై వ్యాఖ్యానించడానికి మైఖేల్ బ్లూమ్‌బెర్గ్ ప్రతినిధి రెబెకా కేరియరో తిరస్కరించారు. ఈ దర్యాప్తు గురించి తమకేమీ తెలియదని చెప్పారు. కాగా హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి స్పందిస్తూ, భద్రతా సంస్థలకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానలివ్వబోమని చెప్పారు. మోడీ కార్యాలయం కూడా తిరస్కరించింది. గత అక్టోబరులో బ్లూమ్‌బెర్గ్ నిధులతో నడిచే భారత చారిటీ సంస్థకు విదేశీ విరాళాలు సేకరించి లైసెన్స్‌ను పునరుద్ధరించకపోవడానికి ఈ నోట్ ఒక కారణం. కాగా దీనిపై ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారి స్పందిస్తూ, పొగాకును ఆర్థిక కార్యకలాపంగా తాము పరిగణించడం లేదన్నారు. వాస్తవానికి బ్లూమ్‌బెర్గ్ ఫిలాంత్రఫీస్‌పై హోం శాఖ సిద్ధం చేసిన నోట్ గురించి తమకు తెలియదని కూడా చెప్పారు.

సరిహద్దు గోడకు నిధులపై కాంగ్రెస్ విముఖత?

వాషింగ్టన్: అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో నిర్మించాలని ప్రతిపాదిస్తున్న గోడ నిర్మాణానికి అవసరమైన నిధుల కేటాయింపుపై అమెరికన్ కాంగ్రెస్ విముఖత వ్యక్తం చేసే సూచనలే కన్పిస్తున్నాయి. ట్రంప్ తన ప్రతిపాదనపై అక్టోబర్ 1 నాటికి కాంగ్రెస్ ఆమోదముద్ర పొందాల్సి వుండగా, కాంగ్రెస్ మాత్రం ఇప్పటి వరకూ ఈ ప్రతిపాదనపై పరిశీలనే చేపట్టకపోవటం గమనార్హం. ఒక వేళ కాంగ్రెస్ ఈ ప్రతిపాదనను తిరస్కరిస్తే అధ్యక్షుడు ట్రంప్‌కు రానున్నది కష్టకాలమేనని పరిశీలకులు చెబుతున్నారు. సరిహద్దు గోడ నిర్మాణంలో విఫలమైతే తాను ప్రభుత్వాన్నే రద్దుచేస్తానని ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన విషయం తెలిసిందే. గత వారం సంభవించిన హార్వీ హరికేన్ టెక్సాస్ దక్షిణ తీర ప్రాంతాన్ని ఛిద్రం చేయటంతో ఇప్పుడు ఈ గోడ నిర్మాణం మరింత ప్రమాదకరమైన చర్యగా కన్పిస్తోంది. గత వారం ఫోనిక్స్‌లో జరిగిన ఒక ర్యాలీలో ఆయన మాట్లాడుతూ మెక్సికన్ సరిహద్దు గోడ నిర్మాణానికి నిధుల కేటాయింపులను వెంటనే ఆమోదించాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. తమ ప్రభుత్వం పడిపోయినా సరే తాము ఆ గోడ నిర్మాణాన్ని చేపట్టి తీరుతామని ఆయన హెచ్చరించారు. అప్పటి నుండి కాంగ్రెస్ సభ్యులు ఈ ప్రతిపాదనపై తీవ్రంగా మల్లగుల్లాలు పడుతున్నారు. మెక్సికన్ సరిహద్దుల్లో తాము నిర్మించే గోడ ఖర్చును మెక్సికో ప్రభుత్వమే భరించాలని ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్ డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,200 కోట్ల డాలర్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ గోడ నిర్మాణానికి మూడేళ్లకు పైగానే సమయం పడుతుందని



నిపుణులు అంచనా వేశారు. ట్రంప్ డిమాండ్‌ను మెక్సికో తిరస్కరించటంతో, తాము సొంత నిధులతోనే ఈ గోడ నిర్మాణాన్ని చేపట్టి ఆ ఖర్చును మెక్సికో ప్రభుత్వం నుండి వసూలు చేసేందుకు ప్రయత్నిస్తామని గత జనవరిలో అధికారం చేపట్టిన సమయంలో ట్రంప్ ప్రకటించారు. ఇప్పుడు ఈ వ్యయాన్ని భరించేందుకు కాంగ్రెస్ అనుమతించకపోతే ప్రభుత్వం రద్దు చేయాల్సి వుంటుంది లేదా కాంగ్రెస్ ప్రతిపాదించే ప్యాకేజి నచ్చకపోతే ట్రంప్ దానిని వీటో చేయాల్సి వుంటుంది. సొంత పార్టీ అనుమతించిన బిల్లును అధ్యక్షుడు వీటో చేస్తే అది మరింత ప్రమాదకరంగా మారుతుందని పరిశీలకులు చెబుతున్నారు. ప్రభుత్వాన్ని రద్దు చేయటం తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కున్న చందంగా వుంటుందని, దీనిని రాజకీయ దుర్మార్గంగా పేర్కొన లేమని రిపబ్లికన్ ప్రతినిధి ఛార్లీ డెంట్ ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడ్డారు. ప్రతినిధుల సభలో రిపబ్లికన్లకు మెజార్టీ వున్నప్పటికీ సెనేట్‌లో మాత్రం ఈ బిల్లు ఆమోదానికి కనీసం ఎనిమిదిమంది డెమొక్రాట్ సభ్యుల మద్దతు అవసరమవుతుంది. సరిహద్దు గోడ నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న డెమొక్రాట్ ప్రతినిధులు ఈ బిల్లుకు మద్దతు ప్రకటిస్తారన్నరా అన్నది సందేహాస్పదమే.

శాంతి స్థాపనే లక్ష్యం

- ఇజ్రాయిల్ నేతలతో ఐరాస చీఫ్ చర్చలు

న్యూయార్క్ : ఇజ్రాయిల్-పాలస్తీనా మధ్య శాంతి నెలకొనాలన్నది తన 'కల' అని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా ఇజ్రాయిల్‌లో పర్యటించిన గుటెరస్ సోమవారం ఇజ్రాయిల్ నేతలతో చర్చలు జరిపారు. రెండు దేశాల ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మాట్లాడుతూ, శాంతి స్థాపనలో ఎదురయ్యే అడ్డంకులు, ఆటంకాల గురించి, ఇజ్రాయిల్ ఆవాసాల నిర్మాణంపై వివరంగా చర్చించారు. తీవ్రవాదాన్ని పాలస్తీనా నేతలు ఖండించాల్సిన అవసరం వుందని స్పష్టం చేశారు. ఈ పవిత్ర భూమిలో శాంతి నెలకొనగా చూడాలన్నది తన కల అని ఆయన వ్యాఖ్యానించారు. రెండు దేశాలు ఏర్పడాలని, కలిసి జీవించాలని, పరస్పరం సహకరించుకోవాలని , శాంతి, భద్రతలతో జీవించాలని తాను కోరుకుంటున్నట్లు గుటెరస్ చెప్పారు. పాలస్తీనియన్ల ఆర్థిక, సామాజిక స్థితిగతులు మెరుగుపడాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఆయన ఇజ్రాయిల్ అధ్యక్షుడు రివ్లిన్‌తో సమావేశమయ్యారు. పాలస్తీనా ప్రధాని రమి హమదల్లాతో మంగళవారం చర్చలు జరిపారు.

ఈ ఏడాది చివరిలో మయన్మార్, బంగ్లాదేశ్‌ల్లో పోప్ పర్యటన

వాటికన్ సిటీ : ఈ ఏడాది చివరిలో పోప్ ఫ్రాన్సిస్ మయన్మార్, బంగ్లాదేశ్‌ల్లో పర్యటిస్తారని వాటికన్ సోమవారం ప్రకటించింది. మయన్మార్ సైన్యం, తీవ్రవాదుల మధ్య తాజాగా పోరు ప్రారంభమైన నేపథ్యంలో రోహింగ్యా ముస్లింలు తాము వున్న చోటు వదిలి పారిపోవడంపై కేథలిక్ నేత ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మయన్మార్‌లో పర్యటించాలని నిర్ణయించారు. ఈ ఏడాది నవంబరు, డిసెంబరు మొదటి వారంలో వరుసగా మయన్మార్, బంగ్లాదేశ్‌ల్లో ఆయన పర్యటించనున్నారు. నవంబరు 27 నుండి 30 వరకు మయన్మార్‌లో, 30నుండి డిసెంబరు 2 వరకు ఢాకాలో పర్యటించనున్నారు. మయన్మార్‌లో పోప్ పర్యటించడం ఇదే మొదటిసారి కాగా, 1986 తర్వాత బంగ్లాదేశ్‌లో పర్యటించడం ఇది రెండవసారి. మయన్మార్‌లోని రాఖినె రాష్ట్రంలో వివక్షత గురవుతున్న వేలాదిమంది రోహింగ్యా ముస్లింలు ఇటీవల కాలంలో బంగ్లాదేశ్ పారిపోయారు. గత కొద్దిరోజులుగా అక్కడ భీకరమైన పోరు సాగుతోంది.

అరుణగ్రహ అంతర పరిశోధనలకు సిద్ధమవుతున్న నాసా



వాషింగ్టన్: ఇప్పటి వరకూ అంగారక గ్రహ ఉపరితల పరిశోధనలకు మాత్రమే పరిమితమైన అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) ఇకపై అరుణగ్రహ అంతర పరిశోధనలకు సిద్ధమవుతోంది. వచ్చే ఏడాది ప్రయోగించనున్న ఇన్‌సైట్ మిషన్ అరుణగ్రహంపై అంతర్గత పరిశోధనలను నిర్వహిస్తుందని నాసా ఒక ప్రకటనలో వివరించింది. ఈ పరిశోధనల ద్వారా భూమితో సహా అనేక గ్రహాలు రాతి ఉపరితలంతో ఏ విధంగా ఏర్పడ్డాయన్న అంశాన్ని అర్థం చేసుకునేందుకు వీలు ఏర్పడుతుందని నాసా తన ప్రకటనలో పేర్కొంది. భూ మండలం కన్నా మూడు వందల కోట్ల సంవత్సరాల ముందే అరుణగ్రహ అంతర్భాగం ఏర్పడిందని, అందువల్ల ఇతర గ్రహాల ఆవిర్భావానికి సంబంధించిన ఆధారాలు అరుణగ్రహంలో లభ్యమయ్యే అవకాశం వుందని ఇన్‌సైట్ ప్రధాన పరిశోధకుడు బ్రూస్ బెనర్డ్‌ట్ చెప్పారు. ఇన్‌సైట్ మిషన్‌కు సంబంధించిన పరిశోధనా కేంద్రాన్ని అంగారకుడి మధ్యభాగంలో ఏర్పాటు చేస్తామని, ఇందులో విద్యుత్ ఉత్పాదన కోసం రెండు సౌరఫలకాలను అమరుస్తామని నాసా తెలిపింది. అంగారకుడి ఉపరితలంపై పరిశోధనలకు అవసరమైన పరికరాలను ఇన్‌సైట్ మిషన్ తన రోబోటిక్ ఆర్మ్ ద్వారా నిర్వహిస్తుందని నాసా వివరించింది.

ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం

ప్యాంగాంగ్/టోక్యో/మాస్కో : మంగళవారం ఉదయం ఉత్తర కొరియా ఖండాంతర క్షిపణి హసంగ్-12ని ప్రయోగించింది. 3వేల మైళ్ళ దూరం ప్రయాణించగల సామర్ధ్యమున్న ఈ మధ్యంతర శ్రేణి క్షిపణి ఉత్తర జపాన్ దీవి అయిన హొక్కైడో మీదుగా ప్రయాణించింది. ఈ చర్యను జపాన్ తీవ్ర కవ్వింపు చర్యగా పరిగణించింది. అమెరికా భూభాగమైన గుయామ్‌ను సులభంగా చేరుకోగల ఈ క్షిపణి తూర్పు దిశగా జపాన్ దీవి అయిన హొక్కైడో మీదుగా 733 మైళ్ళ దూరం ప్రయాణించి పసిఫిక్ సముద్రంలో పడింది. కాగా, ఉత్తర కొరియా చర్య పట్ల జపాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "మా దేశం మీదుగా ప్రయాణించేలా క్షిపణిని ప్రయోగించడం బాధ్యతారహితమైన చర్య. దీన్ని తీవ్రమైన ముప్పుగా పరిగణిస్తున్నాం" అని అత్యవసరంగా జాతీయ భద్రతా మండలి సమావేశం నిర్వహించిన అనంతరం జపాన్ ప్రధాని షింజో అబె వ్యాఖ్యానించారు. ప్రాంతీయ భద్రతకు ఇది తీవ్రమైన ముప్పు అని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన చర్యలన్నీ తీసుకోవడానికి సిద్ధంగా వున్నామని ఆ సమావేశానికి ముందు అబె వ్యాఖ్యానించారు. వివరాలను సేకరించి, విశ్లేషించి, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షిపణి ప్రయోగం జరిగిన వెంటనే జపాన్‌లోని అత్యంత ఆధునికమైన క్షిపణి ప్రతిస్పందన వ్యవస్థ రంగంలోకి



దిగింది. సెల్‌ఫోన్ల ద్వారా, లౌడ్ స్పీకర్ల ద్వారా అత్యవసర హెచ్చరికలు చేసింది. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం ఆరు గంటలు దాటిన వెంటనే ఈ ముప్పు గురించి హెచ్చరిస్తూ రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలకు సూచించింది. కాగా, తాజా చర్యపై అమెరికా వెంటనే స్పందించలేదు. ఇది ఆందోళన కలిగించే చర్యగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 'ఇది మరింత ప్రమాదకరమైన పరీక్ష" అని కిస్సింగర్ ఇనిస్టిట్యూట్ లో ఆసియా వ్యవహారాల డైరెక్టర్ అబ్రహం డెన్మార్క్ వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియా ఇటీవల నిర్వహించిన క్షిపణి పరీక్షల్లో క్షిపణులన్నీ కూడా కొరియా ద్వీపకల్పం, జపాన్ మధ్య గల సముద్రంలో పడేలానే జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ తాజా క్షిపణి మాత్రం జపాన్ మీదుగా ప్రయాణించడం అందరినీ కలవరపరిచింది. ఉత్తర కొరియా ఉద్దేశ్యపూర్వకంగా ఈ చర్య తీసుకోకపోయినా ఇది జపాన్‌పై దాడిగానే పరిగణించాల్సి వస్తుందని డెన్మార్క్ వ్యాఖ్యానించారు.

ప్యాంగాంగ్‌కు ఉత్తరంగా గల సునాన్ ప్రాంతం నుండి జపాన్ కాలమానం ప్రకారం ఉదయం 5.58గంటలకు క్షిపణిని ప్రయోగించారు. ప్రయాణ సమయంలో క్షిపణి మూడు ముక్కలై సముద్రంలో పడిపోయింది. రోడ్ మొబైల్ లాంచర్ అంటే మార్పులు చేర్పులు చేసిన ట్రక్కు నుండి దీన్ని ప్రయోగించినట్లు తెలుస్తోంది. తక్కువ కాల వ్యవధిలో ప్రయోగ స్థలానికి తీసుకెళ్లడానికి ఈ ట్రక్కు ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో 1998, 2009ల్లో కూడా ఉత్తర కొరియా, జపాన్ మీదుగా క్షిపణులను ప్రయోగించింది. అయితే అప్పుడు నోటీసు ఇచ్చింది. ఈసారి ప్రయోగానికి ముందుగా ఎలాంటి నోటీసులివ్వలేదు. తమ దేశంపైకి వచ్చే క్షిపణులను కూల్చివేయడానికి సిద్ధంగా పేట్రియాట్ క్షిపణులను జపాన్ సిద్ధం చేసింది. అయితే క్షిపణి విధ్వంసక వ్యవస్థలను జపాన్ ఉపయోగించలేదని జపాన్ ప్రభుత్వ వార్తా సంస్థ ఎన్‌హెచ్‌కె తెలిపింది.

రష్యా తీవ్ర ఆందోళన

కొరియా ద్వీపకల్పంలో నెలకొన్న పరిస్థితిపై రష్యా తీవ్రం ఆందోళన వెలిబుచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను సమీక్షిస్తున్నామని రష్యా డిప్యూటీ విదేశాంగ మంత్రి సెర్గి రైబకోవ్ వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియా ఈ చర్యకు పాల్పడడానికి ఈ నెల 21నుండి దక్షిణకొరియా, అమెరికా మధ్య జరుగుతున్న సంయుక్త సైనిక విన్యాసాలు కారణమని రైబకోవ్ పేర్కొన్నారు.

హార్వీ దెబ్బకు మూతపడిన జాన్సన్ స్పేస్ సెంటర్



హోస్టన్: గత వారం అమెరికాను కుదిపేసిన హార్వీ హరికేన్ దెబ్బకు హోస్టన్‌లోని నాసా అంతరిక్ష పరిశోధనా కేంద్రం (జెఎస్‌సి) మూతపడింది. గత వారాంతంలో కురిసిన కుండపోత వానలకు హోస్టన్‌లో సంభవించిన వరదనీరు జెఎస్‌సి గేట్లను ముంచెత్తింది. ఈ కేంద్రంలో దాదాపు 10 వేల మందికి పైగా శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ఇతర సిబ్బంది, కాంట్రాక్టర్లు, రోదసిలోని అంతర్జాతీయ స్పేస్ స్టేషన్ నియంత్రించే అధికారులు వుంటారు. ఇప్పుడు ఈ కేంద్రం మూతపడటంతో వీరంతా విధి నిర్వహణకు హాజరయ్యేందుకు వీలు పడటం లేదు. కేంద్రం పరిసర ప్రాంతాలలో మోకాటి లోతు నీరు వుందని, కేంద్రం ఆవరణ నుండి భద్రతా సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జెఎస్‌సి ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ కార్యాలయం ట్విట్టర్‌లో సూచించింది. ఏదైనా అవసరమైతే తమకు కాల్ చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు రావద్దని మరో ట్వీట్‌లో హెచ్చరించారు. ఆదివారం నాడు దాదాపు 20 అంగుళాల మేర వాన కురిసినట్లు జెఎస్‌సిలోని స్పేస్‌ఫ్లైట్ మెటీరియాలజీ గ్రూప్ వెల్లడించింది. హోస్టన్ నగర శివార్లలో దాదాపు 1,700 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి వున్న ఈ కేంద్రం ఇప్పుడు వరదతో పోటెత్తిన సరస్సును తలపిస్తోందని స్థానికులు చెబుతున్నారు.

ఆంక్షలు వల్ల ప్రయోజనం లేదు

అమెరికా చర్యపై చైనా వ్యాఖ్య

బీజింగ్ : వెనిజులాపై ఆంక్షలు విధించడ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని చైనా పేర్కొంది. బయటి నుండి జోక్యం చేసుకోవడం, ఏకపక్షంగా ఆంక్షలు విధించడం వల్ల పరిస్థితులు మరింత సంక్లిష్టంగా తయారవుతాయే తప్ప సమస్యలు పరిష్కారం కావని చరిత్ర తెలుపుతోందని చైనా సోమవారం పేర్కొంది. వెనిజులాపై అమెరికా కొత్తగా ఆంక్షలు విధించిన నేపథ్యంలో చైనా స్పందించింది. వెనిజులా ప్రభుత్వం నుండి లేదా ప్రభుత్వ చమురు సంస్థ నుండి ఎలాంటి లావాదేవీలను నడపడాన్ని నిషేధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం డిక్రీపై సంతకాలు చేశారు. కాగా వెనిజులాపై అమెరికా ఆర్థిక యుద్ధానికి పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వెనిజులా అధ్యక్షుడు మదురో కొత్త డిక్రీపై స్పందిస్తూ, వెనిజులా ప్రభుత్వాన్ని కూల్చివేయాలని అమెరికా యత్నిస్తోందని, కానీ వారి ప్రయత్నాలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. కాగా ఈ పరిణామంపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి హువా చునియాంగ్ స్పందిస్తూ, దేశాల సార్వభౌమాధికారాన్ని, స్వాతంత్ర్యాన్ని గౌరవించాలన్నది చైనా వైఖరి అని స్పష్టం చేశారు. ఇతరుల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం కూడదన్నది తమ నిర్ణయమని చెప్పారు. వెనిజులాలో ప్రస్తుతం నెలకొన్న సమస్యను ఆ ప్రభుత్వం, ప్రజలే పరిష్కరించుకోవాలని ఒక పత్రికా సమావేశంలో చెప్పారు.

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ ఉన్న కూటమిలో సిపిఎం చేరదు : ఏచూరి

సంస్కృతి పరిరక్షణ అంశాన్ని మహా కూటమితో ముడిపెట్టవద్దని ఏచూరి సూచించారు. ఉమ్మడి సంస్కృతి పరిరక్షణకు చేపట్టిన ఉద్యమానికి, ఎన్నికల పొత్తులు, సర్దుబాట్లకు ఎటువంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఉమ్మడి సంస్కృతి పరిరక్షణ అన్నది విస్తృతమైన అంశమన్నారు. కాంగ్రెస్‌తో ఎటువంటి పొత్తు లేదా అవగాహన కుదుర్చుకోరాదన్నది తమ పార్టీ విధానమని, ఇందులో ఎటువంటి సందిగ్ధతకు తావులేదని ఆయన అన్నారు. మహాకూటమికి సంబంధించిన సభలు, సమావేశాలకు తాము హాజరు కాబోమని, అయితే ఉమ్మడి సంస్కృతి పరిరక్షణకు సంబంధించిన సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతామని ఏచూరి వివరించారు.

మున్సిపల్ సమ్మె నగారా

నారాయణను జెఎసి నాయకులు కలిసి సమ్మె నోటీస్‌ను అందజేశారు. మున్సిపల్ శాఖలో విడుదల చేసిన జీవో 279, టెండర్లు రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ జీతాలు చెల్లించాలని, విజయవాడ, విశాఖ నగరాలకు 010 పద్దు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి-సమాన వేతనం అమలు చేయాలని, 151 జీవో ప్రకారం ఎరియర్స్‌తో సహా జీతాలు చెల్లించాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల్ని పర్మినెంట్ చేయాలన్నారు. సమ్మె కారణంగా జరిగే పరిణామాలకు రాష్ట్రప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమ్మె నోటిస్‌ను మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్ కరికాలవలవన్, డిఎంఎ కె కన్నబాబులకు కూడా నాయకులు అందజేశారు. జెఎసి నాయకులు కె ఉమామహేశ్వరరావు, ఎ రంగనాయకులు, ఇ మధుబాబు, ఎన్ శంకరరావు, సుమన్, రాందాస్, రమేష్ తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

ముంబయి జలమయం

ఎత్తున నీరు ప్రవహిస్తూ వరద పరిస్థితిని తలపించింది. గణేశ్ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నుంచి పలు పాఠశాలలకు సెలవలు ప్రకటించారు. బుధవారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. ఉర్దూ మీడియంతో సహా కొన్ని పాఠశాలలను నేడు తెరిచినప్పటికీ, భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా సిబ్బంది హాజరు కాలేకపోయారు. ముంబయి నగరానికి అనుసంధానంగా ఉన్న పలు జాతీయ రహదారులు జలమయమయ్యాయి. కొన్ని హౌసింగ్ కాంప్లెక్స్‌లు కూడా నీటితో నిండిపోయాయి. రైల్వే స్టేషన్లకు, విమానాశ్రయాలకు అనుసంధానం తెగిపోయింది.

తెలుగు అభివృద్ధికి 7 అకాడమీలు

విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన మాట్లాడారు. తమ పార్టీ పేరులోనే తెలుగుందని, తెలుగు భాషను కాపాడేందుకు ప్రభుత్వం ముందుంటుందని హామీ ఇచ్చారు. గిడుగు రామ్మూర్తిని ఆదర్శంగా తీసుకుని భాషను ఏ విధంగా కాపాడుకోవాలో ఆలోచించాలన్నారు. తెలుగు భాష ప్రపంచంలో మన ఉనికిని గుర్తించేందుకు తోడ్పడుతుందన్నారు. రామ్మూర్తి తెలుగు భాషాభివృద్ధికి నిరంతరం కృషి చేసి, జీవితాంతం భాష కోసం పోరాడారని గుర్తు చేశారు. భాషను మరచిపోతే కన్నతల్లిని మరచిపోయినట్లేనన్నారు. అమరావతిలో ప్రాచీన భాషా కేంద్రం ఏర్పాటు చేసేందుకు కేంద్రానికి విన్నవించామని, దాని ఏర్పాటుకు కూడా కృషి చేస్తామని తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో కొత్తగా నిర్వహించనున్న ఆనంద లహరి కార్యక్రమాల్లో తెలుగు భాషపై క్విజ్, వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కళలను, సంస్కృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆనంతరం భాషా పండితులను సన్మానించారు.

సాంస్కృతి శాఖ సవాలే : మంత్రి అఖిలప్రియ

భాషా, సాంస్కృతిక శాఖకు మంత్రిగా పనిచేయడం సవాలుగా ఉందని పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖా మంత్రి భూమా అఖిల ప్రియ పేర్కొన్నారు. రాష్ట్ర విభజనకు ముందు రచయితలు రాసిన తెలుగు రచనలో తెలంగాణలోనే ఉన్నాయని, వాటిని రాష్ట్రానికి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని సిఎంను కోరారు. ఇంటర్‌నెట్ ద్వారా ప్రజలకు కావాల్సిన సమాచారాన్ని తెలుగులో పొందేందుకు చర్యలు చేపట్టాలని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. తెలుగు భాషాభివృద్ధికి తన వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, సాంస్కృతిక శాఖ సిఇఒ డి విజయ భాస్కర్, కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, తెగులు భాషావేత్త కుటుంబరావు, కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, కలెక్టర్ బి లక్ష్మీకాంతం, విజయవాడ మేయర్ కోనేరు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల విజయం స్ఫూర్తి కావాలి

మంత్రులతో సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల విజయం భవిష్యత్తులో స్ఫూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంత్రులు భూమా అఖిలప్రియ, ఆదినారాయణ రెడ్డి, అమర్‌నాథరెడ్డి, కాల్వ శ్రీనివాసులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూమా బ్రహ్మానందరెడ్డి, వరదాపురం సూరి, గంగుల ప్రతాప్‌రెడ్డి తదితరులు మంగళవారం సాయంత్రం సచివాలయంలో సిఎంను కలిశారు. నంద్యాల అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికలో టిడిపి భారీ మెజార్టీతో గెలుపొందిన సంగతి తెలిసిందే. గెలుపుకోసం కృషిచేసిన వారిని అభినందించిన సిఎం ఈ సందర్భంగా మాట్లాడుతూ నంద్యాలలో మంత్రులు పార్టీని గెలిపించడం ప్రశంసనీయమన్నారు. కలసికట్టుగా పనిచేస్తే విజయం సులభమవుతుందన్నారు. రాబోయే అన్ని ఎన్నికల్లోనూ ఇదేవిధంగా కృషి చేయాలన్నారు.

నంద్యాలను అభివృద్ధి చేస్తాం : మంత్రి అఖిలప్రియ

నంద్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి అఖిలప్రియ అన్నారు. సిఎం



చంద్రబాబును సచివాలయంలో మంగళవారం కలిసిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నాగిరెడ్డి కోరుకున్న అభివద్ధి భవిష్యత్‌లో నంద్యాలలో కనిపిస్తుందన్నారు. అమ్మనాన్నలు లేకుండా సాధించిన ఈ విజయం వారిని ప్రతిక్షణం గుర్తు చేస్తుందన్నారు. భూమా నాగిరెడ్డి హామీలను తప్పకుండా నెరవేర్చుతామన్నారు. బ్రహ్మానందరెడ్డి గెలుపు సీమ రాజకీయాల్లో మార్పు తెస్తుందన్నారు. రాజకీయాల్లో తన సోదరుడు బ్రహ్మానందరెడ్డి తోడుగా నిలిచారని, అమ్మానాన్నల్లేని మమ్మల్ని ప్రజలు ఆదరించారని అఖిలప్రియ భావోద్వేగానికి లోనయ్యారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని, కనీస వేతనం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కె సునీతకు యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు జైనీ వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ లక్ష్యానికి విరుద్ధంగా మూడు కేంద్రాలను విలీనం చేయాలని తీసుకొచ్చిన మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అమృత హస్తం అమలుకు మూడు నెలల బిల్లుల్ని అడ్వాన్సుగా ఇవ్వాలని కోరారు. పెండింగ్ వేతనాలు, బిల్లులు, అద్దెలు, యూనిఫాంలు వెంటనే ఇవ్వాలన్నారు. మినీ సెంటర్లకు హెల్పర్లను కేటాయించాలని, కేంద్రం పెంచిన అరియర్స్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. సామాజిక భద్రతా సౌకర్యాలైన పెన్షన్, పిఎఫ్, ఇఎస్‌ఐ, గ్రాట్యూటీ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. పెన్షనతో కూడిన రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, వర్కర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కు రూ.1లక్ష గ్రాట్యూటీని పెంచాలని కోరారు. వేతన బకాయిలు, సెంటర్ అద్దెలు వెంటనే విడుదల చేస్తామని, అంగన్‌వాడీ ఖాళీలను భర్తీ చేస్తామని యూనియన్ నేతలకు ముఖ్యకార్యదర్శి సునీత హామీనిచ్చారు.

తరలించండి : సిఎం ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శ్రీకాకుళం జిల్లా లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలను అక్కడకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితిపై సిఎం మంగళవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సిఎం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశాలో గత రెండు రోజులుగా కురిసిన వర్షాల ప్రభావంతో నాగావళి, తోటపల్లి, వంశధారకు భారీగా వరద నీరు వచ్చి చేరిందని, దీంతో శ్రీకాకుళం జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని తెలిపారు. అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి తక్షణమే సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జలవనరులు, వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి పంటలకు ఎలాంటి నష్టం చేకూరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రకృతి విపత్తుల నిర్వహణ బృందాలను కూడా సహాయక చర్యల్లో భాగస్తులను చేయాలని ఆదేశించారు.

రవాణా రంగ సమస్యల్ని పరిష్కరించండి

కమిషనర్‌కు లారీ ఓనర్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రవాణా రంగ సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు రవాణా శాఖ కమిషనర్ బాలసుబ్రమణ్యంకు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. చలానా ఫీజులు, పెనాల్టీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి నాలుగు నెలలైనా తగ్గించలేదని, రూ.100 ఉన్న చలానాను రూ.3వేలకు పెంచారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు భద్రతకు ఉపయోగపడని స్పీడ్ గవర్నర్ల ఏర్పాటు వల్ల లారీ యజమానులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డీజిల్ రేటు పొరుగు రాష్ట్రాల కన్నా ఎక్కువగా ఉన్నందు వల్ల లారీ యజమానులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా లేబర్ వెల్ఫేర్ ఫండ్‌ను వసూలు చేస్తున్నా, మళ్లీ లేబరు లైసెన్సులు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులు లారీ యజమానుల్ని వేధిస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. జిఎస్టీ వల్ల ఏదో ఒక కారణంతో వాణిజ్య పన్నుల శాఖ అధికారుల వేధింపులెక్కువయ్యాయని తెలిపారు.

సిఎంను కలిసిన ఏపిఎన్జీవో నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించినందుకు ఏపిఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.అశోక్‌బాబు నేతృత్వంలో పలువురు నాయకులు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన నివాసంలో కలసి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కారుణ్య నియామకాల్లో ఇంటర్మీడియేట్ విద్యార్హతను కల్పించడం, కారుణ్య నియామకం అవసరం లేని వారికి ఎక్స్‌గ్రేషియాను పెంచడంతో వంటి ప్రభుత్వ నిర్ణయాల పట్ల సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 12న విజయవాడలో జరిగే ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరుకావాలని ఆ సంఘం నేతలు ఆహ్వానించారని అశోక్‌బాబు ముఖ్యమంత్రికి తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

కార్మిక చట్టాలు బేఖాతర్

వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్‌లో పెద్దఎత్తున్న కార్మికులు పోరాడుతున్నారని చెప్పారు. భవన నిర్మాణ మెటీరియల్ ధరలు పెరగడంతో పాటు, రాష్ట్రంలో ఇసుక, మైనింగ్ మాఫియాలు ఎక్కువయ్యాయన్నారు. ఇందువల్ల కార్మికులకు ఉపాధి లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన కోర్కెలపై ఢిల్లీలో నవంబర్ 9 నుంచి 11వరకు కార్మిక మహాప్రదర్శనకు దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులను సమీకరించాలని పిలుపునిచ్చారు. సిడబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షులు సింగారవేలు అధ్యక్షోపన్యాసం చేస్తూ 2008లో ప్రారంభమైన ఆర్థిక సంక్షోభం ఇంకా కొనసాగుతూనే ఉందన్నారు. మూడేళ్ల బిజెపి పాలనలో సామాన్యుల జీవితం దుర్భరంగా మారిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని నరేంద్రమోడీ ఎన్నికల్లో హామీ ఇచ్చి, మూడేళ్ల వ్యవధిలో కేవలం 2.31 లక్షల మందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. రైల్వేస్, పోర్టులు, డిఫెన్స్ రంగాల్లో వంద శాతం ఎఫ్‌డిఐలను అనుమతించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. గో రక్షక దళాల పేరిట సంఘ్ పరివార్ వారు ప్రజలను చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్మాణ రంగంపై జిఎస్టీ తీవ్ర ప్రభావం చూపిందని తెలిపారు. ఢిల్లీలో జరిగే మహాప్రదర్శనకు సిద్ధం కావాలని కోరారు. సిడబ్ల్యుఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి కార్యవర్గ నివేదికను ప్రవేశపెట్టారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాల్లో వివిధ రాష్ట్రాల నుంచి పాల్గొన్న ప్రతినిధులు భవన నిర్మాణ కార్మికుల సమస్యలు, వారి పథకాలపై చర్చిస్తారు.

ప్రాజెక్టుల పడక

ఉంది. 2014లో ఎన్‌హెచ్‌ఎఐ భూసేకరణ పూర్తి చేసి కాంట్రాక్టు సంస్థకు అపాయింటెడ్ డేట్ ఇచ్చింది. నిబంధనల ప్రకారం 2017 ఫిబ్రవరి 28 నాటికి పనులు పూర్తి చేయాలి. కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతో అసలు పనులే ప్రారంభం కాలేదు. నగరంలో ప్రజా రవాణా వ్యవస్థ ఆధునీకరణలో భాగంగా మెట్రో ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించి మూడేళ్లవుతోంది. డిపిఆర్, కన్సల్టెన్సీ సంస్థ ఒప్పందాలు పూర్తి చేసింది. కన్సల్టెన్సీ సంస్థ టెండర్ల ఖరారులో జాప్యం చేసిందని చెబుతూ రూ.7,212 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును పక్కనపెట్టింది. తాజాగా లైట్‌మెట్రో ప్రాజెక్టుకు సమగ్ర నివేదిక (డిపిఆర్) రూపొందించేందుకు జర్మనీ అంతర్జాతీయ రుణ సంస్థ కెఎఫ్‌డబ్ల్యు సహకారం తో గ్లోబల్ టెండర్లు ఆహ్వానించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. అయితే కేంద్ర ప్రభుత్వ తాజా ప్రణాళిక నేపథ్యంలో లైట్ మెట్రో ప్రాజెక్టు అసలు పట్టా లెక్కుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. విజయవాడ గృహ నిర్మాణ ప్రాజెక్టుకు విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వద్ద 2015లో ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 10 వేల గృహాల నిర్మాణానికి ప్రణాళికలనూ సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకం శిథిలావస్థకు చేరినా గృహ నిర్మాణాలు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదు.

2013 చట్టం ప్రకారం పునరావాసం

కమిషనర్‌కు ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల కింద నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షులు మిడియం బాబూరావు, పిడిఎఫ్ ఎమ్మెల్సీ వి బాలసుబ్రహ్మణ్యం మంగళవారం ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పోలవరం, వంశధార, తోటపల్లి, వెలుగొండ, పెద్దగెడ్డ, పులిచింతల ప్రాజెక్టులలో పునరావాస, పున:ఉపాధి కార్యక్రమాలు చురుగ్గా సాగడం లేదని తెలిపారు. 2013 చట్టం ప్రకారం పునరావాసం పూర్తయ్యాకే ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. పోలవరం ప్రాజెక్టులో భూసేకరణకు ప్రాంతానికొక్క రేటు ఇస్తున్నారని, అలా కాకుండా ఒకే రేటు ఇప్పించాలని కోరారు. విజయనగరం జిల్లా తారకరామా ప్రాజెక్టులో భూమి కోల్పోయిన సారిపల్లి, కుదిపి గ్రామాల్ని ముంపు గ్రామాలుగా ప్రకటించి ఆర్‌అండ్ ఆర్ అమలు చేయాల న్నారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల్లో 18 ఏళ్లు నిండిన యువతీయువకులకు ప్యాకేజ్ ఇవ్వలేదని తెలిపారు. వంశధార నిర్వాసితులపై పెట్టిన కేసుల్ని ఉపసంహ రించాలని కోరారు. పెద్దగెడ్డ పునరావాసంలో భాగంగా బంగారుగుడ్డి, పాచిపెంట రోడ్డు నిర్మాణం పూర్తికాలేదని తెలిపారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘం ఉపాధ్యక్షులు ఎం కృష్ణమూర్తి, ఎ రవి(పోలవరం), జి సింహాచలం(వంశధార), వెంకట్రామిరెడ్డి(వెలిగొండ),వై నాగేంద్ర, జి వెంకట్రావు(పోలవరం) తదితరులున్నారు.

ఆ స్టోరీ లైన్ కూడా వినలేదు తెలుసా!



రకుల్ ప్రీత్ సింగ్

చిత్రసీమలో ఎవరైనా సక్సెస్ కోసమే తపిస్తారు. విజయం వస్తేనే మరో చిత్రంలో చేసే అవకాశాలు వస్తాయి. అందరికీ తెలిసిన విషయమే. కానీ కొందరు సక్సెస్ అనే మాటను పక్కన పెట్టి ఏదైనా డైరెక్టర్, హీరో సినిమాల్లో చేయాలనుకున్నప్పుడు అవేవీ పట్టించుకోకుండానే వారి చిత్రాల్లో చేసేందుకు గ్రీన్‌స్నిగల్ ఇచ్చేస్తుంటారు...అదేలా? అంటే...ఇలాగే.. తెలుగు చిత్రసీమలో ఫుల్ క్రేజ్ ఉన్న హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్. ఈమెకు అవకాశాలకు కొదవ లేదు. రకుల్‌కు ఎప్పటి నుంచో మహేష్ బాబు సినిమాలో చేయాలనే కోరిక బలంగా ఉంది. 'బ్రహ్మోత్సవం' సినిమాలో చేసే ఛాన్స్ వచ్చినట్టు వచ్చి చేజారిపోయింది. అప్పట్లో 'ధ్రువ' సినిమా బిజీ షెడ్యూల్ ఉండడంతో చేయడం కుదరలేదు. ఇటువంటి అవకాశం మరోసారి వస్తే వదలకూడదని నిశ్చయించుకుంది. తమిళ్‌లో దర్శకుడు మురుగదాస్ అన్నా ఆమెకు చాలా అభిమానం. ఓ రోజు మురుగదాస్ ఓ సినిమా కథతో తన వద్దకు వచ్చాడట. 'మహేష్‌తో సినిమా చేస్తున్నాం..హీరోయిన్‌గా మిమ్మల్ని అనుకున్నాం' అని చెప్పిన వెంటనే 'నేను ఆ సినిమా చేస్తున్నాను' అని ఠక్కున అనేసిందట. ఆ సినిమా కథేంటో కూడా వినలేదట. ఆ చిత్రమే 'స్పైడర్'. ఆ విషయాన్ని రకుల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "మురుగదాస్ గారు నా దగ్గరకొచ్చి మహేష్‌తో ఓ సినిమా చేస్తున్నాం. మిమ్మల్ని చేయమని అడగడానికి వచ్చాం అని అనగానే వెంటనే నేను చేస్తున్నా అనేశా. కనీసం ఆ సినిమా కథకానీ, కనీసం లైనేంటో కూడా వినలేదు తెలుసా?' అని చెప్పింది. ఆ టైమ్‌లో మహేష్ బాబుతో సినిమా చేయాలన్న ఆలోచనలో వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని అలా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందట రకుల్. 'స్పైడర్' చిత్రం సెప్టెంబర్ 27వ తేదీన విడుదల కానుంది.



శర్వానంద్

మాఫియా డాన్

శర్వానంద్ అంటే విభిన్న కథలు ఎంపిక చేసుకునే యువ కథానాయకుల్లో ఒకరుగా పేరుంది. మొన్న 'రాధ' చిత్రంలో పోలీస్‌గా మాస్ గెటప్‌లో మెప్పించాడు. ఇప్పుడు ఒసీడీతో బాధపడుతున్న వ్యక్తిగా 'మహానుభావుడు'లో చేస్తున్నాడు. ఇందులో క్లాస్ గెటప్‌లో అలరించబోతున్నాడు. ఈ చిత్రం తర్వాత శర్వానంద్ సుధీర్ వర్మ దర్శకత్వంలో మరో సినిమా చేయబోతున్నాడు. ఇందులో మాత్రం డిఫరెంట్‌గా మాఫియా డాన్ పాత్ర చేస్తున్నట్టు తెలిసింది. కమల్‌హాసన్ నటించిన 'నాయకుడు' చిత్రం నేపథ్యంలో ఈ సినిమాని తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు.

'రాజుగారి గది 2'లో నాగార్జున



'రాజుగారి గది'లో మెంటలిస్ట్

తనకు ఎదురుగా ఉన్న వాళ్ల మనసులో ఏముందో చెప్పే వ్యక్తిని మెంటలిస్ట్ అంటారు. ఈ వ్యక్తితో ఐదు నిమిషాలు మాట్లాడితే చాలు అవతలి వారు ఏమనుకుంటున్నారో ఇట్టే చెప్పేస్తాడు. అటువంటి పాత్ర చేస్తున్నాడు నాగార్జున. ఆ చిత్రమే 'రాజుగాది గది 2' మంగళవారం నాగ్ పుట్టిన రోజు సందర్భంగా ఆ చిత్రం ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఫస్ట్‌లుక్‌లో నాగ్ చేతిలో రుద్రాక్షమాలను పట్టుకుని, చాలా యంగ్‌గా కనిపించారు. ఓంకార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సమంత, సీరత్‌కపూర్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పీవీపీ సినిమా పతాకంపై ప్రసాద్ వి. పొట్లూరి నిర్మిస్తున్నారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. త్వరలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

ఈ ఫస్ట్‌లుక్‌ను సమంత కూడా తన ట్విట్టర్ ఖాతా నుంచి పోస్టు చేస్తూ.. 'ఆయన రాజే ఎందుకంటే.. తనను తాను ఎలా మలుచుకోవాలో ఆయనకు తెలుసు. సంవత్సరాలు గడుస్తున్నా నా మామ గొప్పగా తయారవుతున్నారు' అని ట్వీట్ చేసింది. దీనికి నాగ్ ప్రతిస్పందించారు. 'ధన్యవాదాలు ప్రియమైన కోడల.. యు ఆర్ ది బెస్ట్' అని ట్వీట్ చేశారు.

దెయ్యం ఫోన్లో భయపెడుతుంది



దివ్య, కిరణ్

సి.వి.ఫిలింస్ పతాకంపై కిరణ్, దివ్య జంటగా నటిస్తున్న చిత్రం 'మళ్లీ వచ్చిందా'. కె.నరేంద్రబాబు దర్శకుడు. వెంకటేశ. సి నిర్మాత. చిత్రీకరణ, నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. మంగళవారం ఫిల్మ్ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసన్నకుమార్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలకు ఎప్పుడూ క్రేజ్ ఉంది. ఈ మధ్యకాలంలో కూడా 'గంగా', 'రాజుగారి గది', 'ఆనందో బ్రహ్మ' చిత్రాలను ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇది కూడా ఆ తరహా కథే. తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతుంది' అని అన్నారు.

దర్శకుడు నరేంద్రబాబు మాట్లాడుతూ 'దెయ్యానికి రాత్రీపగలు అని ఏమీ ఉండదు. మనిషి నుంచి మనిషికి వెళ్లగలదు. ఇప్పటి వరకూ ఇలాంటి కథలు చాలా చూశాం. ఓ దెయ్యం ఫోన్ చేసి కూడా మనుషుల్ని భయపెట్టగలదని తెలిపే సినిమా ఇది. ఆద్యంతం ఉత్కంఠగా సాగుతుంది. కథ వినగానే నిర్మాతలకు నచ్చి షూటింగ్ మొదలుపెట్టారు. హైదరాబాద్, బెంగుళూరు, మున్నార్ వంటి ప్రాంతాల్లో చిత్రీకరణ చేశాం. కన్నడలో ఏడు సినిమాలు తీస్తే అందులో నాలుగు సినిమాలు సూపర్‌హిట్ అయ్యాయి. తెలుగులో మంచి దర్శకుడిగా స్థిరపడాలని తొలి ప్రయత్నం చేశాను. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందని భావిస్తున్నానని అన్నారు.

నిర్మాత మాట్లాడుతూ 'హార్రర్ కథకు యాప్ట్ అయినా టైటిల్ ఇది. పూర్ణ.కె కెమెరా పనితనం సినిమాకు ప్లస్ అవుతుంది. గిరిధర్ దివాన చక్కటి బాణీలు అందించారు. సెన్సార్ పూర్తయింది. త్వరలో పాటల్ని విడుదల చేసి, సినిమాను ప్రేక్షకుల ముందుకి తీసుకొస్తాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్ణ, హీరో కిరణ్, హీరోయిన దివ్యరావు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్‌లో 'దేవిశ్రీ ప్రసాద్'



ధన రాజ్, భూపాల్, మనోజ్ నందన్

ఆర్.ఒ.క్రియేషన్స్, యశ్వంత్ మూవీస్ పతాకాలపై సంయుక్తంగా భూపాల్, మనోజ్ నందన్, పూజా రామచంద్రన్ ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'దేవిశ్రీ ప్రసాద్'. 'సశేషం', 'భూ' చిత్రాల దర్శకుడు శ్రీ కిషోర్ దర్శకత్వంలో రూపొందుతోన్న థ్రిల్లర్ ఎంటర్‌టైనర్ ఇది. డి.వెంకటేష్, ఆర్.వి.రాజు, ఆక్రోష్ నిర్మించారు. ఇందులో ప్రముఖ కమెడియన్ ధనరాజ్ కీలక పాత్రలో నటించారు. సినిమా విడుదలకు సిద్ధమైంది. దర్శక నిర్మాతలు మాట్లాడుతూ 'ఇందులో ప్రతి సన్నివేశం ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. ప్రధానంగా మనోజ్ నందన్, భూపాల్, ధనరాజ్, పూజా రామచంద్రన్ చుట్టూ తిరిగే ఈ థ్రిల్లర్‌లో ప్రతి సీన్ ఎంతో బాగుంటాయి. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సోషల్ మీడియాలో ఈ టీజర్‌ను టెన్ మిలియన్ ప్రేక్షకులు వీక్షించారు. ఓ చిన్న సినిమాకు ఇంత ఆదరణ రావడం ఎంతో ఆనందంగా ఉంది. మంచి మెసేజ్, ఎంటర్‌టైన్‌మెంట్‌తో సినిమా సాగుతుంది. సినిమాను అక్టోబర్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.

ది జోయ ఫ్యాక్టరీ

సోనమ్ కపూర్ ప్రస్తుతం సంజయ్ దత్ జీవితాధారంగా తెరకెక్కుతోన్న 'పద్మన్'లో ముఖ్య పాత్ర పోషిస్తోంది. 'వీరెయ్ డి వెడ్డింగ్' అనే పౌరాణిక సినిమాలోనూ చేస్తోంది. ఇప్పుడు మరో ఆసక్తికరమైన చిత్రంలో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రముఖ మోడలింగ్ ఏజెన్సీలో పని చేసే వ్యక్తి కొన్ని కారణాల వల్ల ఆ సంస్థ నుంచి బటయకొచ్చేస్తుంది. కొత్తగా ఓ ఏజెన్సీని పెట్టి ఇండియన్ క్రికెట్ టీమ్‌కు ప్రకటనను రూపొందిస్తుంది. కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. కానీ ఆ జట్టే ప్రపంచ కప్‌ను సాధిస్తుంది. ఇదీ సినిమా...దీన్ని అనుజు చౌహాన్ రచించిన 'ది జోయ ఫ్యాక్టరీ' నవల ఆధారంగా రూపొందిస్తున్నారు. ఈ విషయాన్ని సోనమ్ కపూర్ తన ట్విట్టర్ ద్వారా తెలిపింది. ఈ సినిమాలో ఆర్తి శెట్టి, పూజా శెట్టి సిస్టర్స్ నటిస్తున్నారు. క్రికెట్ ప్లేయర్ అభిషేక్ శర్మ కూడా నటిస్తుండడం విశేషం.



సోనమ్ కపూర్

50 కవల జంటలతో టీజర్

వరుణ్ ధావన్, జాక్విలిన్ ఫెర్నాండేజ్, తాప్సి నటించిన బాలీవుడ్ చిత్రం 'జుద్వా2'. ఇందులో ధావన్ కవలలుగా ద్విపాత్రాభినయం చేశాడు. ఈ సినిమా బృందం కొన్ని నెలలు క్రితమే ఓ ప్రకటన చేసింది. కవలల మధ్య ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేస్తామని చెప్పింది. దీని కోసం ట్విట్టర్‌లో కాంటెస్ట్ నిర్వహించింది. అందులో 50 మంది కవల జంటలు ఎంపికయ్యారు. వీరి మధ్య ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సినిమా ప్రమోషన్‌లో వీరు కూడా భాగస్వామ్యం అవుతారు. ఈ ట్రైలర్ విడుదల కార్యక్రమంలో వీరందరినీ సమన్వయం చేయడంలో సెక్యూరిటీ కాస్తా ఇబ్బందులు పడింది. 'జుద్వా2' ను డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించాడు. వచ్చే నెల 29వ తేదీన విడుదల కానుంది.



50 కవల జంటలతో తాప్సి, జాక్విలిన్ ఫెర్నాండేజ్, వరుణ్ ధావన్

అనుకున్న టైమ్‌కే

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'పద్మావతి'. ఈ సినిమా ప్రారంభం నుంచీ ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఇటీవల ఉత్తర భారతదేశ సినీ నటులు తమకు వేతనాలు పెంచాలని, విధుల పని వేళలు నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టారు. ఈ ప్రభావం కూడా ఈ చిత్రంపై పడింది. దీంతో సినిమా అనుకున్నట్టు నవంబర్ 27వ తేదీన విడుదల చేయడం కష్టమని ప్రచారం జరిగింది. దీనిపై చిత్రబృందం స్పందించింది. సినిమా ఇప్పటికే 90 శాతం పూర్తయిపోయింది. మిగిలిన పది శాతం చిత్రీకరణ జరిగితే పోస్టు ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుగా అనుకున్న తేదీకే 'పద్మావతి'ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని చెప్పింది. దీపికా పదుకొనే, షాహిద్ కపూర్ భాగం పూర్తి కావచ్చిందనీ భన్సాలీ అన్నారు. షూటింగ్ పూర్తి కాకుండా తనకు తెలియకుండా విదేశాలకు వెళ్ల వొద్దని వాళ్లకు చెప్పినట్టు భన్సాలీ పేర్కొన్నారు. కానీ తనకు చెప్పకుండా వీరిద్దరూ కుటుంబ సభ్యులతో హాలీడే టూర్‌కు వెళ్లారని అందువల్లే వారిపై జరగాల్సి మరో ఐదుశాతం షూటింగ్ మిగిలి ఉందంతే అన్నారు.



దీపికా పదుకొనే



నివాసం



ఇలా చేస్తే.. తాజాగా ఉంటాయి!

ఉదయాన్నే లేచి కూరగాయలు తరగడం, వంట చేయడం, పిల్లలను రెడీ చేయడం, ఇంట్లో పనులు చూసుకోవడం ఇలా నిత్యం.. అనేక పనులతో సతమతవుతుంటారు మహిళలు. అదే సమయంలో కొంతమంది ఉద్యోగాల నిమిత్తం ఆఫీసులకు వెళ్లాల్సి రావడం, ఇంటికొచ్చిన తర్వాతా ఆఫీసు పనులు చూసుకోవడం వంటి వాటితో సతమతమవ్వడం మనం చూస్తూనే ఉంటాం. ఈ క్రమంలో ప్రతిరోజూ ఉదయం వంట చేయడానికి ముందు కాయగూరలు కట్ చేయడానికి కొంచెం ఎక్కువ సమయం పడుతుందనీ, కొంతమంది ముందే కట్ చేసి పెట్టుకుంటారు. అయితే అలా కట్ చేసిన కూరగాయలు కొన్ని రకాలు తాజాగానే ఉన్నా, మరికొన్ని పాడవుతుంటాయి. అలా ఎందుకు జరుగుతుందో తెలుసుకోలేక నానా అవస్థలు పడుతుంటారు. వీటిని ఎలా భద్రపరుచుకోవాలనే సందేహం చాలా మంది మహిళలకు ఎదురయ్యే సమస్య. అందుకే కట్ చేసిన కూరగాయలు ఏవిధంగా భద్రపరచుకోవాలో ఈ వారం 'నివాసం'లో .!



పనులు త్వరగా అవ్వాలంటే ముందుగానే వాటికి సంబంధించిన వాటిని సిద్ధం చేసుకుంటాం. అలాగే వంట త్వరగా అవ్వాలంటే ఉదయాన్నే హడావుడి పడకుండా ముందుగానే కట్‌చేసి పెట్టుకుంటే ఆ పని త్వరగా పూర్తిచేసుకునే ఆస్కారం ఉంటుంది. కానీ కొన్నిరకాల కూరలు ముందుగా తరగడం వల్ల పాడయ్యే ప్రమాదం ఉంది. అలాంటివి ఏవి..? వాటిని ఎలా భద్రపరుచుకోవాలని..? వంటి సందేహాలు చాలా మందిని వేధిస్తున్న సమస్య. అలాంటి వారికోసం ఈ వివరాలు..



ఆకుకూరలు : ఆకుకూరలు ఫ్రిజ్‌లో భద్రపరచడానికి ముందే వాటిని ఆకులను కొమ్మలను నుంచి వేరుచేయాలి. ఈవిధంగా చేసిన ఆకుల్లో ఎండిపోయినవి, వాడిపోయినవి, కుళ్లినట్లు కనిపించే వాటిని వేరుచేసి తీసేయాలి. ఇప్పుడు మిగిలిన తాజా ఆకుల్ని ఫ్రిజ్‌లో పెట్టొచ్చు. దీనికోసం ఒక పేపర్ టవల్ లేదా పలుచని కాటన్ వస్త్రం తీసుకుని అందులో ఆకులు వేసి చుట్టేసి ఫ్రిజ్ లో పెట్టుకోవచ్చు. అయితే ఆకుకూరలు సాధారణంగా రెండురోజులు మాత్రమే తాజాగా ఉంటాయి.

క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బ్రొకోలీ : వీటిరి కట్ చేసిన వెంటనే ఒక ప్లాస్టిక్ కవర్‌లో వేసి వెంటనే ఫ్రిజ్‌లో భద్రపరచుకోవాలి. కాలీఫ్లవర్, బ్రొకోలి వంటి కూరగాయలు కట్ చేసినప్పటికీ వాటిలో తేమని అంత తొందరగా కోల్పోవు. అందుకే క్యాలీఫ్లవర్ గాలి తగలని వాటిలో వేసి భద్రపరుచుకోవాలి. బ్రొకోలీని ముక్కలుగా చేసి తర్వాత నెట్‌తో ఉన్న కవర్లలో వేసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు తాజగా ఉంటాయి.

ఉల్లిపాయలు : ఉల్లిపాయలు కోసిన వెంటనే వాటిని గాలి తగలని డబ్బాల్లో వేసి ఫ్రిజ్‌లో ఉంచాలి. అయితే ఈ ఉల్లిపాయముక్కల్ని ఒక రోజు లోపల వినియోగించుకోవడం తప్పనిసరి. ఆ తర్వాత అవి వాటి తాజాదనాన్ని కోల్పోతాయి.

వంకాయలు : సాధారణంగా వంకాయలు కట్ చేసిన కాసేపటికే రంగు మారిపోవడం మనం గమనిస్తుంటాం. అయితే వాటి మీద పసుపు, నిమ్మరసం కలిపిన నీటిని చల్లితే అవి రంగు మారకుండా తాజాగా ఉంటాయి. అలాగే కట్ చేసిన వంకాయల్ని ఫ్రిజ్‌లో భద్రపరుచుకోవాలనుకుంటే వాటిని గుండ్రంగా కట్ చేసుకుని, ఆ ముక్కల్ని పేపర్ టవల్స్ మధ్య వేసి ఒక డబ్బాలో పెట్టి ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. ఇలా చేస్తే వంకాయ ముక్కలు రెండురోజుల పాటు తాజాగా ఉంటాయి.

దుంపలు : బంగాళదుంప, ముల్లంగి, క్యారెట్...మొదలైనవి కట్ చేసి ఎక్కువ రోజులు ఫ్రిజ్‌లో భద్రపరచడంవల్ల అవి వాటి మృదుత్వాన్ని కోల్పోతాయి. అలాగే వాటి రంగూ మారిపోతుంది. దుంప జాతి కూరల్లో ఉండే తేమ శాతం త్వరగా తగ్గిపోవడం వల్ల వాటి రుచీ తగ్గిపోతుంది. కాబట్టి, ఇలాంటివి కట్ చేసిన వెంటనే ఒక గిన్నెలో నీరు పోసి, అందులో కట్ చేసిన కూరలు వేసి, వదులైన మూతపెట్టి భద్రపరుచు కోవాలి. అయితే ఇవి కేవలం ఒకరోజు మాత్రమే ఉంటాయి. కాబట్టి వండుకోవడానికి ఒకరోజు ముందు మాత్రమే వాటిని కట్ చేసుకోవడం ఉత్తమం.





కీరదోసకాయలు : కీరదోసకాయ ముక్కలు ఎక్కువ సమయం బయట ఉంచకూడదు. అందుకే గాలి తగలని బ్యాగ్స్ లేదా డబ్బాల్లో వేసి వీటిని భద్రపరుచుకోవాలి. ఇలా చేస్తే కీరదోస ముక్కలు మూడురోజుల వరకూ తాజాగా ఉంటాయి.

కట్ చేసిన టమాటో ముక్కలు : కట్ చేసిన టమాటో ముక్కలు ఎక్కువ సమయం నిల్వ ఉండవు. అందుకే ఒకవేళ వాటిని భద్రపరచాలనుకుంటే ఒక గిన్నెలో వాటిని వేసి పైన వదులుగా మూత పెట్టాలి. అయితే ఇలా భద్రపరచినవి కేవలం 24 గంటలు మాత్రమే తాజాగా ఉండే అవకాశం ఉంటుంది. వీలైనంత వరకూ కట్ చేసినా, చేయకపోయినా టమోటాలను ఫ్రిజ్‌లో పెట్టకపోవడం మంచిది.





అల్లం వెల్లుల్లి : తొక్క తీసేసినవి కట్ చేసినవి విడివిడిగా గాలి తగలని బాక్స్‌ల్లో వేసి భద్రపరుచుకోవాలి. ఇవి దాదాపు ఐదురోజులకు వరకూ తాజాగా ఉంటాయి.

మిరకపకాయలు : మిరపకాయలు కట్ చేసుకున్న తర్వాత వాటినీ గాలి తగలకుండా భద్రపరుచుకోవాలి. వాటికి తడి తగిలితే జిగురుగా మారి, తొందరగా పాడైపోతాయి.. కట్ చేసిన కూరగాయల్ని తాజాగా భద్రపరచడం ఎలాగో చూశారుగా. మరి మీరూ ఈ చిట్కాలను అనుసరించి సమయాన్ని ఆదా చేసుకోండి. తాజా..తాజా కూరలతో రుచికరమైన వంటలను వండుకోండి...

- లక్ష్మి తేజశ్విని

ఇలా చేద్దాం!

ఇంట్లో వాడే క్యాండిల్స్‌తో కొత్తగా ఆలోచిస్తే సరికొత్తగా తీర్చిదిద్దొచ్చు అదేలాగో ఈ ఫోటోలు చూడండి!!





చిన్నారి

పొడుపు కథ

ఓ ఆకు.. మర్రి ఆకు.. ఓ కాయ..
మామిడి కాయ..
ఓ పువ్వు మల్లెపువ్వు

జోక్ :


టీచర్ : సోనూ..! ఏంటిరా స్కూలుకి తాడు తీసుకొచ్చావ్..?

సోను : నిన్న మీరే కదా టీచర్ అందరూ ఏకతాటిపై నిలబడాలన్నారు అందుకే..!

టీచర్ : ఆ..!!??

దారి కనుక్కోండి!

పిల్లలూ..! కింద పటంలో ఎలుగుబంటి సీల్‌చేపను చేరాలంటే ఏదారిలో వెళ్లాలో కనుక్కోండి ?





అతిపెద్ద విమానం

ప్రపంచంలోనే పెద్ద ఎయిర్‌క్రాఫ్ట్... ఎంతుంటుందంటే ఫుట్‌బాల్ మైదానమంత.. కొంతకాలం క్రితం మొదటిసారిగా గాల్లోకెగిరింది... మరి దాని సంగతులు మనమూ తెలుసుకుందామా?!

రెండు విమానాల్ని పక్కపక్కన కలిపితే ఎలా ఉంటుంది? ఒక పెద్ద ఆకారంలో ఉంటుంది కదా! అలాంటి ఎయిర్‌క్రాఫ్ట్ కొంతకాలం క్రితం ఇంగ్లండ్‌లో బెడ్‌ఫోర్డ్‌షైర్‌లో చక్కర్లు కొట్టింది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద ఎయిర్‌క్రాఫ్ట్. యంత్రాల సాయంతో గాల్లో ఎగిరే హెలికాప్టర్లు, విమానాల్లాంటి వాటినన్నింటినీ ఎయిర్‌క్రాఫ్టలనే అంటారు. అలా గాల్లో ఎగిరే వాటన్నింటిలో ఇదే పెద్దదన్నమాట. దీనిపేరు ఎయిర్‌ల్యాండర్ 10. ఇది ఏకంగా 92 మీటర్ల పొడవు, 43.5 మీటర్ల వెడల్పు ఉంది. అంటే దాదాపుగా ఓ ఫుట్‌బాల్ మైదానమంత పరిమాణమన్నమాట. 10 టన్నుల బరువును ఒక్కసారే మోసుకెళ్లిపోగలదు.

మరి దీని ప్రత్యేకతలేంటో తెలుసా? గంటకు 90 మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. 1600 అడుగుల ఎత్తు వరకు వెళ్లగలదు. అవసరమైతే రోజుల తరబడి గాల్లోనే ఉండి భూమిపై నిఘా పెట్టగలదు. వాతావరణం బాగాలేకపోయినా, గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నా ఇది సురక్షితంగా ఎగరగలదు. అంటే ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు సహాయక చర్యల కోసం దీన్ని ఉపయోగించుకోవచ్చు. 2011లో దీన్ని అమెరికా.. తమ సైనికావసరాల కోసం తయారుచేసింది. కానీ నిధులు లేక వీటి తయారీ మధ్యలోనే ఆగిపోయింది. తర్వాత ఇంగ్లండ్‌కు చెందిన హైబ్రిడ్ ఎయిర్ వెహికల్స్(హెచ్ఏవీ) అనే ప్రైవేటు సంస్థ దీన్ని పూర్తిచేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం అది ఇప్పటివరకూ ఏకంగా 300 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అంటే రెండు వేల కోట్ల రూపాయలకు పైమాటే! దీన్ని మరికొన్ని రకాలుగా పరీక్షించి సరుకులు, ప్రయాణికుల రవాణాకు వీలుగా దీన్ని రూపొందిస్తామని ఆ సంస్థ చెబుతోంది. ★



వజ్రాలమూట - 3

కథ: శాఖమూరి శ్రీనివాస్
బొమ్మలు: తుంబలి శివాజీ







ఖేల్‌రత్నాలు సర్ధార్ సింగ్, దేవేంద్ర

- ఎపి నుంచి జ్యోతి సురేఖ, సాకేత్‌కు అర్జున
- ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం
- కీడా పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి కోవింద్

న్యూఢిల్లీ : భారత అతున్నత క్రీడా పురస్కారాలైన రాజీవ్ గాంధీ ఖేల్‌రత్నాలతో రియో పారా ఒలింపిక్స్(జావెలిన్ త్రో ఎఫ్-46)లో స్వర్ణం సాధించిన పారా అథ్లెట్ దేవేంద్ర జజారియా, భారత సీనియర్ హాకీ జట్టు మాజీ కెప్టెన్ సర్ధార్ సింగ్‌లు మెరిశారు. హాకీ మాంత్రికుడు సర్ధార్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజున జాతీయ దినోత్సవం సందర్భంగా మంగళ వారం రాష్ట్రపతి భవన్‌లో భారత ప్రథమ పౌరుడు, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వివిధ రంగాల క్రీడాకారులకు ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతో పాటు లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డులతో సత్కరించారు.అర్జునకు ఎంపికైన 17 మందిలో భారత క్రికెటర్లు చటేశ్వర్ పూజారా, మహిళా జట్టు వైస్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్‌లతో పాటు, పారా ఒలింపిక్స్ అథ్లెట్లు మరియప్పన్ తంగవేలు, వరుణ్ భాటి, గోల్ఫర్ చౌరాసియా, ఏపి నుంచి ఆర్చరీ వెన్నం జ్యోతి సురేఖలున్నారు. కౌంటీ మ్యాచ్‌ల్లో బిజీగా ఉన్న చటేశ్వర్ పూజారా అవార్డు స్వీకరణ రాలేకపోతున్నానని ముందుగానే ప్రకటించాడు.

ఖేల్‌రత్న, అర్జున అవార్డుల ఎంపిక కమిటీకి చైర్మన్‌గా రిటైర్డు సుప్రిం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సికె టక్కర్, ద్రోణాచార్య,ధ్యాన్‌చంద్ అవార్డుల కమిటీకి చైర్మన్‌గా మాజీ బ్యాడ్మింటన్ ఆటగాడు పుల్లెల గోపీచంద్ వ్యవహరించిన విషయం తెల్సిందే.రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్నకు 7.5లక్షలు, అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలకు రూ.5లక్షల నగదు, మెమెంటో, సర్టిఫికెట్లను కోవింద్ ప్రధానం చేశారు.

అర్జున అవార్డు గ్రహీతలు వీరే...

విజె సురేఖ(ఆర్చరీ), కుష్బీర్ కౌర్, ఆరోఖ్య రాజీవ్(అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్(బాస్కెట్‌బాల్), చటేశ్వర్ పూజారా, హర్మన్ ప్రీత్‌కౌర్ (క్రికెట్), ఓయినమ్ బెమ్‌బెమ్ దేవి(ఫుట్‌బాల్), ఎస్ఎస్‌పి చౌరాసియా(గోల్ఫ్), ఎస్‌వీ సునీల్(హాకీ), జస్వీర్ సింగ్(కబడ్డీ), పిఎన్ ప్రకాష్ (షూటింగ్),ఎ అమల్‌రాజ్(టేబుల్ టెన్నిస్), సాకేత్ మైనేని (టెన్నిస్), సత్యవర్ట్ కడియాన్(రెజ్లింగ్), మరియప్పన్, వరుణ్ భాటి(పారా అథ్లెట్స్).

ద్రోణాచార్య అవార్డులు :

డాక్టర్ (దివంగత) టికె గాంధీ (అథ్లెటిక్స్) తరపున ఆమె భార్య అవార్డును స్వీకరించారు. హీరా నంద్ కటారియా(కబడ్డీ),లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ కింద జిఎస్ఎస్‌వి ప్రసాద్(బ్యాడ్మింటన్), బ్రిజ్ భూషణ్ మొహంతి(బాక్సింగ్), పిఎ రాఫెల్(హాకీ), సంజయ్ చక్రవర్తి(షూటింగ్), రోషన్ లాల్(రెజ్లింగ్) లైఫ్ టైమ్ అవార్డులను అందుకున్నారు.

ధ్యాన్‌చంద్ అవార్డులు:

భూపేందర్ సింగ్ (అథ్లెటిక్స్), సయ్యద్ షాహిత్ హకీమ్(ఫుట్‌బాల్), సమురై తెతి (హాకీ)లకు ధ్యాన్‌చంద్ అవార్డులను స్వీకరించారు.



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అర్జున అవార్డుల అందుకుంటున్న హర్మన్ ప్రీత్ కౌర్ (క్రికెట్)



సత్యవత్ (రెజ్లింగ్)



కుష్బీర్ కౌర్ (అథ్లెట్)



మరియప్పన్ తంగవేలు (పారా అథ్లెట్)



గాంధీ తరపున ద్రోణాచార్య స్వీకరిస్తున్న ఆయన సతీమణి



రోషన్‌లాల్ (ద్రోణాచార్య లైఫ్‌టైమ్ అవార్డు)

తెలుగు అర్జునులు


జాతీయ క్రీడాదినోత్సవ సంబరంలో ఆంధ్రప్రదేశ్ నుంచి కృష్ణా జిల్లాకు చెందిన వెన్నం జ్యోతి సురేఖ(ఆర్చరీ), సాకేత్ మైనేని(టెన్నిస్)ల్లో అర్జున అవార్డులతో మెరిశారు. రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా అర్జున పురస్కారాలను ఈ ఇద్దరు మంగళవారం అందుకున్నారు.

విలువిద్యకే వన్నె తెచ్చిన వెన్నం జ్యోతి...



విజయవాడలో ఓల్గా ఆర్చరీ అకాడమీ కోచ్ చెరుకూరి సత్యనారాయణ సారథ్యంలో విలువిద్యలో రాటుదేలిన తెలుగు బాణం వెన్నెం జ్యోతి సురేఖ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పింది. ప్రపంచ మహిళా ర్యాంకింగ్స్‌లో టాప్ 20లో ఉన్న సురేఖ అంతర్జాతీయ స్థాయిలో 17 పతకాలను కైవసం చేసుకుంది. జాతీయ స్థాయిలో 50 పతకాలను సాధించింది.నాలుగేళ్ల ప్రాయంలోనే కృష్ణా నదిని ఈది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుకెక్కింది. 13 ఏళ్ల వయస్సులో 2007లో ఆర్చరీలో ప్రవేశించింది. 2011లో అంతర్జాతీయంగా పోటీపడే స్థాయికి ఎదిగింది. సురేఖ 2011 ఇరాన్ ఆసియా ఆర్చరీలో కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్యం, 2015 బ్యాంకాక్‌లో జరిగిన వ్యక్తిగత ఈవెంట్‌లో స్వర్ణం సాధించింది. 2013 చైనాలో జరిగిన మహిళా జూనియర్ కాంపౌండ్ టీమ్, వ్యక్తిగత ఈవెంట్లలో కాంస్యాలను కైవసం చేసుకుంది. ఇటీవల ఉలాన్‌బతర్‌లో జరిగిన ప్రపంచ స్టేజ్ పోటీల్లో తృటిలో కాంస్యం చేజార్చుకుంది.

సాకేత్ రాకెట్‌తో సత్తా...



కృష్ణా జిల్లాలోని ఉయ్యూరులో అక్టోబర్ 19, 1987 జన్మించిన ఇండియన్ ప్రొఫెషనల్ టెన్నిస్ స్టార్ సాకేత్ మైనేని పలు డబుల్స్ టోర్నీల్లో ఎపి సత్తా చాటాడు. స్కూలింగ్ అంతా విశాఖపట్నంలోను ఆ తర్వాత హైదరాబాద్‌కు మకాం మార్చాడు. ప్రస్తుతం అమెరికాలో సాకేత్ స్థిరపడ్డాడు.భారత్‌కు డేవిస్‌కప్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న 29 ఏళ్ల సాకేత్ 2014 ఆసియా గేమ్స్‌లో మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జాతో కలిసి స్వర్ణం,పురుషుల డబుల్స్‌లో సనమ్ సింగ్‌తో కలిసి రజతం సాధించాడు. కెరీర్‌లో ఇప్పటి వరకు ఐటిఎఫ్ టైటిళ్లు 9, ఏటిపీ ఛాలెంజర్ టైటిళ్లను రెండింటిని కైవసం చేసుకున్నాడు. డబుల్స్‌లో 12 ఐటిఎఫ్, ఆరు ఏటిపి డబుల్స్ టైటిళ్లను తన ఖాతాలో వేసుకున్నాడు. 2016 ఏప్రిల్ 25న అత్యుత్తమ ర్యాంకు(113)లో నిలిచాడు. ప్రస్తుత ర్యాంకు 562. గ్రాండ్ స్లామ్ సింగిల్స్‌లో యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లో ఆడాడు.

షరపోవా అదరహో..

టాప్‌సీడ్స్ హలెప్, కొంటాకు షాక్

యూఎస్ రెండో రౌండ్‌కు వీనస్, జ్వెరెవా



న్యూయార్క్ సిటి : యూఎస్ ఓపెన్ తొలి రౌండ్‌లోను టాప్‌సీడ్స్‌కు చుక్కెదురైంది. సిమోని హలెప్(రెండో సీడ్), జోహన్నా కొంటా (ఏడో సీడ్)లు తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు.రష్యన్ టెన్నిస్ తార మరియా షరపోవా అదిరే ఆరంభంతో శుభారంభం చేసింది. రెండున్నర గంటలపైనే హోరాహోరీగా సాగిన పోరులో 24 వేల మంది ప్రేక్షకుల నడుమ రెండో సీడ్ సిమోని హలెప్(రొమేనియా)కు తొలి రౌండ్‌లోనే షాక్ ఇచ్చింది. సస్పెన్షన్‌కు గురై 19 నెలలు తర్వాత తొలి గ్రాండ్‌స్లామ్ పోరులో వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో బరిలో దిగింది. షరపోవా తనదైన శైలిలో 6-4,4-6,6-3తో హెలెప్‌పై జయభేరి మోగించి రెండో రౌండ్‌కు చేరింది. ఏడో సీడ్ కొంటా (బ్రిటన్)కు అల్జెగాంద్ర క్రూనిక్ (సెర్బియా) 4-6,6-3,6-3తో షాక్ ఇచ్చింది. సొంతగడ్డపై వీనస్ క్వాలిఫైర్ విక్టోరియా కుజ్‌మొవా(స్లోవేకియా)పై 6-3,3-6,6-2తో గెలిచింది. కెనడా స్టార్ డెనిస్ షపలోవా మెద్వెద్వ్‌పై 7-5,6-1,6-2తో గెలిచి గ్రాండ్‌స్లామ్‌లో రెండోరౌండ్‌కు చేరింది. పురుషుల సింగిల్స్‌లో నాలుగో సీడ్ జ్వెరెవా(జర్మనీ) క్వాలిఫైర్ డారియన్ కింగ్(బార్బొడాస్)పై 3 గంటల పోరులో 7-6(9),7-5, 6-4తో జయభేరి మోగించాడు. సిలిక్ (క్రోయేషియా) సాండ్‌గ్రెన్(అమెరికా)పై 6-4,6-3,3-6,6-3తో విజయం సాధించి రెండో రౌండ్‌కు ప్రవేశించాడు.

గౌరవ్‌కు పతకం ఖరారు

అనూహ్యంగా ప్రపంచ బాక్సింగ్ సెమీస్‌కు చేరిక



పారిస్ : ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో గౌరవ్ బిదూరి తన సత్తా చాటాడు. కీలకమైన బాక్సర్లు అంతా నిరాశ జనకమైన ప్రదర్శనతో పతకం తెచ్చే వారన్న పేరున్న శివ థప, మనోజ్ కుమార్, వికాస్‌లు ఇంటి ముఖం పట్టిన దశలో భారత్‌కు నాలుగో పతకం అందించే ఖ్యాతి నార్జించాడు. మంగళవారం తొలి పతాకాన్ని ఖరారు చేశాడు.తన అద్భుత ప్రతిభతోక్వార్టర్ ఫైనల్‌లో 56 కిలోల విభాగంలో గౌరవ్ ట్యునిషియా బాక్సర్ బిలెల్ మెహ్మదిపై జయభేరి మోగించి సెమీస్‌కు చేరాడు. వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో ఛాంపియన్‌షిప్‌లో బరిలో దిగిన గౌరవ్ సెమీస్‌లో గెలిస్తే రజతం, ఓడితే కాంస్యం దక్కనుంది. దీంతో భారత్‌కు నాలుగో పతకం అందించిన ఘనత వహించనున్నాడు. వికాస్ కృష్ణన్(2011), అంతకు ముందు విజేందర్ సింగ్(2009), శివ థప (2015)ల్లో భారత్‌కు ఈ మెగా ఈవెంట్లలో కాంస్యాలను అందించారు.

రాజీనామాలు చేస్తాం : శ్రీలంక సెలక్టర్లు

భారత్‌తో సిరిస్ ఓటములే ప్రధాన కారణం

కొలంబో : భారత్‌తో టెస్ట్,వన్డే సిరీస్‌ల్లో ఘోర వైఫల్యంతో శ్రీలంక సెలక్టర్లు మూకుమ్మడిగా రాజీ నామాలు చేయాలని తీర్మానించుకున్నారు. స్వదేశంలో అవమానకర ఓటములపై అభిమానుల ఆందోళనలు, మరోవైపు పరిపాలనలో రాజకీయ జోక్యంతో సమూల మార్పులను కోరుతూ సనత్ జయసూర్య ఆధ్వర్యంలోని సెలక్టర్ల బృందం రాజీనామాలు చేయాలని నిర్ణయించుకున్నారు. భారత్‌తో సిరీస్ ముగిసాక వారి తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. టీమిండియాతో 3-0తో టెస్ట్ సిరీస్, ఐదు వన్డేల సిరీస్‌లో 3-0తో కోల్పోయిన శ్రీలంక జట్టు ఆటతీరుపై తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. 2016 మే ఒకటిన ఎంపికైన సనత్ జయసూర్య ఆధ్వర్యంలోని కలువతరణ, రంజిత్ మదురు సింఘే, ఎరిక్ ఉపషంత, అసంక గురుసిన్హాతో కూడిన సెలక్షన్ కమిటీ దిగిపోయేందుకు రంగం సిద్ధమైంది.

ఆగాల్సింది ఆమదాలవలసలో... ఆగింది చీపురుపల్లిలో...

గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన స్టేషన్ మాస్టర్

స్టేషన్ దాటిన ప్రత్యేక రైలు

ప్రజాశక్తి- ఆమదాలవలస (శ్రీకాకుళం జిల్లా)

హౌరా నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ప్రత్యేక సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆమదాలవలస (శ్రీకాకుళం రోడ్) రైల్వేస్టేషన్‌లో మంగళవారం ఆగాల్సి ఉండగా, స్టేషన్ మాస్టర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రైలు స్టేషన్ దాటింది. ఆమదాలవలసలో హాల్టింగ్ ఇవ్వలేదన్న సమాచారం అందుకున్న రైల్వే అధికారులు చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో ఆ రైలును నిలుపుదల చేశారు. 07183 నంబరుగల హౌరా-సికింద్రాబాద్ ప్రత్యేక రైలు షెడ్యూల్ ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 12.55 గంటలకు ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలి. కానీ 2.35 గంటలు ఆలస్యంగా 3.30 గంటలకు చేరుకుంది. ఆ రైలుకు ఆమదాలవలసలో హాల్ట్ ఉన్నా, స్టేషన్ మాస్టర్‌కు విశాఖపట్నం నుంచి ఆ రైలు హాల్టింగ్ సమాచారం రాకపోవడంతో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో రైలు ఆమదాలవలసలో ఆగకుండా వెళ్లిపోయింది. ఆ రైలులో ఆమదాలవలస నుంచి 26 మంది రిజర్వేషన్, సుమారు 60 మంది సాధారణ టికెట్ ప్రయాణికులు ప్రయాణించాల్సి ఉంది. రైలు వెళ్లిపోవడంతో ఆందోళన చెందిన ప్రయాణికులు స్టేషన్ మాస్టర్‌ను నిలదీయడంతో, ఆయన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. దీంతో ప్రత్యేక రైలును చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేశారు. ఇక్కడ నుంచి ప్రయాణికులను పలాస నుంచి విశాఖపట్నం వెళ్లే ఇఎంయు (పాసింజర్)లో తరలించి అక్కడ ప్రత్యేక రైలు ఎక్కించారు. ఈ తతంగం తర్వాత చీపురుపల్లిలో సుమారు 45 నిమిషాల అనంతరం ప్రత్యేక రైలు బయలుదేరింది.



మృతి చెందిన శాంతకుమారిని తరలిస్తున్న పోలీసులు

విద్యార్థినులపై దూసుకెళ్లిన టిప్పర్

ఒకరు మృతి

ఏడుగురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-ఓర్వకల్లు

కర్నూలు జిల్లా ఓర్వకల్లు సమీపంలో మంగళవారం విద్యార్థినులపై టిప్పర్ దూసుకెళ్లడంతో ఓ విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓర్వకల్లు పోలీసు స్టేషన్ సమీపంలో ఆర్‌సి ఎల్లారెడ్డి కళాశాల ఉంది. విద్యార్థులు ఓర్వకల్లు బస్టాండ్‌లో దిగి అర కిలోమీటరు నడిచి కళాశాలకు చేరుకోవాలి. ఈ క్రమంలో మంగళవారం ఉదయం విద్యార్థినులు నడుచుకుంటూ కళాశాలకు వెళ్తుండగా వేగంగా వచ్చిన టిప్పర్ వారిపైకి దూసుకెళ్లింది. దీంతో హుస్సేనాపురం గ్రామానికి చెందిన పి. శాంతికుమారి (16) టిప్పర్ టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఏడుగురు విద్యార్థినులు మహాలక్ష్మి, మాధవి, పరిమళ, మమత, నిర్మల, శోభారాణి, సుస్మిత తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో మహాలక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన విద్యార్థినులను పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరంతా ఓర్వకల్లు, శకునాల, హుసేనాపురం, కాల్వ గ్రామాలకు చెందిన విద్యార్థినులు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఎస్. సత్యనారాయణ, ఎస్‌పి గోపినాథ్‌జెట్టి, డిఎస్‌పి డి.రమణమూర్తి విద్యార్థినులను పరామర్శించారు.

కోస్తాంధ్రకు ముసురు

- ఉధృతంగా ప్రవహిస్తున్న 'వంశధార'
- శ్రీకాకుళంలో వేలాది ఎకరాల్లో పంటలు నీటమునక
- విజయనగరంలో నీటి ముంపులోనే పలు కాలనీలు
- తూర్పుగోదావరి జిల్లాలో వెయ్యి ఎకరాల్లో మినప పంటకు నష్టం



శ్రీకాకుళం జిల్లాలో ఉధృతంగా ప్రవహిస్తున్న వంశధార నది



విశాఖ నగరంలో ఇళ్లలోకి ప్రవేశించిన వర్షపు నీరు

ప్రజాశక్తి- యంత్రాంగం

వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లాల్లో మంగళవారం కూడా వర్షాలు కొనసాగాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి. శ్రీకాకుళంలోని నాగావళి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. విజయనగరం జిల్లాలో 21.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జామి మండలంలో 54.8 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పాచిపెంట మండలంలో 3.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పార్వతీపురంలోని వరహాలగెడ్డ పొంగి ముంపునకు గురైన రాజీవ్ గృహకల్ప, ఎస్ఎన్ఎన్‌పురం, వివేక్ కాలనీ, నెల్లిచెరువుగట్టు తదితర ప్రాంతాల్లో వరద నీరు ఇంకా నిలిచి ఉంది. వర్షాలతో వరి నాట్లు ఊపందుకున్నాయి.

శ్రీకాకుళం జిల్లాలో 41 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. నరసన్నపేట మండలంలో గరిష్టంగా 114.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వంశధార నది ఉధృతంగా ప్రవహిస్తోంది. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ నుంచి 35 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. మందస మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గొరకల దామోదరం పూరిల్లు కూలిపోయింది. ఎచ్చెర్ల మండలంలోని పెద్దది ఊటగెడ్డ నీరు కొంగరాం-ముద్దాడ మధ్య ఉన్న కాజ్‌వేపై ప్రవహిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలాస మండలం కంబిరిగాం బ్రిడ్జిపై నుంచి వరహాలగెడ్డ నీరు ఉప్పొంగి ప్రవహించడంతో 12 గ్రామాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

విశాఖ నగరంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం అర్ధరాత్రి పాత అడవివరంలో గోడ కూలి ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాలోని పలు మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. మన్యంలోని గంగవరం, దేవీపట్నం, రంపచోడవరం, రాజవొమ్మంగిలో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గంగవరంలో జువ్వమ్మ కాలువ, మడేరువాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దేవీపట్నంలో సీతాపల్లి వాగు ఉధృతికి పోలీస్ వారధి కొట్టుకుపోయింది. వెయ్యి ఎకరాల్లో మినప పంట నీట మునిగింది. రంపచోడవరం-తాటివాడ మధ్యలో ఉన్న కొండ కాలువ ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. కాకినాడలో ఉదయం నుంచి చిన్నపాటి వర్షం కురుస్తూనే ఉంది. కోనసీమలో అక్కడక్కడా చెదురుమదురు జల్లులు కురిశాయి. మిగిలిన ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంది. జిల్లా వ్యాప్తంగా 4.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

24 గంటల్లో వాయుగుండం

చత్తీస్‌గఢ్‌పై కొనసాగుతున్న అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారినట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. 24 గంటల్లో ఇది మరింత బలపడి వాయుగుండంగా మారుతుందని తెలిపింది. దీనికి అనుబంధంగా 7.6 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్లు తెలిపింది. మరోవైపు విదర్భ నుంచి తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ తమిళనాడు వరకూ ద్రోణి స్థిరంగా కొనసాగుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. వీటి ప్రభావంతో బుధ, గురువారాల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు జల్లులు పడతాయని పేర్కొంది. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. కోస్తాలో పలు చోట్ల జల్లులు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

విశాఖ మెడ్‌టెక్ పారదర్శకమే

- ఆరోపణల్లో వాస్తవంలేదు
- జితేంద్రను ముఖ్యమంత్రే నియమించారు
- మంత్రి కామినేని వివరణ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ మెడ్‌టెక్ జోన్ నిర్మాణం పారదర్శకంగానే జరుగుతోందని, టెండర్లలో అవినీతి జరిగిందన్న ఆరోపణల్లో వాస్తవంలేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. మంగళవారం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీలో విలేకరులతో ఆయన మాట్లాడారు. మెడ్ టెక్ జోన్ టెండర్లను డిపిఆర్ కంటే ఎక్కువ ధరకు ఇస్తున్నారని, అర్హత లేని కంపెనీలకు ముడుపులు కట్టబెడుతున్నారని గత నెల రోజు లుగా వస్తున్న విమర్శల్ని కామినేని ఖండించారు. అత్యాధునిక వైద్య పరికరాల్ని ఏర్పాటు చేసేందుకు 80 శాతం విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని ఆయన తెలిపారు. ఉన్నత ప్రమాణాలతో అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకే మెడ్‌టెక్ జోన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మెడ్‌టెక్ సిఇఒ పేరుతో నకిలీ మెయిల్ ఐడి ద్వారా ఇతర కంపెనీలకు మెయిల్స్ పంపించిన జ్యుడిష్ రాజు పై సైబర్ నేరం కింద అరెస్టు చేశారన్నారు. టెండర్లు, వైద్య రంగంలో మౌలిక వసతులు వంటి అంశాల్లో కేంద్ర ప్రభుత్వ సలహాదారుగా పనిచేసిన జితేంద్ర శర్మను సిఎం చంద్రబాబు సిఇఒగా నియమించారన్నారు. వైద్యఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి, మెడ్‌టెక్ జోన్ చైర్మన్ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ మెడ్‌టెక్ నిర్మాణంలో ఆర్థిక అంశాలను కాగ్ ఇప్పటికే ఆడిట్ చేసిందన్నారు. కేవలం 5 నిర్మాణాత్మక సూచనలు మాత్రమే ఇచ్చిందని, ఎలాంటి అవకతవకలకు ఇందులో తావులేదని స్పష్టంచేశారు. మెడ్‌టెక్ సిఇఒ జితేంద్ర శర్మ మాట్లాడుతూ రెండు దశల్లో నిర్మించే ఈ ప్రాజెక్టు వ్యయం రూ 1100 కోట్లు అవుతుందని, తొలి దశలో రూ 350 కోట్లు నుంచి రూ 380 కోట్లు అంచనా వేశామన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడిబి) కూడా ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. ఈ ప్రాజెక్టు టెండర్ వివరాల్ని, డాక్యుమెంట్లను మీడియాకు అందజేశారు.

ప్రజా తీర్పును వక్రీకరిస్తున్న జగన్

ఉప ముఖ్యమంత్రి కెఇ.కృష్ణమూర్తి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా తీర్పును వక్రీకరిస్తున్నారని, నంద్యాల ప్రజలు బుద్ధి చెప్పినా మారలేదని ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే 2019కి వైసిపి ఉనికినే కోల్పోవడం ఖాయమన్నారు. మంగళవారం టిడిపి కర్నూలు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నంద్యాల ఎన్నికల ఫలితాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల ప్రజలు అభివృద్ధికి ఓటేశారని, ఓటేసినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాతీర్పును అపహాస్యం చేసే విధంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. నంద్యాల ప్రజలు విజ్ఞత గలవారు కాబట్టి సమర్థతకు, అభివృద్ధికి పట్టం కట్టి, నీతికి అవినీతికి జరిగిన పోరులో అవినీతిని మట్టి కరిపించారన్నారు. టిడిపికి అఖండ విజయాన్ని అందించిన మహిళలకు, మైనార్టీలకు, ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రశాంత్ కిషోర్ లాంటి వాళ్ళ సలహాల వల్ల కాకుండా ప్రజల హృదయాలను దోచుకుంటే ఓట్లు రావొచ్చని మొదట్నుంచీ చెబుతున్నామన్నారు. జగన్ ముఖ్య అనుచరుల ఆలోచన తీరును, ప్రచార ధోరణిని మార్చుకోవద్దని, మీరు ఇలానే కొనసాగిస్తే 2019 సార్వత్రిక ఎన్నికల్లో మా విజయం సులభమవుతుందని అన్నారు. ఓటమిని సైతం హుందాగా స్వీకరించలేని ప్రతిపక్ష నాయకున్ని మన రాష్ట్రం కలిగి ఉండడం దౌర్భాగ్యమన్నారు.

151 జీవో అమలు చేయాలి

వైద్య ఆరోగ్య కమిషనర్‌కు యూనియన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్య రంగంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీవో 151 ప్రకారం పెంచిన వేతనాలు అమలు చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు మంగళవారం ఆ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎ.వి. నాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న పారామెడికల్, యూరోపియన్ ఎఎన్ఎమ్, సెకండ్ ఎఎన్ఎమ్, యుహెచ్‌సి, ఎన్‌హెచ్‌ఎమ్, 104, 102, 108, ఎపి సాక్స్, ఏపివివిపి, ఆయుష్, ట్రామాకేర్, ఆరోగ్య మిత్ర తదితర విభాగాల్లో ఉద్యోగులకు వేతన పెంపు వర్తిస్తుందని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని చెప్పిన ఎన్నికల హామీని అమలు చేయాలని కోరారు. మహిళలకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులివ్వాలని డిమాండ్ చేశారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68